RNI NO.APTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

24.05.2024 శుక్రవారం | సంపుటి : 10 సంచిక : 314 | పేజీలు : 12 వెల: రూ. 4/-

Follow :

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

బుద్ధుని బోధనలు భారతావనికి అవసరం

- బుద్ధుని సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చెరవేసేలా కృషి
- బుద్ధపూర్ణిమ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి
- ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :

తెలంగాణలో బౌద్ధ బిక్షులకు తగిన గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజ్యం, అధికారం ఉండి వాటిని కాదని 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించారన్నారు. రెండు న్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడి ఉందని ఉద్ఘాటించారు. సికింద్రాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌లో గురువారం మహాబోధి బుద్ధవిహార్‌లో జరిగిన బుద్ధపూర్ణిమ వేడుకల్లో ముఖ్యఅతిథిగా రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని తెలిపారు. ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచనలో చాలా అర్థం ఉందని ఈ సూక్తిలో నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారని చెప్పారు. ఏ పని అయినా తాను ఎంతో ధ్యానంగా చేస్తానని స్పష్టం చేశారు. ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తానని అన్నారు. ఒక పాఠశాలను నిర్వహించాలని తాను కోరుతున్నానని చెప్పారు. సమాజంలో అసహనం, అసూయ పెరిగిపోతున్నాయన్నారు. సమాజంలో స్పర్థలు, ఉద్వేగాలు పెరిగేలా వాతావరణం నెలకొని ఉందన్నారు. బుద్ధుని సందేశం దేశానికి ఇప్పుడు ఎంతో అవసరమన్నారు. బుద్ధుడి సందేశాన్ని సమాజంలో ప్రతి ఒక్కరికి చేరవేయడానికి అవసరమైన సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం మీది... అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది?' అని కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.



పార్లమెంట్ ఎన్నికల తర్వాత

భారాస ఖేల్ ఖతం

కార్యకర్తలే పార్టీ నేతలపై తిరగబడతారు

- రాష్ట్ర సంపదను దోచుకుని చిప్పచేతికి ఇచ్చారు
- కవితపై 8వేల పేజీల చార్జిషీట్‌కు సమాధానం చెప్పండి
- కెటిఆర్ నోరు అదుపులో పెట్టుకోకుంటే ఖబర్దార్
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘాటు విమర్శలు

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :

ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 5 తర్వాత భారాస దుకాణం మూతపడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం భారాస నేతలను ఆ పార్టీ కార్యకర్తలే వెంటపడి కొడతారన్నారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర సంపదనంతా దోచుకున్నది చాలక కేసీఆర్ కుటుంబం దిల్లీకి వెళ్లింది. అవినీతి చేయకుండానే భారాస ఎమ్మెల్సీ కవితపై 8 వేల పేజీల ఛార్జిషీట్ దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పుల ఖజానా మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. ఇకపోతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్‌ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు

మిగతా 2లో..

ప్రజ్వల్.. వెంటనే పోలీసులకు లొంగిపో..

న్యాయ ప్రక్రియను ఎదుర్కోవాల్సిందే

ఇది నా అర్డర్..మనవడు ప్రజ్వల్‌కు దేవేగౌడ హెచ్చరిక

రాసలీల వీడియోల్లో అడ్డంగా దొరికిపోయిన తన మనవడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వెంటనే భారత్ తిరిగి వచ్చి.. పోలీసులకు లొంగిపోవాలని అతడి తాత, మాజీ ప్రధాని దేవగౌడ సూచించారు.

ఛత్తీస్‌ఘడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టులు మృతి
- భారీగా ఆయుధాలు స్వాధీనం

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :

ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి కాల్పులతో దద్దరిల్లాయి. మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లా, నారాయణపూర్ జిల్లా సరిహద్ద ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు నక్సలైట్లు మరణించారు. భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇంద్రావతి ఏరియా కమిటీ, నారాయణపూర్, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన డీఆర్జీ, బస్తర్ టైర్స్‌తో పాటు ఎస్టీఎఫ్ బృందాలపై కాల్పులు జరగడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. ఇప్పటికే ఏడుగురు నక్సల్స్ మరణించగా, 12 మంది నక్సలైట్లు గాయపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే ఛాన్స్ ఉంది. నారాయణపూర్ బీజాపూర్ జిల్లా సరిహద్దుల్లో టూన్ నంబర్ 16, ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన నక్సలైట్లు సంచరిస్తున్నారనే

మిగతా 2లో..

రాష్ట్రవ్యాప్తంగా సజావుగా ధాన్యం కొనుగోళ్లు

- చిన్నిచిన్న పొరపాట్లను పెద్దవిగా చూడరాదు
- 7,172 సెంటర్లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరుగుతున్నాయని పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ పేర్కొన్నారు. అయితే పెద్ద సంఖ్యలో కొనుగోళ్లు జరిగినప్పుడు చిన్న చిన్న లోపాలు జరగడం సహజమని ఆయన అన్నారు. ధాన్యం కొనుగోళ్లపై చౌహాన్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు దాదాపు పూర్తి కావొస్తోందన్నారు. ధాన్యం కొన్న తర్వాత రైతులకు డబ్బులు పడ్డాయా లేదా అనేది ప్రతీ సెంటర్ నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నాం. 7,172 సెంటర్‌లలో 39.51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. తెలంగాణ బియ్యానికి మంచి బ్రాండ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యం తరుగు అనేది అవాస్తవం.. కొనుగోలు కేంద్రాల వద్ద క్లీనింగ్ మిషన్లు పెట్టాము. క్లీనింగ్ ఉన్న ధాన్యంలో ఒక్క కిలో కూడా కటింగ్ లేదు. కేంద్ర

మిగతా 2లో..

మహారాష్ట్ర రసాయన పరిశ్రమలో ఘోర ప్రమాదం

ఎనిమిది మంది మృతి.. 60 మందికి గాయాలు

ముంబై, మే 23 (జనంసాక్షి) :

మహారాష్ట్రలోని థానేలో ఓ రసాయన పరిశ్రమలో గురువారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా, 60 మందికిపైగా గాయాల పాలయ్యారు. దోంబివిలి ఎంఐడీసీ ఫేజ్-2 ప్రాంతం లోని అముదాన్ కెమికల్ కంపెనీలో గురువారం మధ్యాహ్నం రియాక్టర్ పేలడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు వెల్లడించారు. ఫ్యాక్టరీలో మూడు పేలుళ్లు వినిపించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కనీసం ఎనిమిది మందిని రక్షించినట్లు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దొంబివిలి ఎంఐడీసీలోని అముదన్ కెమికల్ కంపెనీలో బాయిలర్ పేలిన ఘటన బాధాకరమని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. ఈ ఘటనలో 8 మందిని రక్షించారని తెలిపా రు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక పేలుడు ధాటికి ఘటనాస్థలిలో పెద్ద బిలం ఏర్పడింది. పేలుడు కారణం గాజు కిటికీలు దెబ్బతిన్నాయి. బాయిలర్ పేలుడు కారణంగా ఉత్పత్తి చేయబడిన వేడి భారీ ఇనుప కిరణాలు వంగిపోయేలా చేసింది. పక్కనే ఉన్న ఫ్యాక్టరీల పైకప్పులు ఎగిరిపోయి భారీ నష్టం వాటిల్లింది. పేలుడు శబ్దం కిలోమీటరు దూరం నుంచి వినిపించింది. ఈ పరిశ్రమలో కొందరు చిక్కుకున్నారని, వారి కోసం రెస్క్యూ సిబ్బంది గాలింపు చేపట్టారు. డ్రోన్లను ఉపయోగిస్తున్నారు.

400 సీట్లు పగటి కలలు

- తడిగొంతు ఆరిపోవడం ఖాయం
- నీళ్ళు దగ్గర పెట్టుకొండి : ప్రశాంత్ కిషోర్

న్యూఢిల్లీ, మే 23 (జనంసాక్షి) :

2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దాదాపు 300 సీట్లు సాధిస్తుందని జోస్యం చెప్పారు ప్రముఖ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్. భారతీయ జనతా పార్టీకి 2019లో వచ్చినట్లుగానే ఈసారి కూడా మెరుగైన స్థానాలు కైవసం చేసుకుంటుందని.. గతంలో చెప్పిన మాటకు కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులకు ఒక సూచన చేశారు ప్రశాంత్ కిషోర్. జూన్ 4 ఓట్ల లెక్కింపు రోజున హైడ్రేటెడ్‌గా ఉండండి అని సూచించారు. అలాగే బీజేపీ రాదని భ్రమలో ఉన్న వాళ్లు గొంతు తడుపుకోవడానికి నీటిని పుష్కలంగా అందుబాటులో ఉంచుకోండి అని సందేశాన్ని తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు.

ఇటీవలి ఇంటర్వ్యూలో తన అంచనాలు తారుమారు అయ్యాయని జర్నలిస్ట్ గుర్తు చేసిన సందర్భంగా వాడి వేడిగా మాటలు సాగాయి. అలా జరిగిన కొద్దిసేపటికే ప్రశాంత్ కిషోర్ ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ఆసక్తిగామారింది. 47 ఏళ్ల వయసుగల్గిన రాజకీయ

వ్యూహకర్త 2022లో హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ రాబోయే ఎన్నికల పరాజయంతో సహా గతంలో తన రెండు పోల్ అంచనాలు తారుమారు అయ్యాయని ఆ ఇంటర్వ్యూలో గుర్తు చేశారు సీనియర్ జర్నలిస్ట్. దానికి కౌంటర్ గా ప్రశాంత్ కిషోర్ 2021లో బెంగాల్ ఎన్నికల్లో కిషోర్ తృణమూల్ కాంగ్రెస్ కు వ్యూహకర్తగా పనిచేశారు. మమతా బెనర్జీ టీఎంసీ పార్టీ 294 స్థానాలకు గాను 215 స్థానాలను గెలుచుకుని అఖండ మెజారిటీతో అధికారాన్ని నిలుపుకుందని ఈ సందర్భంగా మరోసారి గుర్తుచేశారు. అలాగే

మిగతా 2లో..

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తుస్

- మహిళలకు బస్సు ప్రయాణం కూడా అనుమానమే
- ఉద్యోగుల నాలుగు డిఎలపై మాట్లాడడం లేదు
- ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపిస్తే మండలిలో కొట్లాడుతాం
- హన్మకొండ సన్నాహక సభలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు

హనుమకొండ, మే 23 (జనంసాక్షి) :

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒకే ఒక హామీ మాత్రమే అమలైందని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ కూడా తుస్సేనని ఎద్దేవా చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా హన్మకొండ జిల్లాలో ఏర్పాటు చేసిన పట్ట భద్రుల ఉప ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు

మిగతా 2లో..

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

- 25న తుఫానుగా మారే అవకాశాలు
- అండమాన్ దీవులకు విస్తరించిన నైరుతి
- వాతావరణ శాఖ వెల్లడి



రేవ్‌పార్టీ దుమారం

- తెలుగు నటికి బ్లడ్ శాంపిల్స్‌లో డ్రగ్ పాజిటివ్
- వెలుగులోకి ఒక్కొక్కరుగా..
- నమూనాల ఆధారంగా చర్య తీసుకునే ఛాన్స్

బెంగళూరు, మే 23 (జనంసాక్షి) :

బెంగుళూరు శివార్లలో జరిగిన రేవ్ పార్టీలో రోజు రోజుకీ కొన్ని సంచలన విషయాలు బయటపడుతున్నాయి. రేవ్ పార్టీలో పాల్గొన్న నటి హేమ బ్లడ్‌ఓ డ్రగ్స్ నమూనాలు ఉన్నట్లు గుర్తించారు. రేవ్ పార్టీలో పాల్గొన్నా వారందరి రక్త నమూనాలు సేకరించిన బెంగుళూరు పోలీసులు పరీక్షకి పంపించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అందులో టాలీవుడ్ నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ ఉన్నట్లు నార్కొటిక్ టీమ్ పేర్కొంది. ఇప్పుడు ఈ విషయంతో రేవ్‌పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని హేమ చెప్పిన మాటలు అన్ని అబద్దాలే అని తేలిపోయింది. ఈ రేవ్ పార్టీ తరువాత హేమ తాను అక్కడ లేనట్టుగా చిత్రీకరించడానికి బిర్యానీ

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 మే 2024

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

హైదరాబాద్‌మే 23 (జనంసాక్షి) :పశ్చిమ మధ్య, దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతుందని, శనివారం నాటికి మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం వాతావరశాఖ తెలిపింది. ఈ నెల 25న తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశాలు ఉన్నాయని.. 26 నాటికి పశ్చిమ బెంగాల్ తీరానికి తుఫాను చేరుతుందని పేర్కొంది. బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు విస్తరించాయి.ఈ క్రమంలో తెలంగాణలో రాగల రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, మహబూబ్‌నగర్, హన్మకొండ, జనగామ, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే సూచనలున్నాయని చెప్పింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలున్నాయని పేర్కొంది. ఇక శనివారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

ఉత్తమ్‌పై ఆరోపణలు సత్యదూరం

- వైట్‌పేపర్ లాంటి వ్యక్తిపై ఇంక్ చల్లడం సరికాదు
- బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై జగ్గారెడ్డి విమర్శలు

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : తెలంగాణ మంత్రులు అంతా కలసి కట్టుగా ఉన్నారని, నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తమ కెప్టెన్ సీఎం రేవంత్ రెడ్డి, రేవంత్ నేతృత్వంలో టీమ్ ప్రజల కోసం పనిచేస్తోందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఐదేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అందులో సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని తేల్చి చెప్పారు. కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డిపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ లేకున్నా.. ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తమ్ కుమార్ తెల్లని కాగితం వంటి వారని, అనవసరంగా ఎందుకు ఇంకు చల్లుతారని ప్రశ్నించారు. బట్ట కాల్చి ఉత్తమ్ మీద వేయడం కరెక్ట్ కాదని మహేశ్వర రెడ్డికి సూచించారు. ఉత్తమ్‌ను ఇబ్బంది పెట్టడంలో మహేశ్వర రెడ్డికి ఒనగూరే ప్రయోజనం ఏంటో అర్థం కావడం లేదన్నారు. బీజేఎల్పీ నేత అయిన ప్పటికీ మహేశ్వర రెడ్డికి తగిన గుర్తింపు లభించలేదని జగ్గారెడ్డి విమర్శించారు. గుర్తింపు కోసమే ఉత్తమ్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన చేసే ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఉంటే మీడియా ముందు పెట్టాలని సవాల్ విసిరారు. లేదంటే సైలెంట్‌గా ఉండాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని స్పష్టం చేశారు.

ఛత్తీస్‌ఘడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

సమాచారంతో భద్రతా బలగాలు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ సమయంలోనే ఇరు వర్గాల మధ్య ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 100కు పైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో మరణించారు. రెండు వారాల క్రితం బీజాపూర్ పిడియా గ్రామ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 12 మంది మావోయిస్టులు మరణించారు. అంతకుముందు ఏప్రిల్ 16న కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 29 మంది నక్సలైట్లు మరణించారు.

రాష్ట్ర వ్యాప్తంగా సజావుగా ధాన్యం కొనుగోళ్లు

ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం క్లీన్‌గా ఉండాలని ఆదేశాలు ఉన్నాయి. ధాన్యంలో మట్టి, చిన్న రాళ్ళు, డస్ట్ ఉంటే సమస్య వస్తుంది. బకాయిలు ఉన్న మిల్లర్లకు ధాన్యం ఇవ్వలేదు. కొంతమంది మిల్లర్ల వద్ద కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. అందుకే వాళ్లకు ధాన్యం ఇవ్వలేదు. నీతినిజాయితీగా పని చేస్తున్నాం. మిల్లర్ల వద్ద డబ్బులు అధికారులు డబ్బులు తీసుకున్నారని ఆరోపణలు చేయడం సరికాదు. ఆధారాలుంటే నిరూపించాలన్నారు. మాపై అసత్య ఆరోపణలు చేయడం వల్ల మాకే కాదు రైతులకు కూడా ఇబ్బంది అవుతుంది. ఆధారాలు లేని అవాస్తవాలు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని చౌహాన్ హెచ్చరించారు.

రేవ్‌పార్టీ దుమారం

ఎలా చేస్తారు లాంటి మామూలు వీడియోలు విడుదల చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చాలా ప్రయత్నాలు చేసింది. కానీ ఇప్పుడు ఆమె రక్త నమూనాలో మాదకద్రవ్యాలు తీసుకున్నట్టుగా రూఢీ కావటంతో ఇక ఆమె ఎన్ని చెప్పినా, ఆమె ఆ పార్టీలో వుంది, మాదకద్రవ్యాలు సేవించింది అనే విషయం స్పష్టం అయింది. 'సన్ సెట్ టు సన్ రైజ్ విక్టరీ' పేరుతో బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ జీఆర్ ఫామ్ హౌస్‌లో గత ఆదివారం రేవ్‌పార్టీ నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ రేవ్‌పార్టీలో పాల్గొన్న 103 మంది రక్త నమూనాలను ఇటీవల బెంగళూరు నార్కొటిక్ టీమ్ సేకరించింది. 103 మందిలో మొత్తం 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్లు తేలింది. 59 మంది పురుషుల, 27 మంది మహిళల రక్త నమూనాలు పాజిటివ్ అని తేలింది. నటి హేమ కూడా డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. రక్త నమూనాలు పాజిటివ్‌గా తేలిన వారందరికీ సీసీబీ సమన్లు జారీ చేయనుంది. అదే రేవ్‌పార్టీ జరిగిన ఫామ్‌హౌస్‌లోనే నటి హేమ ఉందని, ఆమె వీడియో అక్కడే రికార్డ్ చేసిందని బెంగళూరు పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు.

తాను రేవ్‌పార్టీలో పాల్గొనలేదని, ఆ సమయంలో హైదరాబాద్‌లోనే ఉన్నానని హేమ అప్పట్లో ఓ వీడియో విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే రేవ్‌పార్టీకి తాను వెళ్లలేదంటూ రిలీజ్ చేసిన వీడియోలో ఆమె ఏ డ్రస్‌తో ఉన్నారో, బెంగళూరు పోలీసులు విడుదల చేసి ఫొటోలోనూ అదే డ్రస్‌లో ఉన్నారు. దాంతో హేమ చెప్పేది అబద్ధం అని అప్పుడే స్పష్టం అయింది. అయినా కూడా హేమ తాను హైదరాబాద్‌లోనే ఉన్నానంటూ మరో వీడియో వదిలారు. చివరకు బ్లడ్ శాంపిల్స్ పాజిటివ్‌గా రావడంతో ఆమె బండారం బయటపడింది.డ్రగ్స్ టెస్ట్‌లో హేమకి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హేమతో పాటు డ్రగ్స్ టెస్ట్‌లో మొత్తం 86 మందికి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు ప్రకటించారు. హేమను బాధితురాలుగా పరిగణించే అవకాశముంది.

మాచర్ల ఘటనపై తొలగని ఉత్కంఠ

- బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించిన పిన్నెల్లి
- నరసరావుపేటలో కొనసాగుతున్న గస్తీ

అమరావతి,మే 23 (జనంసాక్షి) :
మాచర్ల ఘటనపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో పిన్నెల్లి హైకోర్టును ఆశ్రయించారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా మాచర్లలోని పోలింగ్ కేంద్రంలో దూరి ఈవీఎం ధ్వంసం చేసిన ఘటనలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని ఏ1గా చేర్చారు. ఆయన గత కొన్ని రోజులుగా అందుబాటులో లేకపోవడంతో ఆయన కోసం ఏపీ, తెలంగాణ పోలీసులు గాలిస్తున్నారు. ఆయన్ను అరెస్టు చేసేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో రామకృష్ణారెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. అంతకుముందు నర్సరావు పేట కోర్టులో లొంగిపోతారన్న ప్రచారం జోరుగా సాగింది. పోలీసులు పెద్ద మొత్తంలో కోర్టుకు చేరుకున్నారు. విచారణకు పిన్నెల్లి వస్తే అరెస్ట్ చేసేందుకు యత్నిస్తున్నారు. కాగా.. మాచర్ల ఈవీఎం ధ్వంసం ఘటనపై సీరియస్ అయిన సీఈసీ.. ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అరెస్టుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఆయనను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌కు వెళ్లాయి. పల్నాడు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఈ బృందాలను ఏర్పాటు చేశారు. ఏపీ పోలీసులు, తెలంగాణ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కంది వద్ద పిన్నెల్లి కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు.. అందులోని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం మూడు చట్టాల పరిధిలో పది సెక్షన్లతో పిన్నెల్లి మీద కేసులు నమోదు చేశారు. ఐపీసీ, ఆర్పీ, పీడీపీపీ చట్టాల పరిధిలో సెక్షన్ల నమోదు చేశారు పోలీసులు. విటన్నింటి నేపథ్యంలో ఆయన తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హై కోర్టును ఆశ్రయించారు. ఇదిలావుంటే రెంటచింతల మండలం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ధ్వంసం చేసిన కేసులో పిన్నెల్లి ఏ1 నిందితుడిగా ఉన్నారు. ఆయన కోసం ఇప్పటికే ఎస్పీ, డీఎస్పీ ఆధ్వర్యంలో 8 ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. విదేశాలకు పారిపోకుండా ఇప్పటికే లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసిన విషయం తెలిసిదే. ఇదిలా ఉండగా నరసరావుపేట కోర్టులో పిన్నెల్లి స్వయంగా లొంగిపోనున్నట్లు వచ్చిన సమాచారం మేరకు 1వ పట్టణ సిఐ సిహెచ్. కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నరసరావుపేట కోర్టు వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టుకు వచ్చి లొంగిపోతారన్న సమాచారం పట్ల స్పష్టత లేదని శాంతిభద్రతల దృష్ట్యా కోర్టు వద్ద ముందస్తు బందోబస్తు ఏర్పాటు చేశామని సిఐ పేర్కొన్నారు.

దేశీయ స్టాక్ మార్కెట్లు కొత్త రికార్డులు

గరిష్టస్థాయికి చేరుకున్న సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం కొత్త రికార్డులను నెలకొల్పాయి. ఉదయం ఫ్లాట్‌గా మొదలైన సూచీలు ఆ తర్వాత దూసుకు పోయాయి. ఈ క్రమంలో సెన్సెక్స్, నిఫ్టీ జీవన కాల గరిష్ఠాలను తాకాయి. అదే సమయంలో సెన్సెక్స్ తొలిసారిగా 74,253 పాయింట్లు, నిఫ్టీ 22,950 పాయింట్ల ఎగువన ముగిశాయి. కేంద్రానికి అంచనాలకు మించి రిజర్వ్ బ్యాంక్ డివిడెండ్ ప్రకటించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గతంలో ఎన్నడూ లేని విధంగా 2.11లక్షల కోట్లను చెల్లించేందుకు ఆమోదముద్ర వేసింది. దాంతో సూచీలు పరుగులు తీశాయని.. అదే సమయంలో ఎన్నికల ఫలితాలను దృష్టిలో పెట్టుకుని విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలకు దిగుతూ వస్తున్నారు. తాజాగా దేశీయ మదుపరులతో పోలిస్తే మళ్లీ వారే కొనుగోళ్లకు కారణమని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

400 సీట్లు పగటి కలలు

ఇప్పుడు తాను చెప్పే ప్రిడిక్షన్ కూడా నిజమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.
అందుకే ప్రతి ఒక్కరూ నీటిని అందుబాటులో ఉంచుకోండి అని రాజకీయ నాయకులకు చురకలు అంటించారు. జూన్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల అవ్వగానే మనసు, శరీరం రెండింటినీ హైడ్రేటెడ్‌గా ఉంచడంలో నీరు దోహదపడుతుంది అని గుర్తు చేశారు. బుధవారం ఓ ఇంటర్వ్యూలో ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ బీజేపీకి సొంతంగా 370 సీట్లు రావడం అసాధ్యమని, ఆ పార్టీకి దాదాపు 300 సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. ఎన్డీఏ 400 మార్కును అధిగమిస్తుందని బీజేపీ ప్రకటించిన రోజునే.. ఇది సాధ్యం కాదని తాను చెప్పినట్లు వివరించారు. అయితే ఆ పార్టీ 270 మార్కుకు దిగువన పడిపోదని తాను నమ్ముతున్నానన్నారు.

కీచక కిషన్ సస్పెన్షన్

- విధుల్లో నుంచి తొలగించిన జిహెచ్ఎంసి
- నివేదిక అందించాలని ఆదేశించిన మేయర్

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : గాజులరామారంలో ఫీల్డ్ ఆఫీసర్ కిషన్ లీలలు వెలుగులోకి వరావడంతో మేయర్ గద్వాల విజయలక్ష్మి సీరియస్ అయ్యారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. కిషన్‌ను సస్పెండ్ చేయడంతో పాటు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓ మహిళా పారిశుద్ధ్య సిబ్బందిని లైంగికంగా వేధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధిత మహిళకు సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయి. దాంతో బాధితురాలు మీడియా ముందుకు వచ్చి జరిగిన మొత్తం చెప్పింది. మహిళను వేధించిన ఫీల్డ్ ఆఫీసర్‌పై గ్రేటర్ అధికారులు చర్యలు తీసుకున్నారు. కిషన్‌ను సస్పెండ్ చేస్తున్నామని ప్రకటించారు.
అలాగే గాజులరామారం ఘటనపై మేయర్ గద్వాల విజయలక్ష్మి స్పందించారు. మహిళ ఉద్యోగిని వేధించడాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనపై పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఆదేశాలు జారీచేశారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి. ఇప్పటికే కిషన్‌ను విధుల నుంచి తొలగించారు. కుత్బుల్లాపూర్ పరిధిలో గల గాజులరామరం 25 సర్కిల్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా కిషన్ పనిచేస్తున్నాడు. అక్కడ పనిచేసే ఓ పారిశుద్ధ్య కార్మికురాలిపై కన్నేశాడు. తాను చెప్పినట్టు వినాలని, లేదంటే వేధింపులు తప్పవని బెదిరించాడు. ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడేవాడు. ఆ తతంగాన్ని ఫోన్‌లో రికార్డ్ చేసేవాడు. ఆ వీడియోలు బయటకు రావడంతో కిషన్ ఆగడాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వీడియోలు చూసి ఇతర కార్మికులు ప్రశ్నించారు. ఎవరికి చెప్పొద్దని డబ్బు ఆశ చూపాడు. 14 మందికి తలా రూ.10 వేల చొప్పున ముట్ట జెప్పాడు. అయినప్పటికీ ఆ వీడియోలు వైరల్ అయ్యాయి. అతనిపై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇప్పటికే విధుల నుంచి తప్పించారు. పూర్తి నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఎన్నికలపై ఉన్న ధ్యాస.. ధాన్యం కొనుగోళ్లపై ఏదీ

- బీబీనగర్‌లో ఐకెపి కేంద్రాలు పరిశీలించిన కిషన్ రెడ్డి

భువనగిరి, మే 23 (జనంసాక్షి) : సీఎం రేవంత్‌రెడ్డికి రైతులకంటే ఎన్నికలే ముఖ్యంగా మారాయని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విమర్శించారు. ఐకేపీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని, 45 రోజులుగా ధాన్యం వస్తున్నా.. కొనుగోలు పక్రియ వేగంగా జరగడం లేదని ఆరోపించారు. భువనగిరి నియోజకవర్గం బీబీనగర్ మండలంలోని రాఘవపూర్, రుద్రవెల్లి గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను కేంద్రమంత్రి గురువారం సందర్శించారు. కొనుగోళ్ల తీరుతోపాటు పీఏసీఎస్ కేంద్రంలో ధాన్యం కుప్పలను పరిశీలించారు. కొనుగోలు ఆలస్యం కావడానికి గల కారణాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ పక్రియ నత్తనడకన సాగుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గతంలో ఈ విషయంలో భారాస మోసం చేసింది. అదే దారిలో హస్తం పార్టీ నడుస్తోంది. రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. గతంలో కేసీఆర్ 'వరి వేస్తే ఉరి' అన్నారు. దొడ్డు వడ్లు సాగు చేస్తే బోనస్ ఇవ్వబోమని ఇప్పుడు రేవంత్‌రెడ్డి చెబుతున్నారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అన్నదాతలకు రుణమాఫీ లేదు.. బోనస్ లేదు. కాంగ్రెస్ సర్కారు తీరుతో బ్యాంకర్లు రైతులకు రుణాలు ఇవ్వడం లేదు. దేవుడి మీద ఒట్టు పెడితే వ్యవసాయదారులకు న్యాయం జరగదు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతి గింజ కొనడానికి సిద్ధంగా ఉంది' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల్లో వ్యతిరేకతను మూటగట్టుకునేందుకు భారాసకు పదేళ్లు పడితే... కాంగ్రెస్‌కు 5 నెలలే పట్టింది. దొడ్డు వడ్ల రైతులకు అన్యాయం చేస్తే భాజపా సహించదు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని బేషరతుగా కొనుగోలు చేయాలి. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి. బ్యాంకర్లు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదు. కానీ, ఆ పార్టీ నేతలు దిల్లీకి సూట్‌కేస్‌లు మోసుకెళ్తున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే గద్దె దిగాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి వెంట భాజపా జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, భాజాపా ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, కిసాన్ మోర్చా నాయకులు గోలీ మధుసూదన్ రెడ్డి, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, పడమటి జగన్మోహన్ రెడ్డి, ఎన్నం శివకుమార్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు తుస్

నాలుగు డీఏలు ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసింది. అందుకోసం అసెంబ్లీ, కౌన్సిల్‌లో భారాస ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా కలిసి పోరాడతాం. అందుకు ఎమ్మెల్సీగా రాకేశ్ రెడ్డిని గెలిపించాలని అన్నారు. నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీఛార్జి చేసి కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది. నిరుద్యోగ భృతి హామీపై నిలదీస్తే.. అలా చెప్పలేదని అసెంబ్లీలో భట్టి విక్రమార్క అంటున్నారు. కరెంటు బిల్లులు, భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడానికి సిద్ధమవుతున్నారు. ఒక వైపు సంక్షేమానికి కోతలు.. మరో వైపు వాతలా? అన్ని వర్గాలను మోసం చేయడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ పని అయిపోయింది. అందుకే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబితే కాంగ్రెస్ దారికొస్తుందని హరీశ్‌రావు అన్నారు. పట్ట భద్రుల సీట్ బీఆర్ఎస్ సొంతం చేసుకుంటుందని హరీష్ రావు అన్నారు. రాకేష్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ప్రచారం చేయాలి. ఎమ్మెల్యే స్థానంలో ఎమ్మెల్సీ గెలిపించాలి. కాంగ్రెస్ పాలనలోఉచిత బస్సు పథకం తప్ప అన్నీ తుస్. ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైంది. రైతాంగాన్ని నిలువునా మోసం చేసింది. ఇందిరమ్మ ఇల్లు, పింఛన్, అమలు చేసుడు విస్మరించింది. విద్యార్థి, నిరుద్యోగుల, ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్ కు ఓటు తో బుద్ధి చెప్పాలి. ఉపాధ్యాయులపై నారాయణ ఖేడ్ లో లాఠీ ఛార్జి చేయడం సిగ్గు చేటు. వడ్లకు బోనస్ ఎగ్గొట్టిన కాంగ్రెస్ రైతు బిడ్డలు బుద్ధి చెప్పండి. సంక్షేమ పథకాలలో కోతలు, ధరలు పెంచి వాత పెడుతున్న రేవంత్ కు విద్యా వంతులు బుద్ధి చెప్పాలని ఆయన వ్యాఖ్యానించారు. తీన్మార్ మల్లన్న గొంతు ఎందుకు మూగబోయింది. ప్రశ్నించే గొంతు రాకేష్ రెడ్డికి పట్టభద్రులు ఓటు వేయాలి. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచిన బీజేపీ కి వాత పెట్టాలి. తెలంగాణ వాణి వినిపించాలంటే బీఆర్ఎస్ ను బలపర్చాలి. తెలంగాణ ఉద్యమ కార్లపై తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ కు పట్ట భద్రులు ఓటు వేయొద్దు. హైదరాబాద్ ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చాలని కుట్రలు చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వంకు గుణపాఠం చెప్పాలని అన్నారు. తెలంగాణ నీళ్లు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలించాలని బీజేపీ కుట్రలకు కాంగ్రెస్ వత్తాసు పలుకుతోంది. 2వేల పడకల ఆసుపత్రి చివరి దశకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. తెలంగాణ చిహ్నం ను తొలగించాలని కుట్రలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో పంటలు కోనేటోళ్ళు లేరు, కరెంట్ సరఫరాలో విఫలమయ్యారు. కాంగ్రెస్ అబద్దాలు, మోసాలను ప్రశ్నించడం రాకేష్ రెడ్డికి సాధ్యమని హరీష్ రావు పేర్కొన్నారు.

భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్

- ముస్లిం ఓటు బ్యాంక్ కోసం ఇండియా కూటమి తహతహ
- దళితులు, గిరిజనలు రిజర్వేషన్లు యధాతథం
- నా ప్రాణం ఉన్నంత వరకు వాటిని ఎవరూ లాగేసుకోలేరు
- హర్యానా ప్రచరాంలో ప్రధాని మోడీ ఉద్వేగ ప్రసంగం

చండీఘడ్,మే 23 (జనంసాక్షి) :
భారత్‌ను విభజించి రెండు ముస్లిం దేశాలు చేసిన కాంగ్రెస్ పార్టీ అంటూ ప్రధాని మోడీ ఘాటు విమర్శలు చేశారు. ముస్లిం ఓటు బ్యాంక్ కోసం ఇండియా కూటమి తహతహ లాడుతోందన్నారు. అయితే దళితులు, గిరిజనలు రిజర్వేషన్లు యధాతథంగా ఉంటాయని, తన ప్రాణం ఉన్నంత వరకు వాటిని ఎవరూ లాగేసుకోలేరని అన్నారు. హర్యానా ప్రచరాంలో ప్రధాని మోడీ ఉద్వేగ ప్రసంగం చేశారు. తాను జీవించి ఉన్నంత వరకు దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని ప్రధాని మోడీ అన్నారు. రాజ్యాంగం కల్పించిన వారి హక్కులపై దుష్ప్రచారం చేయడం దారుణమని అన్నారు. హర్యానాలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్లపై సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు దేశం కన్నా వారి ఓటుబ్యాంకు ముఖ్యమని, ఈ వ్యక్తులు తమ ఓటు బ్యాంకు కోసం దేశాన్ని విభజించారని, వారు ఇండియాను విభజించి రెండు ముస్లిం దేశాలను సృష్టించారని అన్నారు. కలకత్తా హైకోర్టు 2010 తర్వాత జారీ అయిన ఓబీసీ సర్టిఫికేట్లను రద్దు చేసింది. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మోడీ విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో వారు రాత్రికి రాత్రే ముస్లింలకు, చొరబాటుదారులకు ఓబీసీ సర్టిఫికేట్లు జారీ చేశారు. గత 10-12 ఏళ్లలో ముస్లింలకు జారీ చేసిన అన్ని ఓబీసీ సర్టిఫికేట్లను హైకోర్టు రద్దు చేసింది. కలకత్తా హైకోర్టు నిర్ణయాన్ని సీఎం మమతా బెనర్జీ అంగీకరించడం లేదని, వారు ఓబీసీ రిజర్వేషన్లను ముస్లింలకు ఇవ్వాలని కోరుకుంటున్నారు. ఇది ఇండియా కూటమి మనస్తత్వం అని ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టీఎంసీ, ఇతర ఇండియా కూటమికి చెందిన పార్టీలు వారి ఓటు బ్యాంకుకు మద్దతు ఇస్తున్నాయని, అయితే మోడీ జీవించి ఉన్నంత వరకు దళితులు, గిరిజనుల రిజర్వేషన్లను ఎవరూ లాక్కోలేరని మీకు భరోసా ఇస్తున్నానని మోడీ అన్నారు. ఇది రాజకీయ ప్రసంగం కాదని, అణగారిన వారి హక్కులకు తాను ఇచ్చే హామీ అని అన్నారు. 2010 తర్వాత పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఓబీసీ సర్టిఫికేట్లను కలకత్తా హైకోర్టు బుధవారం రద్దు చేసింది. 1993 చట్టం ప్రకారం క్షుఅల కొత్త జాబితాను సిద్ధం చేయాలని పశ్చిమ బెంగాల్ వెనుకబడిన తరగతుల కమిషన్‌ను కోర్టు ఆదేశించింది. దాదాపుగా 5 లక్షల ఓబీసీ సర్టిఫికేట్లు రద్దయ్యాయి. 2010 తర్వాత ఓబీసీ కోటా కింద ఉద్యోగాల్లో ఉన్నవారు, వాటిని పొందే పక్రియలో ఉన్న వారు కోటా నుంచి మినహాయింపబడరు. వారి ఉద్యోగాలపై ఎలాంటి ప్రభావం ఉండదు. కలకత్తా హైకోర్టు తీర్పు తర్వాత, ఈ తీర్పును అంగీకరించ బోమని సీఎం మమతా బెనర్జీ అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖేల్ ఖతం

అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్న

భూపాలపల్లి మీదుగా రైల్వే లైను

- కేంద్రం గ్రీన్ సిగ్నల్
- భూసేకరణ కోసం ఆదేశాలు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, మే 23 (జనంసాక్షి) : రామగుండం– మణుగూరు రైల్వే స్టేషన్ల మధ్య భూపాలపల్లి మీదుగా ప్రత్యేక రైల్వే కోర్ కారిడార్ ఏర్పాటుకు కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో భూ సేకరణ చేపట్టాలని ఎస్సీఆర్ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. దీంతో 142 కి.మీ. దూరం తగ్గనుంది. భూపాలపల్లిలో గల సింగరేణి బొగ్గను ప్రస్తుతం కాజీపేట మీదుగా రవాణా చేస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో బొగ్గుగనులు ఏర్పాటు అయినప్పటినుండి ఈ ప్రాంతానికి రైల్వే లైన్ వస్తుందని ప్రజలు ఎదురుచూశారు. గత కొన్నేళ్లక్రితమే రైల్వేలైన్ మంజూరైందని ప్రచారం కూడా జరిగింది. కానీ రైల్వేలైను మంజూరు కాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు నిరాశ ఎదురైంది. వివిధ పార్టీల నేతలకు కూడా రైల్వేలైన్ అనేది ప్రచార అస్త్రంగా మారింది. ప్రతి ఎన్నికలకు ముందు నేతలు రైల్వేలైన్ మంజూరు చేయిస్తామని హామీలు ఇచ్చారు. అయితే రైల్వేలైన్ కాజీపేట, లేదా జమ్మికుంట రైల్వేస్టేషన్ లకు లింకు కలుపుతారని ఆశించారు. కానీ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రామగుండం– మణుగూరు రైల్వే స్టేషన్ల మధ్య రైల్వే లైన్ ఏర్పాటు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రామగుండం రైల్వే స్టేషన్ నుండి పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు రైల్వేస్టేషన్ వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటు కానుంది. ఈ రైల్వే లైన్ మొత్తం 207.80 కి.మీ మేర విస్తరించనుంది. దీని నడుమ విస్తరించిన ప్రాంతాల్లో నూతనంగా బ్రాడ్ గేజ్ నిర్మించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి జిల్లాల్లో భూ సేకరణ పనులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ లైన్ ఏర్పాటుతో 142 కి.మీ. దూరం తగ్గనుంది. ఇందుకోసం భూసేకరణ పనులు తొందరలోనే చేపట్టనున్నారు. సింగరేణి గనులు గల ఈ ప్రాంత రైల్వేలైన్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,911కోట్లుగా ఉందని అధికారవర్గాలు తెలియజేశాయి. ఈ కొత్త లైన్ నిర్మాణం వల్ల దూరంతో పాటు బొగ్గ రవాణా వ్యయం కూడా తగ్గనుంది.

ఆలయ ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధం?

- ఏండ్ల తరబడి ఒకే ఆలయాల్లో ఉద్యోగుల విధులు
- మంత్రి సమీక్షతో ఉద్యోగుల్లో బదిలీల గుబులు
- ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే బదిలీలు జరిగేనా?

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6 (ఏ) ఆలయాలలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బదిలీల గుబులు పట్టుకుంది. మూడు రోజుల క్రితం దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హైదరాబాదులో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం ఇందుకు కారణంగా తెలుస్తుంది.ఆలయాల్లో రికార్డు అసిస్టెంట్ స్థాయి నుంచి పదోన్నతి పొందినటువంటి ఉద్యోగులు ఏఈఓ స్థాయి వరకు వెళ్లి అదే ఆలయాల్లో విధులు నిర్వహిస్తుండటం వల్ల పలు ఆరోపణలు వస్తున్నాయి. పలు ఆలయాల ఈవో లతో ఆయా ఆలయాలలో భక్తులకు చేపడుతున్న చర్యలు, ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలపై మంత్రి సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తుంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఏళ్ళుగా పాతుకు పోయిన ఉద్యోగుల బదిలీలకు చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయలైన భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి ఆలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం,బాసర సరస్వతి దేవి ఆలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం, సికింద్రాబాద్ గణేష్ ఆలయాలున్నాయి. ఆయా ఆలయాల్లో మెజారిటీ ఉద్యోగులు సంవత్సరాల తరబడి అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. రికార్డు అసిస్టెంట్ నుండి ప్రమోషన్లు పొందుతూ ఏఈవో స్థాయి వరకు వచ్చిన వారు అదే ఆలయాలలో వివిధ విభాగలలో పనిచేస్తూ అనేక అవినీతి,అక్రమాలకు పాల్పడు తున్నారని ఎన్నో ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ఆలయాలలో ఉద్యోగులు అక్రమాలకు పాల్ప డుతున్నారని ఎండోమెంట్ కమిషనర్ విజిలెన్స్ స్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులు ఎన్నో మార్లు తనిఖీలు చెసి ప్రభుత్వానికి నివేదికలు అందచేశారు. విజిలెన్స్ నివేదిక పైన ఉన్నత అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకుంటున్నారు. దీనికి రాజకీయ ఒత్తిళ్లు కారణంగానే తెలుస్తుంది. పలు ఆలయాల్లో టికేట్లు రిసెల్ చేస్తున్నారని ఆరోపణలు వచ్చిన ఆయా ఆలయాల అధికారులు తుతూ మంత్రంగా విచారణలు చెసి వారిని ఇంకో చోటికి అంతర్గత బదిలీలు చేశారే తప్ప వారిపై ఎలాంటి శాఖ పరమైన చర్యలు తీసుకోలేదు. ఉమ్మడి రాష్ట్రంలో 2011 లో ఉద్యోగుల బదిలీలను చేపట్టారు. ఆ ఉద్యోగులు బదిలీ కాగానే రాజకీయ నాయకులు, దేవాదాయ శాఖ అధికారుల పైరవిలతో సంవత్సర కాలంలో తిరిగి వారు యధా స్థానానికి తిరిగి బదిలీ చేయించుకున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాలకు ఆదాయం పెంచాలని,భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని ఆలోచన చేస్తుంది. ఇందులో భాగంగా 6 ఏ ఆలయలలో సంవత్సరాల తరబడి తిష్ట వేసిన ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసినీయ సమాచారం. కాగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఉద్యోగుల్లో ఎన్నికల కోడ్ ముగిసిన పిదప బదిలీలు జరగవచ్చన్న చర్చలు కొనసాగుతున్నడంతో వారు ఉలిక్కిపడుతున్నారు. ఎలాగైనా తాము బదిలీ కాకుండా ఉండేందుకు ఇప్పటినుంచి రాజకీయ పైరవీలను చేస్తున్నట్లు సమాచారం. దేవాదాయ శాఖ అధికారులు, రాజకీయ ఒత్తిళ్లకు తలగోగకుండ ఉద్యోగులను బదిలీ చేసి దేవాలయాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని భక్తుల మనోభావాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థుల బలిదానాలతోనే తెలంగాణ ఏర్పాటు

- ప్రశ్నించే గొంతుకగా ఎమ్మెల్సీగా గెలిపించండి
- విద్యార్థులను బఠానీలు అమ్ముకోవడం అనేది సరికాదు
- ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

నర్సంపేట, మే 23 (జనం సాక్షి) : తెలంగాణ విద్యార్థుల ఆత్మ బలిదానాలపై నిర్మించబడ్డ తెలంగాణ పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్సీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని మీరందరూ ఆశీర్వదించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, చింతకాయల నవీన్ కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం నర్సంపేట పట్టణంలోని పద్మశాలి గార్డెన్లో ఎమ్మెల్సీ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న గెలుపు కోసం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ఏర్పాటుచేసిన సమావేశంలో తీన్మార్ మల్లన్న పాల్గొని ప్రసంగించారు. భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే టీ రామారావు బుధవారం నర్సంపేటకు వచ్చి కాంగ్రెస్ పార్టీ పైన వ్యక్తిగతంగా తీర్మానం మల్లన్న పై అవాకులు చెవాకులు పేలి తన విజ్ఞతను మరిచిపోయి మాట్లాడినాడని ఆయన విమర్శించారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థులు కేటి రామారావు మాటలు అభ్యంతరంగా పోల్చడం సరికాదని విమర్శించారు. బిట్స్ పిలానిలో చదివిన అభ్యర్థి గొప్పవాడని , ఉస్మానియా యూనివర్సిటీలో చదివిన వాళ్లు పల్లి బఠానీలు అమ్ముతారని అవాకుల పేలడం తన విజ్ఞతకు నిదర్శనం అని విమర్శించారు. కేటి రామారావు నిరుద్యోగ అభ్యర్థుల పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడం సరికాదని అన్నారు. తెలంగాణ ఉస్మానియా విశ్వవిద్యాలయం కాకతీయ విశ్వవిద్యాలయం విద్యార్థులను పోల్చడం సరికాదని మల్లన్న అన్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి అధికారం కోల్పోగానే విచక్షణారహితంగా మాట్లాడడం తన గర్వానికి నిదర్శనమని మల్లన్న ఎద్దేవా చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడిన కేటీఆర్ ను కాకతీయ యూనివర్సిటీకి వచ్చిన ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చిన తరిమి తరిమి కొడతారని ఇలాంటి అవాకులు చవాకులు పేలుతే రాబోవు రోజుల్లో గుణపాఠం చెప్తారని ఆయన హెచ్చరించారు. రామారావు చేసే డ్రామాలకు ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా నిరుద్యోగులను కొనుగోలు చేయాలని చూస్తే నిరుద్యోగులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కేటీ రామారావు అవినీతి లో కురుకుపోయి కుటుంబం మొత్తం జూన్ 4 తర్వాత జైలుకు వెళ్లే రోజులు వస్తాయని ఆయన జోస్యం చెప్పారు. పట్ట బద్రుల గొంతుకగా తీర్మాన్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు తక్కలపల్లి రవీందర్రావు, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోకల శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు లక్ష్మణ్, పెండె రామానంద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, బత్తిని రాజేందర్ వేముల సాంబయ్య, తిరుపతి , రజినీ భారతి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, మే 23 (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని 5ఇంక్లైన్ వద్ద గురువారం పోలీసులు గంజాయి పట్టుకున్నారు. సీఐ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై సుధాకర్, సిబ్బంది కలిసి 5ఇంక్లైన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కాగా శనిగరం కు చెందిన నిగ్గుల రాజు అనే వ్యక్తి టీఎస్ 24సి 2236 ద్విచక్ర వాహనం పై వస్తుండగా అతని పట్టుకొని తనీఖీ చేయగా, అతడి వద్ద 1కేజీ100 గ్రాముల ఎండు గంజాయి కనిపించడంతో పట్టుకున్నారు. నడికుడ కుమ్మరి నాగరాజు వద్ద కొనుగోలు చేయడం జరిగిందని విచారణలో తేలగా ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు సిఐ తెలిపారు.

చేపల లారీ బోల్తా.. ఎగబడ్డ స్థానికులు

దంతాలపల్లి మే 23(జనం సాక్షి) : ఫ్రీగా వచ్చినదాన్ని జనాలు వదులుతారా... కొనుక్కొని తిన్న దానికంటే ఫ్రీగా వచ్చిన దాన్ని తినడంలో మనవాళ్లు ముందుంటారని చెప్పాలి. ఇక్కడ కూడా అదే సీన్ రిపీట్ అయింది. చేపల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. అయ్యో అనాల్సింది పోయి.. అసలు పట్టించుకోలేదు అక్కడి జనాలు అసలు లారీలో ఉన్న మనుషులకు ఏమైనా అయిందా అని కూడా కనికరం చూపించకుండా చేపల కోసం సంచులు పట్టుకుని వచ్చి ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించారు. ఈ ఘటన మండలంలోని పత్తి మిల్లు సమీపంలోని వరంగల్ ఖమ్మం నేషనల్ హైవే పై చేపల లారీ గురువారం ఉదయం అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీ బోల్తా పడిన విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు రంగ ప్రవేశం చేసి వెళ్లగొట్టారు.

మర్రిగూడలో ఎంపీడీవో వర్సెస్ ఏపీఓ

- ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లా జీతాలు తొలగింపుతో రాసుకున్న వివాదం
- ఎంపీడీవోతో సంబంధం లేకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటున్న ఏపీవో
- జీతాల విషయంలో వివరణ అడగగా ఫీల్డ్ అసిస్టెంట్ల ముందు పైలు విసిరేసిన ఏపీవో వెంకటేశం
- ఎంపీడీవో పై వచ్చిన ఆరోపణ అవాస్తమైనవి గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు
- ఉన్నతాధికారిని అందరు ముందు అవమానించిన ఏపీవో

మర్రిగూడ, మే 23 (జనంసాక్షి) : మర్రిగూడ మండలం లో ఎంపీడీవో వర్సెస్ ఏపీ ఓగా మారింది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లా జీతాలను ఏ కారణం లేకుండా తొలగించడానికి ఎంపీడీవో తప్పుపట్టారు, ఈ విషయంపై ఏపీవో ఎంపీడీవోకు మధ్య తీవ్ర వివాదం రాసుకుంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ ల జీతాలు తొలగించాలంటే ఎంపీడీవో పర్మిషన్ తప్పనిసరి, డ్రాయింగ్ ఆఫీసర్ గా ఉన్న ఎంపీడీవో పర్మిషన్ తోనే జీతాల విషయంపై నిర్ణయం తీసుకోవాలి, ఫీల్డ్ అసిస్టెంట్ లోకి వచ్చే జీతం 12000 వేసవి కాలంలో శ్రమించి పనిచే ఫీల్డ్ అసిస్టెంట్లను ఇలా వేధించడం ఎంతవరకు కరెక్ట్, ప్రతివారం ఈజీఎస్ అధికారులతో ఎంపీడీవో సమావేశం ఉంటుంది, నిర్దేశించిన లక్ష్యాలను ఛేదించడానికి ఈ సమావేశం ముఖ్య లక్షణం ఈ సమావేశానికి ఏపీవో గైరాజరయ్యారని, శివన్న గూడెం ఉపాధి హామీ కూలీల హాజరు కంప్యూటర్లో నమోదు విషయంలో కూడా నిర్లక్ష్యం చేశాడని తెలుస్తున్నది, ఏది ఏమైనా ఉన్నతా అధికారి నీ అందరి ముందు అవమానపరచడం ఎంతవరకు కరెక్ట్, మర్రిగూడ ఎంపీడీవో మునయ్య పై వచ్చిన వేధింపులపై ఆరా తీయగా గ్రామ పంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు అలాంటిదేమీ జరగలేదని ఎంపీడీవో ఒక బాధ్యతగల అధికారిగా ఉన్నారని వారిపై ఇలాంటి ఆరోపణలు సరైనవి కావని వారు అన్నారు,

రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

వరంగల్ బ్యూరో, మే 23 (జనం సాక్షి) : గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు, విత్తన వ్యాపారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. ఎవరైనా నకిలీ విత్తనాలను అమ్మినట్లయితే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లాలో నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణకు ఏర్పాటుచేసిన టాస్క్ ఫోర్స్ కమిటీ విస్తృత తనిఖీలను నిర్వహిస్తుందని అన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యమైన విత్తనాలను నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. రైతులకు వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలను నిర్దేశించిన ధరలకు కాకుండా అధిక ధరలకు విక్రయించినా చర్యలు ఉంటాయన్నారు. రైతులు కూడా నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. తెల్ల గుడ్డ సంచుల్లో ప్యాకింగ్ చేయబడిన విత్తనాలు, లైసెన్సు పొందిన ఒరిజినల్ విత్తన ప్యాకెట్లను అనుకరించడం, ప్యాకింగ్ లేకుండా అమ్మే విత్తనాలు, అనుమతులు లేని మోసపూరిత వ్యక్తులు రాత్రికి రాత్రే విత్తనాలను చేరవేస్తూ విక్రయించడం, విడిగా ప్యాకింగ్ లేకుండా విత్తనాలను విక్రయించే వారి పట్ల రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రైతులకు సూచించారు. ముఖ్యంగా పంటల సీజన్ కావడంతో పత్తి, మిరప లోనే నకిలీ విత్తనాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రైతులకు ప్రతి విషయంలో, విత్తన సరఫరా నుండి పండిన పంట సేకరించడం వరకు రైతుల శ్రేయస్సు, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఏ. భారీ, వ్యవసాయ శాఖ జెడి రవీందర్ సింగ్, వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో పాటు విత్తన వ్యాపారులు పాల్గొన్నారు.

రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి డాక్టర్ రవీందర్రావు

వరంగల్ ప్రతినిధి, మే 23 (జనం సాక్షి) : వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి డాక్టర్ రవీందర్రావు కోరారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గిర్నిబావి గ్రామంలో ఎన్నికల ఇన్చార్జ్ శానబోయిన రాజ్ కమార్, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి గ్రాడ్యుయేట్ అభ్యర్థులు రాకేష్ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. నర్సంపేట నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్లు అత్యధికంగా రైతు బిడ్డలే కాబట్టి పేద ఇంటి నుండి వచ్చిన రైతుబిడ్డ ఏనుగుల రాకేష్ రెడ్డి కోసం మనమందరం కష్టపడి గెలిపించాలని కోరారు. ప్రశ్నించే గొంతును అడ్డుపెట్టుకొని బ్లాక్ మెయిల్ చేస్తూ కోట్లు సంపాదించిన అవినీతిపరుడు తీన్మార్ మల్లన్న, అని మేధావులైన గ్రాడ్యుయేట్లకు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నానని ఆయన అన్నారు. ఈ ఎన్నికల్లో బ్లాక్ మెయిల్ తీన్మార్ మల్లన్నను పక్కకి పెట్టి, అవినీతి మరకలేని, విద్యావంతుడు, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రధాన్యతనిస్తూ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల ముఖ్య నాయకులు, ఎంపీపీ కాట్ల కోమల భద్రయ్య, శానబోయిన రాజ్ కుమార్, గుండెకారి రంగారావు, మోడెం విద్యాసాగర్ అంబీరు రమేష్. సొసైటీ ఛైర్మన్లు, ఎంపిటిసి, క్లస్టర్ భాద్యులు, మాజీ సర్పంచ్ లు, పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వండి

- ఔట్సోర్సింగ్ ఉద్యోగులు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) : మహబూబాబాద్ జిల్లా లో ఎన్ హెచ్ ఎం కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెండు నెలల జీతం రాని కారణంగా మహబూబాబాద్ జిల్లా నుండి ఎన్ హెచ్ ఎం ఉద్యోగులందరూ రేపటి ఏఐటీయూసీ సమ్మెకు మద్దతు తెలుపుతూ మహబూబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతి బాయి కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కుమార్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుక్ముద్దీన్, కార్యవర్గ సభ్యులు సంజీవ్ నాయక్, రఘునాథ్, తెలంగాణ రాష్ట్ర ఎన్హెచ్ఎం ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎల్ కరుణాకర్ పాల్గొన్నారు.

సూర్యునిచుట్టూ భూమిని గిర్రున తిప్పిన కోపర్నికస్

పోలెండ్ లోని "టోరున్" జన్మించిన నికోలస్ కోపర్నికస్, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినా, మేనమామ 'లూకాస్ వాజెన్ రోడ్' సహకారంతో గ్రీకు, ధర్మ, వైద్య, జ్యోతిష్య, న్యాయ, గణితశాస్త్రలు అభ్యసించినా, "బొలోగ్నా" విశ్వవిద్యాలయం లో చదువుతున్న కాలంలో తనకు ఖగోళశాస్త్రంలో ఉన్న మక్కువతో, ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త డి.యమ్.డి. నొవొరా పరిచయంతో మరింత ఆశక్తి పెంచుకుని అనేక ఖగోళ రహస్యాలు చేధించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. అందులో భాగంగానే అప్పటి వరకు అరిస్టాటిల్, రెండవ శతాబ్దలో "టోలెమీ" సూత్రీకరించిన "భూకేంద్ర" సిద్ధాంతం పై అనేక పరిశోధనలు చేసి, ఆ సిద్ధాంతం తప్పు అని , గ్రహాలు కదలికలు ఆధారంగా గ్రహాలు అన్నియు భూమితో సహా అన్ని " సూర్యుడే కేంద్రంగా" తిరుగుతున్నాయు అని గ్రహించి, ""ది రివల్యూషనిబస్ ఆర్బియమ్ కోయోలెస్టియమ్, లిబ్రా6' (ఆన్ ద రివల్యూషన్ ఆఫ్ ది సెలిస్టియల్ స్పియర్స్) అనే పుస్తకం ఆవిష్కరించాడు. కానీ ఆనాటి మతగురువులకు, ప్రభువులకు భయపడి ప్రపంచానికి పరిచయం చేయలేదు..

అయితే ఆనాటి పోప్ క్లెమెంట్-7 , స్నేహితులు ముఖ్యంగా"రేటికస్" చొరవతో తన పరిశోధనలు గ్రంథం రూపంలో 1543లో ప్రచురితమైంది. కానీ ఆ విషయం కోపర్నికస్ చూడకుండా 1543 మే 24వ తేదీన కనుమూయిట దురదృష్టకరం. తదుపరి కాలంలో కొత్త మార్గాలు, వ్యాపారాలు, అన్వేషణలు , పరిపాలనలో మార్పులు, సాంస్కృతిక పునరుజ్జీవనం కొత్త పుంతలు తొక్కుతూ "విషయాలను విమర్శనాత్మకంగా పరిశీలన" చేయుట ప్రారంభం అవుటంతో, ఖగోళ శాస్త్రం అభివృద్ధిలో కోపర్నికస్ "సూర్య కేంద్ర సిద్ధాంతం" ప్రాచుర్యం పొంది, నూతన పరిశోధనల్లో నేటికీ నిరూపమాణంగా నిలిచింది.

ఐ.ప్రసాదరావు
6305682733

అంపశయ్యపై అమ్మ

"అవ్వా"..
దుఖ?పూరిత స్వరంతో
నుదురుపై నిమురుతూ పిలిచాను
మూసిన కండ్లు తెరిచి శూన్యం లోకి
చూసింది.
నా పొద్దు పొడుపులో
నా చూపు తనపై ప్రసరిస్తే చాలు
తనువెల్లా నవ్వైపొయేది.
తన మునిమాపులో
నిలువెల్లా గాయమై
నను కాంచక ఆకాశం వైపు చూస్తుంది.
నాకు చేతననిచ్చిన చేతులు
కదలకుండా కట్టివేసారు.
ఆ నిర్వేదపు చూపుల వెనుక
ఎన్ని వేదనానంద దృశ్యాలో ?
నాకు మాటలు నేర్పిన ఆరింద
మాట్లాడటం మానేసింది.
ఆ మూగత్వం మాటున
ఎన్నెన్ని మాటల కందని ఆలోచనలో?
నూరు యుద్దాలు చేసిన ధీరోదాత్త
అంపశయ్యపై సేద తీరుతున్నది.
విడిపోవడం- వీడిపోవడం
తథ్యమైనప్పుడు
పెనవేసుకోవాల్సింది మానసిక
బంధాలేకదా..
కురవాల్సింది కన్నీటి వర్షాలే కదా.

హెచ్. రవీందర్

ఉద్యోగం ఇచ్చుడు సర్కార్ పని కాదట!

ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

ఉద్యోగం ఇచ్చుడు సర్కార్ పని కాదట! తాజాగా మన పీఎం నరేంద్రమోడీ సెలవిచ్చారు. ఏక కాలంలో ఇండియా కూటమి పార్టీ ల నేతల మీద 20 లక్షల కోట్ల అవినీతి ఆరోపణలు చేశారు.అది మన పీఎం గాలి లో మాటల స్టయిల్ అనుకోండి!(16 లక్షల కోట్ల అదాని, అంబానీ లాంటి 22 మందికి రుణ మాఫీ ఇచ్చి, బ్యాంకులను దివాళా తీసిన విషయం చెప్పరు) కాంగ్రెస్ అధికారం లోకి వస్తే మహిళల మంగళ సూత్రాలు లాక్కెలుతారు లాంటి, నల్ల ధనం వెలికి తీసి, ప్రతి పౌరుని అకౌంట్ లో 15 లక్షల రూపాయలు వేస్తాము లాంటి పీఎం మోడీ గాలి మాట,పచ్చి అబద్దం ముచ్చట అనుకోండి! ఇతరుల మీద బురుద చల్లడంలో, ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు చెప్పడం లో మోదీజీ ని మించిన వారు లేరు! అదే ఆయన ఐటి సెల్ సభ్యుల కు అబ్బింది! ఎప్పటియో వీడియోస్ క్లిప్పింగ్స్ తీసి ఇప్పుడే జరిగినట్లు ప్రచారం, వైరల్ చేయడం ప్రతి రోజు చూస్తూనే ఉన్నాము.మోడీ అనుంగు శిష్యుడు, బీజేపీ నేత సందీప్ పాత్ర అయితే మహాప్రభూ జగన్నాధుడు మోడీ భక్తుడు అని పేర్కొని,అతని వ్యాఖ్యల మీద నిరసన వ్యక్తం కాగా స్లిప్పఫ్ టంగ్ అంటు తప్పు అయ్యిందని, ప్రాయిచ్చితంగా ఉపవాసం చేస్తానంటాడు, అయోధ్య లో ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మోడీ పెద్ద ఫోటో లతో కట్ అవుట్ లు అందులో చిన్న పిల్లాడి లా రాముడు ఫోటో, అది కూడ ఆయన రాముడి వ్రేలు పట్టుకుని వెళుతున్నట్లు,మంత్రి గిరిరాజ్, సాక్షి మహారాజ్ లు మోడీ భగవాన్ రామ్ అవతారం అంటారు, మోడీ స్వయంగా దేవుడి దూతనని చెప్పు కుంటారు! హిట్లర్, కింగ్ జాన్ లు మోడీని ఆవహించారా? ఏమీ అని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుప్రియ సునేత్ ప్రశ్నించారు. మీడియా ఇలా ఎవరైనా విపక్షాలు మాట్లాడితే ఊరుకుంటుందా? ఇప్పటికే పెద్ద హంగామా చేసేసేది, ఆగమాగం చేసేది!

20 కోట్ల ఉద్యోగాలు ఏవి?

స్లిప్పఫ్ టంగ్ అన్నా ఊరుకునేది కాదు, అధికార బీజేపీ కి అన్నీ మాఫ్! భయమా? లేక ప్రేమా తెలియదు! పీఎం మోడీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం, ప్రభుత్వం పని కాదు అన్నపుడు, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, ఎందుకు హామీ ఇచ్చినట్లు? ఎందుకు ఉద్యోగాల నియామక లేఖలు, అక్కడక్కడ ఇచ్చిన పిడికెడు ఉద్యోగాల విషయంలో అందచేసినట్లో చెప్పాలి! పది ఏండ్ల బీజేపీ, పీఎం మోడీ పాలనలో, ఆయన స్వయంగా ఇచ్చిన హామీల ప్రకారం 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, కాని ఇచ్చింది కేవలం, పది ఏండ్లలో 8 లక్షల లోపే, అంటే పరిస్థితి ఎలా ఉందో, అర్థం చేసుకోవచ్చు! పార్లమెంట్ ఎన్నికల లో అసలు సమస్యలు అయిన నిరుద్యోగం, అధిక ధరలు, రైతుల రుణ మాఫీ, ఎమ్మెస్పి, మహిళల సమస్యల మీద పీఎం మోడీ ఒక్క మాట మాట్లాడరు. అదే జి -20,2036 లో ఓలంపిక్స్, 2047 లో మేక్ ఇన్ ఇండియా, వందే భారత్ రైలు, ఇవ్వే ముచ్చట్లు..

'అగ్నివీర్' కోసం మాట్లాడరా?

ఒక్కమాట కూడ నిరుద్యోగులను, ఈదేశం రక్షణ కోసం, తన తాత, తండ్రుల మాదిరి సైన్యం లోకి వెళ్లుదామని, కలలు కంటూ,సెలక్షన్ కోసం ట్రైనింగ్ లు తీసుకుంటున్న లక్షలాది యువత ఆశలు, ఆశయాల మీద నీళ్లు చల్లే విధంగా ఒక కాంట్రాక్టు మాదిరి, దిగిపోయిన తర్వాత ఎలాంటి పెన్షన్ లాంటి సౌకర్యం లేని, చివరి కి ఊపిరి పొతే కనీసం, ప్రతి సైనికుడు కోరుకునే అమరుడి కీర్తి,ప్రతిష్ట లేని కేవలం నాలుగు ఏండ్ల 'అగ్నివీర్ ' (సైన్యం లో జవాను)పథకం గురించి పీఎం ఈ ఎన్నికల్లో ఒక్క మాట మాట్లాడలేదు. ఒక తాత్కాలక కాంట్రాక్టు ఉద్యోగం కన్నా అతి దారుణంగా అగ్నివీర్ పేరిట సైన్యం లో భర్తీ పట్ల దేశమంతా నిరసన వ్యక్తం అయ్యింది. కాని కావాల్సినంత, రావాల్సినంత వ్యతిరేకత రాలేదు! ఫలితంగా చాలా మంది లో కొందరు ఇదే పథకం కింద సెలెక్ట్ అయి వెళ్లారు, కొందరు కష్టమైనా విదేశాలకు పయనం అయిన పరిస్థితి ఉన్నది. విదేశాల్లో వారి ఘోష వినే వారే లేదు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే 'అగ్నివీర్ ' పథకం ను రద్దు చేసి, గతంలో మాదిరి పెన్షన్, ఇతర హోదాలు, సౌకర్యం లతో గౌరవ నియామకాలు ఉంటాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఇది కూడ బీజేపీ నేతలకు, ముఖ్యంగా పీఎం మోడీకి మింగుడు పడడం లేదు!

దేశం ఏమి కోరుకుందో తెలియదా?

యువత కు ఏమీ కావాలో, ఆ విషయం మాట్లాడకుండా, వారిని తప్పుదారి పట్టించే కుల, మతాల ను రెచ్చగొట్టే విధంగా, మందిర్, మస్జీద్,80-20 రాజకీయ, విద్వేషాల ప్రసంగాలు, ఈ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ కోసం, చివరికి ఈ దేశం మొదటి ప్రధాని నెహ్రూ కోసం, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కోసం, సోనియా గాంధీ కోసం తప్పుడు ప్రచారం, తప్పుడు ఆరోపణలు, ఇదే చర్విత చరణం మోడీ, ఆయన త్రయం ఉపన్యాసాల్లో ఉంటూ వస్తున్నది. దేశం కు ఏం కావాలి, మనిషి బతకడానికి ఏమీ కావాలి, యువత, మహిళలు, రైతులు, కార్మికులు, కూలీలు, రైతులు ఏమి ఆశిస్తున్నారు. వారికి ఏమి కావాలి? అసమానతలు, పేదరికం తగ్గించడానికి ఏమి చేయాలి, అనేది ఏమి లేదు, ఫక్తు అధికారంలోకి ఎలా రావాలి, ఎలా తిమ్మిని, బమ్మి చేసి ఓట్లు సాదించాలి, ఇదే యావ! మనుషుల మధ్య చిచ్చు పెట్టి తమ అధికారంను పదిల పర్చుకోవడమే లక్ష్యం తప్ప, ఏమి కనిపించడం లేదు!అందుకే దేశం, దేశ ప్రజల జీవితాలను కాపాడుకోవడం కోసం, జీవించే హక్కు కోసం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కాపాడుకోవడం కోసం నోరు తెరువాలి! కదం తొక్కాలి! ఈరోజు కాకుంటే, రేపటికి రూపం ఉండదు!

మే 25న నక్సల్బరీ తిరుగుబాటు 57వ వార్షికోత్సవాన్ని జరపండి!

1920లో ఏర్పడిన భారత కమ్యూనిస్టు ఉద్యమానికి, 1967 మే 25న జరిగిన నక్సల్బరీ తిరుగుబాటు ఒక చారిత్రాత్మక మలుపు. అంతర్జాతీయ మరియు జాతీయ సమస్యలకు సంబంధించి 1964 లో సిపిఐ నుండి సిపిఐ(ఎం) ఏర్పడిన తర్వాత కూడా సిపిఐ(ఎం) నాయకత్వం కొనసాగించిన 'రివిజనిస్ట్ పంథా'కు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్లో నక్సల్ బరి పోరాటాన్ని కామ్రేడ్ చారు మజుందార్ , కాను సన్యాల్ , కోఖన్ మజుంధార్ మొదలగు వారి నేతృత్వంలోని కమ్యూనిస్ట్ విప్లవకారులు మరియు ఇతర నాయకులు సాగించిన సైద్ధాంతిక పోరాటం ఇది.

1967లో పశ్చిమ బెంగాల్ యునైటెడ్ ఫ్రంట్ సంకీర్ణ ప్రభుత్వానికి బెంగాల్ కాంగ్రెస్ తో పాటు, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎస్‌యుసిఐ) వంటి ఇతర పార్టీలతో పాటు సిపిఐ(ఎం) ప్రధాన భాగస్వామిగా ఉన్నది. ఆ మిశ్రమ ప్రభుత్వంలో జ్యోతి బస్సు ఉపముఖ్యమంత్రిగానూ, ల్యాండ్ రెవెన్యూ వంటి ముఖ్యమైన శాఖలు నిర్వహించారు. నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటుకు తక్షణ రాజకీయ సందర్భం ఏమిటంటే, దున్నే వానికే భూమి" అనే సూత్రం ఆధారంగా భూసంస్కరణలను అమలు చేయడంలో సిపిఐ(ఎం) తన నిబద్ధతను పూర్తిగా విడనాడడం వల్ల ఆ పోరాటం జరిగింది. నక్సల్‌బరి రైతాంగం ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రతిఘటిస్తూ, 23 మే 1967న, జోతేదార్ల (భూస్వాములు) నుండి భూమిని బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ప్రారంభించారు.మే 25న డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి సబ్‌డివిజన్‌లోని నక్సల్‌బరీ బ్లాక్‌లో పోలీసు కాల్పులకు దారితీసింది, ఫలితంగా 9 మంది మహిళలు మరియు 1 పిల్లలతో సహా అనేకమంది బలిదానం చేశారు.

అనగారిన గిరిజనులు, భూమిలేని పేద రైతులు, కమ్యూనిస్ట్ విప్లవకారుల మద్దతుతో కార్మికుల నేతృత్వంలోని నక్సల్బరీ తిరుగుబాటు క్రూరమైన రాజ్య అణచివేతను సవాలు చేస్తూ భారతదేశమంతటా మిలిటెంట్ రైతాంగ పోరాటాల ఆవిర్భావానికి ప్రేరణగా నిలిచింది. ఈ నేపథ్యంలోనే విప్లవ కమ్యూనిస్టుల సంస్థాగత కార్యక్రమాలతో ఆల్ ఇండియా కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రివల్యూషనరీస్ (ఏఐసీసీసీఆర్) 1969 ఏప్రిల్ 22న లెనిన్ మహాశయుని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కలకత్తాలో జరిగిన సమావేశంలో సిపిఐ(ఎంఎల్) ఏర్పాటు చేయబడింది. 1969 మే ఒకటవ తేదీన కలకత్తాలో జరిగిన గొప్ప బహిరంగ సభలో కామ్రేడ్ కానూ సన్యాలు ఈ విషయాన్ని ప్రకటించారు. 1970లో జరిగిన పార్టీ 8వ కాంగ్రెస్ మార్క్సిజం-లెనినిజం-మావో జెడాంగ్ ఆలోచనలను మార్గదర్శక ప్రాపంచిక సిద్ధాంతంగా స్వీకరించింది.

ఆ సమయంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ భారత భూభాగం పై వసంతకాల మేఘ గర్జన అని నక్సల్ బరి పోరాటాన్ని బలపరిచింది. ఆ పోరాటానికి ప్రచారాన్ని కల్పించింది. చైనా పంథాను అనుసరించాలనేటువంటి వైఖరి సిపిఐ(ఎమ్.ఎల్) నాయకత్వం అనుసరించింది. అతివాద వైఖరి ఆధిపత్యం వహించిన సాహసోపేత వ్యక్తిగత హింసా వాద విధానాల ప్రభావం మరియు చైనీస్ విప్లవం యొక్క పార్య-పుస్తక కాపీగా భారత విప్లవం పట్ల యాంత్రిక విధానం కారణంగా సిపిఐ(ఎంఎల్) నాయకత్వం చేపట్టిన అతివాద పోరాటం పంథా వలన పోరాటం వెనుక పట్టు పట్టింది. రెండవ ప్రపంచ యుద్ధానంతర ప్రపంచంలో, భారతదేశ పరిస్థితిని ఖచ్చితమైన (సమీక్ష) మూల్యాంకనం చేయడంలో విఫలమైంది. సామ్రాజ్యవాదం ప్రత్యక్ష పాలన కింద ఉన్న దేశాలు, భారతదేశం లాంటి దేశాలనుండి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వెళ్లిపోయిన తరువాత నయా వలసవాదంగా పరివర్తన ఎలా చెందిందో, అలాగే దానికి సంబంధించి భారతదేశంలో వర్గ సంబంధాలు మరియు వర్గ శక్తుల పొందిక మరింత కచ్చితంగా మార్పులు ఎలా వచ్చాయో సమీక్షించలేకపోయింది. ఇది భారతదేశాన్ని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశంగా, వ్యూహాత్మక పంథాను ప్రధానంగా, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాగా వర్గీకరించడానికి దారితీసింది. వలసరాజ్యాల సమయంలో విప్లవానికి పూర్వ చైనాతో పోల్చి యుద్ధానంతరం దశను నయా వలసవాద భారతీయ పరిస్థితిని పిడివాదంగా గుర్తించింది. ఇంతలో 'ఆపరేషన్ స్టీపుల్‌చేజ్' అనే సైనిక దాడి ద్వారా, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ విప్లవకారులపై క్రూరమైన భీభత్సాన్ని, నిర్బంధాన్ని అమలు జరిపాయి. నక్సల్ బరి పోరాటం వీరోచిత త్యాగాలతో కూడుకొని ఉన్నప్పటికీ, వామపక్ష సాహసోపేతవాదం , వ్యక్తిగత హింసవాదం మరియు రాజ్య అణచివేత కారణంగా, సిపిఐ (ఎం.ఎల్)1970 నుండి అనేక సమూహాలుగా, వివిధ గ్రూపులుగా విడిపోవడం ప్రారంభమైంది.

నేడు కమ్యూనిస్టు విప్లవకారులు చారిత్రాత్మకమైన నక్సల్బరీ తిరుగుబాటు 57వ వార్షికోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, శ్రామికవర్గం మరియు అణగారిన ప్రజలందరూ కలిసి భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలతో కలిసి 18వ లోక్‌సభ ఎన్నికలలో జీవన్మరణ పోరాటంలో నిమగ్నమై ఉన్నాము. ప్రపంచంలోనే అతిపెద్ద ఫాసిస్ట్ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్‌తో అధికారంలో ఉన్న ఫాసిస్ట్ మోడీ పాలనలో ఉన్నాము. ఏది ఏమైనప్పటికీ, కమ్యూనిస్ట్ ఉద్యమంలో కొనసాగుతున్న సైద్ధాంతిక-రాజకీయ ఎదురుదెబ్బలు ఫాసిస్ట్ పరిస్థితిలో అత్యవసర విషయాలను పనులను అర్థం చేసుకోవడంలో మితవాద అవకాశవాదులు, వామపక్ష అతివాదుల అసమర్థతలో మళ్లీ ప్రతిబింబిస్తాయి. ఇది నయా ఉదారవాద ఫాసిజంపై అవగాహనతో మరియు అవసరమైన రాజకీయ కర్తవ్యాలను చేపట్టడమే కాకుండా, సామ్రాజ్యవాదం యొక్క స్వాభావిక వైరుధ్యాలన్నీ మరింత పదునుపెట్టిన తీవ్రవాద, నయాఫాసిస్ట్ ప్రపంచ సందర్భంలో జాతీయ విముక్తి కర్తవ్యాలను నిర్దిష్టంగా విశ్లేషించడం అనేది నేటి విస్తృతమైన ప్రశ్న.

ఇంతకు ముందే గుర్తించినట్లుగా, భారతదేశం నేడు మోడీ పాలనలో ఈ నయా ఫాసిజం దుర్మార్గ దుర్భర రూపాన్ని ఎదుర్కొంటోన్నది.దీని సైద్ధాంతిక ప్రాతిపదిక రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) నేతృత్వంలోని బ్రాహ్మణీయ కులతత్వం యొక్క ప్రపంచంలోని అత్యంత అమానవీయ మరియు ప్రతిచర్య భావజాలం. హిందూత్వ ఫాసిస్టులు ఊహించిన మెజారిటీ హిందూ రాష్ట్రం. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుంటూ, ప్రత్యేకించి, ముస్లింలను అవమానపరుస్తూ, ముస్లింలను కలంకులుగా చిత్రీకరిస్తూ , వారికి పౌరసత్వాన్ని నిరాకరిస్తూ, అంటరాని దళితులు, అణగారిన కులాలతో పాటు మహిళలను కూడా మనుస్మృతి ఆజ్ఞల ఆధారంగా అమానుషం'గా అణచివేయడంలో నిమగ్నమై ఉంది.1949-50 మధ్య కాలంలో మనుస్మృతిని భారత రాజ్యాంగంగా స్వీకరించాలని గతంలో చేసిన ప్రయత్నం విఫలమైన ఆర్ఎస్ఎస్ ఇప్పుడు దానిని మనుస్మృతి ప్రకారం భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోంది. మైనార్టీల పట్ల విపరీతమైన ద్వేషం కలిగిస్తూ, వారిని విభజించటంతో పాటు మైనారిటీలపై ఎడతెగని దాడులు చేస్తున్నారు. మైనారిటీలతో పాటు మొత్తం అణిగారిన వర్గాలను సామాజిక వర్గాలుగా, కులాలుగా విభజించడం చేస్తున్నారు. దళితుల పై అమానుష చర్యలు చేయడం భాజపా పాలనలో భారతదేశం లో సాధారణ అంశంగా మారినప్పటికీ, ఈరోజు 18వ లోక్‌సభ ఎన్నికల ప్రచారం జరుగుతున్నప్పుడు, మోడీ స్వయంగా ముస్లింలను వర్ణించే నిషేధిత మెజారిటీ పోలరైజేషన్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ముస్లింలను "చొరబాటుదారులు" శత్రువులుగా చూపుతూ గోల్వాల్కర్ భారతదేశ శత్రువుల గా పేర్కొన్నట్లు నరేంద్ర మోడీ ఉపన్యశిస్తున్నాడు.

దేశం, సంపద, ఆదాయం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ తరుణంలో మరియు అత్యంత అవినీతిపరులైన ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారులు(క్రోనీ క్యాపిటలిస్టుల)వద్ద జాతి సంపద ఎక్కువగా కేంద్రీకృతమై ఉన్నందున, దేశంలో ఉన్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం, మూడు వ్యవసాయ నల్ల చట్టాలు కార్పొరేట్ అనుకూల, క్రూరమైన చట్టాలను అమలు చేయడం ద్వారా కార్మికులు మరియు రైతులతో సహా ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య హక్కులన్నీ హరించబడుతున్నాయి. కార్పొరేట్ కాషాయ గోడి మీడియా దేశం యొక్క వాస్తవ స్థితిని అరుదుగా నివేదించగా, రాష్ట్రీయ స్వయంసేవక సంఘ (ఆర్ఎస్ఎస్) ఫాసిజం, దాని వ్యక్తీకరణలను విమర్శించే వారిని లేదా బహిర్గతం చేసే వారిని 'జాతీయ వ్యతిరేకులు'గా ముద్రవేస్తున్నారు. వారిపై యుఏపిఏ (ఉపా)లాంటి అనేక నల్ల చట్టాలను ప్రయోగించి నిర్బంధిస్తున్నారు . వస్తువులు, సేవల పన్నులు (జీఎస్టీ) ద్వారా, భారతీయ కార్పొరేట్ పన్ను రేట్లు ప్రపంచంలోనే అత్యల్పంగా ఉండగా, మొత్తం పన్ను భారం సామాన్య ప్రజల భుజాలపైన మోపుతున్నారు.మరియు అఖిల భారత స్థాయిలో మెజారిటీ ఫాసిస్ట్ పాలనను అధిరోహించడంలో భాగంగా, భారతదేశం యొక్క బహుళజాతి, బహుభాషా, బహుళసాంస్కృతిక, బహుళ-మత మరియు బహుళ జాతి లక్షణాన్ని కూల్చివేయడానికి ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఈ ఫాసిస్ట్ దుర్భర పరిస్థితిలో, కార్మికులు మరియు రైతుల దీర్ఘకాలిక మరియు వ్యూహాత్మక వర్గ ప్రయోజనాలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేసిన వీరోచిత నక్సల్బరీ పోరాటాన్ని మనం స్మరించుకుంటున్నప్పుడు, ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ బిజెపిని అధికారం నుండి 18వ లోక్‌సభ ఎన్నికలలో ఓడించటానికి అన్ని ప్రజాస్వామికి శక్తులతో కలిసి సమిష్టిగా పోరాడటం కమ్యూనిస్టు విప్లవకారుల తక్షణ కర్తవ్యం. ఫాసిస్ట్ వ్యతిరేక ఓట్ల విభజనను నివారించడం ద్వారా ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఫాసిస్ట్ కూటమి ఓటమిని నిర్ధారించడానికి వ్యూహాత్మక విధానం అవసరం. ఫాసిస్ట్ మోడీ పాలనను అధికారం నుండి తొలగించడం మరియు భారత రాజ్యాంగం కల్పించిన కనీస ప్రజాస్వామ్య హక్కులను నిర్ధారించడం అనేది వర్గ, కులం, లింగం మరియు జీవావరణ శాస్త్రానికి సంబంధించిన పోరాటాలు మరియు ఉద్యమాలను నిర్మించడానికి అవసరమైన రాజకీయ పరిస్థితిని సృష్టించడం అనివార్యం. దీనితో సహా, 18వ లోక్‌సభ ఎన్నికలకు సిపిఐ (ఎం.ఎల్)రెడ్ స్టార్ యొక్క విధానం యొక్క వివరాలు ఎన్నికల ప్రకటన ముందు ప్రచురించబడిన నాగ్‌పూర్ డిక్లరేషన్‌లో పేర్కొనబడ్డాయి. దీని ఆధారంగా, సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ "బీజేపీని ఓడించండి" అనే నినాదంతో దేశవ్యాప్త ప్రచారంలో నిమగ్నమై ఉంది మరియు ఈ ప్రక్రియలో, పాలక వ్యవస్థను పడగొట్టే దీర్ఘకాలిక కర్తవ్యాన్ని వేగవంతం చేయడానికి మరియు ముందుకు సాగడానికి రంగం సిద్ధం చేస్తోంది. ప్రజల ప్రజాస్వామ్యం మరియు సోషలిజం సాధించవలసి ఉన్నది. ఆ కర్తవ్య నిర్వహణకై ఆర్ఎస్ఎస్ ఫాసిజాన్ని ఓడించటానికి కృత నిశ్చయములై ముందుకుసాగటమే నక్సల్బరీ అమరవీరులకు మనమిచ్చే సముచిత నివాళి కాగలదు.

నక్సల్బరీ తిరుగుబాటుకు విప్లవ నివాళులు!
ఆర్ఎస్ఎస్- భాజపా ఫాసిజాన్ని
ప్రతిఘటించి ఓడించండి !!
జనతా ప్రజాతంత్రం విప్లవం వైపు ముందుకు
సాగుదాం!!!

పిజె జేమ్స్
జనరల్ సెక్రటరీ
సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్
న్యూఢిల్లీ



తెలుగు స్వేచ్ఛానుసరణ:
కొల్లిపర వెంకటేశ్వరరావు
సిపిఐ (ఎం.ఎల్) రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యుడు
మొబైల్ నెంబర్: 9392325652
vkollipara75@gmail.com

దేశమంటే మట్టి కాదు మనుషులు...!

ఏ యుద్ధం ఎందుకు జరిగేనో
ఎవడు గెలిచెనో... ఎవడు ఓడెనో..!
గెలిచినోడికి ఏం దొరికింది...?!
ఓడినోడికి ఏం మిగిలింది...!?
ఎవడు గెలిచి ఏం సాధిస్తాడు..?
వాడూ ఎప్పుడో అప్పుడు "జీవిత యుద్ధంలో" ఓడిపోవాల్సిందేగా...!
గెలిచినోడికైనా ఓడినోడికైనా చివరికి కావలసింది "ఆరు... మూడు" అడుగుల భూమే కదా...!
ప్రపంచాన్ని జయించాలని బయలుదేరిన "అలెగ్జాండర్" ఎక్కడ..!?
నరమేధానికి పాల్పడిన "హిట్లర్" ఆనవాలు ఎక్కడ..!?
కళింగ యుద్ధంతో రక్తం పారించిన అశోకుడెక్కడ..!?
ప్రపంచానికి "శాంతి, అహింసను" బోధించిన "బుద్ధుడి" స్థానం ఎక్కడ...?
చేయాల్సింది "యుద్ధాలు" కాదు గెలవాల్సింది "దేశాలను" కాదు
మనుషులను.. మనసులను...!
"యుద్ధం "ఆపండి
నరమేధానికి అడ్డు కట్ట వేయండి
పసి పిల్లలు, పండుటాకులు, పడుచులు..!
చివరికి సమిధలుగా మిగిలేది వీరేగా..?!
"యుద్ధం ఆపండి"..?
చేయాల్సింది "యుద్ధం" కాదు..!
గెలవాల్సింది భూభాగాలను కాదు..!
మనుషులను... మనుసులను..!
"ద్వేషం వీడి దేశాలను ప్రేమించు"....
దేశమంటే "మట్టి" కాదు "మనుషులని" గుర్తించు..?
గెలిచేది "మతం" కాదు "మానవత్వమని" నిరూపించు ...!

డాక్టర్ మహమ్మద్ హసన్
సహాయ ఆచార్యులు

ఆనందం వెల్లివిరియాలి

స్వార్థం మానుకో.. సాయం పెంచుకో
సహనం పాటించు.. ప్రశాంతతను సాధించు
ఆవేదనలు వదులుకో.. అనురాగాలు పెంచుకో
ఆత్మీయతను పంచుకో.. కోట్ల కోసం కుస్తీలు
ఆస్తుల కోసం ఆరాటాలు,, అధికారం కోసం పోరాటాలు
క్రూరత్వం కుటిలత్వం.. కుయుక్తులు కుట్రలు మానుకో
సిరి సంపదల కంటే.. గుణ సంపద మనిషిని
మహోన్నతున్ని చేస్తుంది.. విలువలే మనిషికి నిజమైన ఆభరణాలు
భౌతిక సంపద కంటే మానసిక సంపదే మెరుగు
మనిషి విజ్ఞాని మానసికంగా అజ్ఞాని
సంస్కారం లోపించి సహనం నశించి
అహం ఆవరించి ఆందోళన ఊబిలో
కూరుకుపోయి ఆగమై ఒంటరై పోతున్నాడు
ఆశలపై అదుపు మమత మానవీయత
పరోపకారం భూతదయ సమన్వయం
సహకారం సంఘీబావం జీవనశైలి
కావాలి అసూయ వద్దు.. అనురాగమే ముద్దు
సద్గుణాల వ్యక్తిత్వమే.. అసలైన ఆనందానికి
మూలం ఆనందం.. ధన సంపధ వల్ల రాదు
గుణ సంపద వల్ల వస్తుంది..
వ్యక్తిత్వం వికసిస్తే ఆనందం
వెల్లి విరుస్తుంది

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
9440245771

లక్ష్యానికి అనుగుణంగా దాన్యం సేకరణ జరపాలి

- ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి
- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శన

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, 23 (జనం సాక్షి)

కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. గురువారం ఘట్కేసర్ మండలం,ఎదులాబాద్, మాదారం గ్రామాలలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఐకేపీ ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి, అక్కడ రైతులకు అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని, సేకరించిన ధాన్యం వెంటనే లారీలలో లోడ్ చేయించి, ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తరలింపులో జాప్యానికి తావు లేకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా తార్పాలిన్, గన్ని బ్యాగులు అందుబాటులో ఉండేలా, ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల వల్ల ధాన్యం తడిసిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకొని, అధికారులు వరకు ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థ వంతంగా నిర్వహిస్తూ, తుది దశకు చేర్చాలని అన్నారు. ఇదే స్ఫూర్తితో పని చేస్తూ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా దాన్యం సేకరణ జరపాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని తద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాజేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతను పరిశీలించిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను పాలమూరు యూని వర్సిటీలో భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత ఏర్పాట్లను గురువారం మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ తనిఖీ చేశారు. భద్రత సిబ్బంది 24/7 అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ఏర్పాట్లు ఎప్పటి కప్పుడు మూడంచెల భద్రతా నిఘా పెట్టాలని, అలాగే సి సి కెమెరా అబ్జర్వేషన్ సక్రమంగా వుండేలా చూడాలని భద్రత అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డిసిఆర్‌బి డిఎస్‌పి రమణా రెడ్డి పాల్గొన్నారు.

కోకాపేటలో అక్రమ నిర్మాణాల తొలగింపు

- పర్మిషన్ ప్రకారమే నిర్మాణాలు చేసుకోండి
- నార్సింగి మున్సిపాలిటీ కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్ రెడ్డి

రాజేంద్రనగర్, మే 23(జనం సాక్షి)

గండిపేట మండలం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్ లో అక్రమ నిర్మాణాలపై హెచ్ఎండిఏ అధికారులు ఉక్కు పాదం మోపారు. గురువారం కోకాపేటలోని జి ప్లస్ 2 పర్మిషన్ తీసుకొని జి ప్లస్ 5 అదనపు అంతస్తులు నిర్మిస్తున్న బహుల అంతస్తుల నిర్మాణలను ఎన్ఫోర్స్మెంట్, మున్సిపల్ అధికా రులు సంయుక్తంగా కలిసి స్లాబ్‌లను తొలగించారు. ఈ కూల్చివేతల్లో మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్ కుమార్ రెడ్డి, టీపీఓ మణిహారిక, హెచ్ఎండిఏ ఇన్ఫోర్స్మెంట్ టీం అధికారి సంతోష్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీలో నిబంధనల ప్రకారం అంతస్తులు నిర్మించుకోవాలని నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు

చేపట్టిన ఎప్పుడైనా కూల్చివేస్తామని హెచ్చరించారు. కొందరు జి ప్లస్ 2 పర్మిషన్ తీసుకొని జి ప్లస్ 4 నిర్మాణాలు చేపడుతున్నారని అట్టి నిర్మాణాలను ఎప్పటికైనా కూల్చివేస్తామన్నారు.

ప్రపంచ చెఫ్స్ కాంగ్రెస్‌కు భారత్ నాయకత్వం

- తొలి ప్రస్థానం సింగపూర్ కాంగ్రెసుతో..
- ఐఎఫ్సీఏ ప్రధాన కార్యదర్శి చెఫ్ విజయ భాస్కరన్
- ఘనంగా తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవం
- 'నీరు, ఆహార వినియోగం'పై చర్చ

హైదరాబాద్, మే 23 (జనం సాక్షి)

ప్రపంచ చెఫ్స్ కాంగ్రెసుకు భారత్ నాయకత్వం వహించనుందని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఎఫ్సీఏ ప్రధాన కార్యదర్శి చెఫ్ విజయ భాస్కరన్ తెలిపారు. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఐదో వార్షికోత్సవాన్ని హైదరాబాదులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ చెఫ్ కాంగ్రెస్ సింగపూర్‌లో జరగబోతుందన్నారు. ప్రపంచ చెఫ్ కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక ఈ సమావేశంలో ఉంటుందన్నారు. ప్రపంచంలోని చాలా దేశాల మద్దతుతో చెఫ్ ఎంఎస్ గిల్ నామినేట్ చేయబడతారని చెప్పారు. అధ్యక్ష పదవికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, పర్యాటక మంత్రిత్వ శాఖ, ట్రేడ్ ప్రమోషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇప్పటికే మద్దతు ఇస్తున్నాయన్నారు. తదుపరి జాతీయ మహాసభలు హైదరాబాద్ వేదికగా జరగనున్నాయని చెప్పారు. స్టాండర్డైజేషన్ తీసుకురావడానికి వివిధ సంస్థలతో మాట్లాడుతున్నామన్నారు. ఇటీవల అక్షయపాత్రకు చెఫ్‌లను పంపామన్నారు. పరిశుభ్రత, ఆహార భద్రతపై అవగాహన కల్పించామన్నారు. హైదరాబాద్, బెంగుళూరుతో పాటు అక్షయ పాత్ర కార్యకలాపాలు ఉన్న ఇతర నగరాలలో ఇటువంటి శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ వృత్తిలోకి యువకులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి ఈ వృత్తిని ఆకర్షణీయంగా మార్చడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఎఫ్డీఐ, ఆక్స్‌ఫర్డ్ విజిటింగ్ ఫెలో, సీయూహెచ్చే అంబాసిడర్, బీ స్మాల్ గెస్ట్ లెక్చరర్ రామచందర్ పూడిపెద్ది మాట్లాడుతూ ఐదు నక్షత్రాల హోటళ్లను అవసరమైన రంగంగా గుర్తించామన్నారు. ఇది చాలా సహజంగా అనిపించవచ్చని, కానీ హైదరాబాద్‌ను ప్రపంచ నగరంగా మార్చేందుకు ఇది చాలా అవసరమన్నారు. మౌలిక సదుపాయాలు, విమానాశ్రయం, రోడ్లు ఉండాలని అర్థం చేసుకున్నామని తెలిపారు. హోటల్‌లో బస, అతిథికి అందించే సేవలు.. ఆయన పెట్టుబడి లక్ష్యాలను కొనసాగించడానికి నగరాన్ని ఎలా అంచనా వేస్తాడో నిర్ణయిస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలో ఆ విధంగా పెట్టుబడిదారులను సానుకూలంగా ప్రభావితం చేయగల బాధ్యత, శక్తికి కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ చెఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెఫ్ ధర్మేంద్ర లంబా మాట్లాడుతూ పాక ప్రపంచంలో చెఫ్‌లు పాత్ర ఎనలేనిదన్నారు. ఇండస్ట్రీ దిగ్గజాలు, చెఫ్‌లు, స్టూడెంట్స్ అందరినీ ఒకే పైకప్పు కింద చూడటం ఆనందంగా ఉందన్నారు. ఈ సమయంలో దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు 'నీటి సంక్షోభం' అన్నారు. నీటిపై ఆధారపడిన సంస్థగా దీనిని పేర్కొనవచ్చన్నారు. ఇదే సమయంలో ఆహారాన్ని పొదుపు చేయడంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ఆహారాన్ని వృధా చేయరాదన్నారు. చెఫ్‌లు తెర వెనుక అవిశ్రాంతంగా పని చేస్తారన్నారు. వృత్తికి పర్యాయపదంగా చెప్పొచ్చన్నారు. ఈ కార్యక్రమానికి గోవా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌ల విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు, గృహిణులు, ప్రఖ్యాత చెఫ్‌లు హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన వసతులు కల్పించాలి

- రైతుల నుండి ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్‌లు అందజేయాలి
- అధికారులు ప్రతి రోజు ట్రాక్ షీట్ పరిశీలించాలి
- జిల్లా కలెక్టర్ శశాంక్

ఇబ్రహీంపట్నం, మే 23(జనం సాక్షి)

అబ్దుల్లాపూర్మెట్ మండలం, బాచారం గ్రామంలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ధాన్యానికి తరుగు ఏమైనా తీస్తున్నారా అని రైతులను ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని సమాధానం ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియచేయాలన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తూకం జరిపించాలని అధికారులకు సూచించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట లారీలలో లోడ్ చేయించి, రైతుల నుండి ధాన్యం తీసుకున్న వెంటనే టోకెన్ లు అందించాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలీలు సేవలందించేలా ఏర్పాట్లు ఉండాలని, రైస్ మిల్లుల వద్ద కూడా ధాన్యం లోడ్‌లతో కూడిన లారీలు నిలిచి ఉండకుండా ఎప్పటికప్పుడు ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకునేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు. ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా చూడాలని, ధాన్యం నిల్వలు తరలించేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడి క్లీనర్లు అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అకాల వర్షాల కూరుస్తున్నందున రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కాకుండా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వం ప్రకటించిన మేరకు పూర్తి స్థాయిలో మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని అన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడిచిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల గురించి రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ ముందస్తుగానే వారిని అప్రమత్తం చేయాలని, తద్వారా ఆరబోసిన ధాన్యం తడవకుండా వారు జాగ్రత్తలు చేపట్టేందుకు వీలుంటుందని అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 33 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగినది, 17 కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరణ జరుపుతున్నామని, ఎక్కడ కూడా తరుగు వంటివి లేకుండా గట్టి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.కేంద్రాలలో రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలూ అందుబాటులో ఉంచామని,ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే రైతులు నేరుగా జిల్లా అధికారుల దృష్టికి తేవచ్చని, జిల్లా స్థాయిలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది మొదలుకుని అధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట డిసిఓ ధాత్రి దేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్ కుమార్ రాథోడ్, సివిల్ సప్లైస్ డీ.ఎం విజయ లక్ష్మీ, అబ్దుల్లాపూర్మెట్ తహశీల్దార్ సంబంధిత అధికారులు, తదితరులు ఉన్నారు.

అన్ని దానాల కన్నా అన్నసమర్పణగొప్పది

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్

తాండూరు మే 23 (జనం సాక్షి)

అన్ని దానాల కన్నా అన్నసమర్పణగొప్పదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ అన్నారు. గురువారం వైశాఖ పుష్య పౌర్ణమి సందర్భంగా గానుగాపూర్‌లో కోలువుదిరీన శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు వేదమంత్రోచ్చరణలతో ఆశీర్వదించి మరేన్నో ఉత్తమ పదవులు చేపట్టాలని మనసారా ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేస్తూ ఘనంగా సన్మానించారు. వైశాఖపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమర్పణ నిర్వహించారు .ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్త్య విఠల్ నాయక్ మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి పురష్కరించుకొని అన్నసమర్పణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అన్ని దానాలకన్నా అన్నసమర్పణ గొప్పదన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు.ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని అలవర్చు కోవాలని సూచించారు. ప్రతి నెల పౌర్ణమి రోజు శ్రీ దత్తాత్రేయ స్వామిని దర్శించుకో వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ నర్సింగ్ రావు కుటుంబ సభ్యులు,విఠల్ నాయక్ కుటుంబ సభ్యులు వర్త్య కిష్టమ్మ, వర్త్య ప్రశాంతి, పట్టణ వ్యాపారవేత్తలు ఆలయపూజారులు భక్తులు, తదితరులు ఉన్నారు.

పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు యూనిఫామ్ అందించాలి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

కేశవరం మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌లను కలెక్టర్ సందర్శన

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 23 (జనం సాక్షి)

ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థిని, విద్యార్థులకు యూనిఫామ్ దుస్తులు అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం మూడుచింతలపల్లి మండలం హెడ్ క్వార్టర్, కేశవరం, గ్రామాలను సందర్శించారు. మహిళా శక్తి టైలరింగ్ సెంటర్‌లను, స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, గ్రామీణ అభివృద్ధి అధికారి సాంబశివరావు తో కలిసి సందర్శించి పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల చే, స్కూల్ యూనిఫాం తయారు చేస్తున్న విధానాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఎంత మేరకు కుట్టడం జరిగిందని, వివరాలను అడిగి తెలుసుకున్నారు. దుస్తుల తయారీలో నాణ్యతను పాటించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థి, విద్యార్థుల కొరకు అందిస్తున్న యూనిఫామ్ దుస్తులు, సకాలంలో కుట్టించి, అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ

మూడు చింతలపల్లిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌ను అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను గురువారం కలెక్టర్ గౌతమ్ ఆకస్మికంగా తనిఖీచేశారు .అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల తో మాట్లాడి, పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పురోగతిని పరిశీలించి, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల క్రింద వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్రాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ ను, కాంపౌండ్ వాల్ ను పరిశీలించి, చిన్న చిన్న మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి స్కూల్స్ లో ఎల్ఈడి బల్బులే వాడాలన్నారు. పాఠశాలలు ప్రారంభానికి ముందే, పూర్తి స్థాయిలో మరమ్మతులను చేయించి అందుబాటులోకి తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వత్సల దేవి, మెప్మా అధికారి అనిల్ కుమార్, డిపియం సురేఖ, అసిస్టెంట్ డైరెక్టర్ లింగానందం, ఏయంఓ రవీంద్ర రాజులు , పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్, ఏఈ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సులోచన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణ బోర్డు నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఆదేశించారు. గురువారం మహబూబ్ నగర్ ఇంటర్ విద్య కార్యాలయంలో స్క్వాడ్ బృందాలకు, కస్టోడియన్లకు పరీక్షల నిర్వహణపై ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ పరీక్షల కన్వీనర్‌గా అన్ని అంశాల గురించి చర్చించారు. జిల్లాలో 21 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం 6585 మంది, రెండవ సంవత్సరం 3719 మంది విద్యార్థినీ, విద్యార్థులు మొత్తం 10,304 మంది పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం 2 :30 గంటల నుండి 5:30 గంటల నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా నిర్వాహకులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రతి అంశాన్ని కూలంకశంగా పరిశీలించాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు మంచి నీరు, మరుగుదొడ్లు , ఫ్యాన్లు, లైటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు ఉమా మహేశ్వర్, రవీందర్, స్క్వాడ్ బృందాలు, కార్యాలయ సిబ్బంది సందీప్, సాధిక్, అలీ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజ్ నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్ చంద్రారెడ్డి

నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు ఆదేశం

కీసర, మే 23 (జనం సాక్షి)

డ్రైనేజీ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని బిఎమ్ఆర్ కాలనీలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం చైర్మన్ చంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి, త్వరిత గతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

అధికారులు బాధ్యత యుతంగా పని చేయాలి

జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన ద్వారా రైతుల నియంత్రణ లో లేకుండా ప్రకృతి వైపరీత్యాలు వలన పంట నష్టం జరిగితే ఆర్థిక నష్టం జరగకుండా భీమా రైతులకు ప్రయోజనకరంగా రిస్క్ కవరేజీ కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ జి రవి నాయక్ అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంపై గురువారం మహబూబ్ నగర్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జి రవి నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం వానాకాలం సీజన్ నుండి తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించిందని అన్నారు. 2015-2016 యాసంగిలో ప్రారంభమైన ఫసల్ భీమా యోజన లో తెలంగాణ రాష్ట్రం 2019-20 యాసంగి వరకు కొనసాగి కొన్ని కారణాల వలన 2020-21లో వైదొలగిందని అన్నారు. వానాకాలం 2024 నుండి తెలంగాణా ప్రభుత్వం తిరిగి పి.ఎం. ఫసల్ భీమా యోజనలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. క్షేత్ర స్థాయిలో అనుభవం ఉన్న అధికారులు, రైతులు, శాస్త్ర వేత్తలు తమ అనుభవాలు, సూచనలు అంద చేయాలని అన్నారు. రాష్ట్ర స్థాయిలో వ్యవసాయ శాఖ, ప్రభుత్వం పీడ్ బ్యాక్ ఆధారంగా మరింత సమర్థంగా అమలుకు మార్గదర్శకాలు రూపొందిస్తుందని ఆయన అన్నారు. పంట నష్టం గ్రామాల వారీగా పంటల వివరాలను వ్యవసాయ అధికారులు జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. మహబూబ్ నగర్ రైతు శిక్షణా కేంద్రం వ్యవసాయ అధికారి, మాస్టర్ ట్రైనర్ కృపాకర్ రెడ్డి ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన పరిశీలకులు జె.డి. శైలజ పసల్ బీమా యోజన పథకంపై అవగాహన కార్యక్రమం రాష్ట్రం లో ఉమ్మడి జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యాలయం ఏ.డి.శ్రీదేవి, మహబూబ్ నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారులు, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, రైతులు, కె.వి.కె శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 మే 2024

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పన

జిల్లా కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలు నిరుద్యోగ యువతీ, యువకులకు ఆర్థికంగా స్వయం ఉపాధి కల్పనకు ఎంతో ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ అన్నారు. గురువారం స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ను జిల్లా కలెక్టర్ సందర్శించి శిక్షణా కార్యక్రమాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు నిర్వహించే టైలరింగ్, బ్యూటి షియన్, మగ్గం కోర్సులలో శిక్షణా పొందుతున్న యువతీ, యువకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో, కొత్తగా బిజినెస్ ప్రారంభించాలన్నా నైపుణ్యం అవసరం అన్నారు. స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంస్థ ద్వార శిక్షణా పొందిన వారు ఇతరులకు శిక్షణా అందించడమే కాక ఆర్థికంగా కుటుంబాలకు తోడ్పాటును అందించే అవకాశం ఉందని అన్నారు. వివిధ కోర్సులలో శిక్షణా పొందిన వారికి బ్యాంక్ ద్వారా ఆర్థిక తోడ్పాటు అందించేందుకు తమ వంతు సహకారం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రతిపాదించిన పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నర్వ, మద్దూరు, కొస్గి, కృష్ణ మండలాల లోని ప్రభుత్వ పాఠశాలలలో కొనసాగుతున్న మౌలిక వసతుల నిర్మాణ పనులపై ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏఈలతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షించారు.మద్దూరు, కొస్గి మండలాల్లోని పాఠశాలల్లో ఇంకా కొన్ని చోట్ల నిర్మాణ పనులను ప్రారంభించలేదని, వెంటనే వాటిని మొదలు పెట్టి పూర్తి చేయాలన్నారు.ఆయా మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన చోట ప్రహరీల నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. ఇంకా ఏమైనా నిర్మాణ పనులు అవసరమైతే వాటికి ప్రతిపాదన చేసి పనులు చేపట్టాలని సూచించారు. నర్వ, కృష్ణ మండలాల్లోనూ పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ నిర్మాణాలు అవసరమని ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏఈలు కలెక్టర్‌ను కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి, వెంటనే ఆయా నిర్మాణ పనులను కూడా చేయించాలన్నారు. ఈ సమావేశంలో డిఇఓ అబ్దుల్ ఘని, సిపిఓ జీవరత్నం, జిసిడిఓ పద్మనలిని, పిఆర్ఈఈ హిర్యానాయక్, ఆయా మండలాల ఎంపీడీవోలు ఏఈలు పాల్గొన్నారు.

హిస్టారికల్ కట్టడం పాలిటెక్నిక్‌ను అన్ని విధాలుగా బాగు చేసుకుందాం

వనపర్తి బ్యూరో మే23 (జనంసాక్షి)

చారిత్రాత్మక కట్టడమైన పాలిటెక్నిక్ కళాశాలను అన్ని విధాలుగా బాగు చేసుకుందామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మార్నింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మార్నింగ్ వాక్ లో వనపర్తి పట్టణ వాసులను కలిసి మాట్లాడారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న పురాతన బావికి జాలి ఏర్పాటు, ఉదయపు నడక కోసం వాకింగ్ ట్రాక్, రాత్రి సమయంలో కళాశాల ఆవరణలో పూర్తిగా చీకటి ఉండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పట్టణ వాసులు పేర్కొనడంతో స్పందించిన ఎమ్మెల్యే హైమాస్ట్ లైట్లు సైతం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలించారు. కళాశాల పటిష్టత నిర్మాణాల కోసం మంజూరైన నిధులను వెనక్కి వెళ్ళకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి నిలుపుదల చేశామని ఆ నిధులతో కళాశాలను పూర్తిస్థాయిలో పటిష్టపరచుకుందామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మార్నింగ్ వాక్ లో ఎంఎల్ఏ పట్టణ వాసులతో కలిసి ఎమ్మెల్యే కాసేపు సరదాగా క్రికెట్ మ్యాచ్, ఫుట్బాల్, షటిల్ బ్యాట్మెంటన్ ఆటలు ఆడారు ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, మున్సిపల్ కౌన్సిలర్లు చీరల సత్యం సాగర్, బ్రహ్మం చారి, పట్టణ ప్రముఖ వైద్యులు పగిడాల శ్రీనివాస్ రెడ్డి రమేష్, బొంబాయి మన్నెంకొండ, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా పాలన కాదు ప్రతీకార పాలన

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్
- గూండాల్లారా మీ దాడులకు అదరం, బెదరం ఖబర్దార్
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- శ్రీధర్ రెడ్డి హత్య కేసును సిబిఐతో ఎంక్వయిరీ చేయించాలి
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి

చిన్నంబావి మే 23 (జనం సాక్షి)

చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మీ పల్లి గ్రామంలో కొల్లాపూర్ మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి ప్రధాన అనుచరుడు టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మీ పల్లి శ్రీధర్ రెడ్డి దారుణ హత్యకు గురయ్యాడు. శ్రీధర్ రెడ్డి హత్యతో ఒక్కసారిగా కొల్లాపూర్ నియోజకవర్గం ఉలిక్కి పడ్డట్టు అయింది. వివరాల్లోకి వెళితే టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ రెడ్డి (50) దాదాపు రాత్రి రెండు, మూడు గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు కరెంటు తీసి గొడ్డలితో, వేట కొడవలితో అత్యంత దారుణంగా నరికి చంపారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అభిలాష్ రావు సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని చిన్నంబావి చిన్నంబావి మండల కేంద్రం నుండి శ్రీధర్ రెడ్డి భౌతికయాన్ని పాదయాత్ర చేస్తూ ర్యాలీగా లక్ష్మీ పల్లి గ్రామానికి తీసుకు వెళ్లడం జరిగింది. అక్కడ ఏర్పాటుచేసిన పత్రికా విలేకరులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యుల ఫిర్యాదు ఆధారంగా సాక్షాత్తు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తం ఉందని ఫిర్యాదులు జూపల్లి కృష్ణారావు పేరు తీయాలని కుటుంబ సభ్యులను ఒత్తిడికి గురి చేస్తున్నారని అన్నారు. శ్రీధర్ రెడ్డికి వ్యక్తిగతంగా ఎలాంటి తగాదాలు లేవని చుట్టుపక్కల గ్రామాలలో మంచి పేరు కలిగి ఉన్నాడని అన్నారు. గత పది సంవత్సరాలలో టీఆర్ఎస్ పాలనలో ఎన్నడు ఇలా జరగలేదని ప్రభుత్వం చొరవ తీసుకొని నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని లేదంటే రాష్ట్ర మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. లక్ష్మీ పల్లి గ్రామానికి శ్రీధర్ రెడ్డి కుటుంబానికి ఒక సోదరుడిగా అన్ని విధాలుగా అండగా ఉంటామని టిఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నాడు. మాజీ శాసనసభ్యులు బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి దారుణ హత్య వెనకాల రాజకీయ కోణం ఉందని దీని వెనకాల ఎంత పెద్దమనిషి ఉన్న ప్రభుత్వం కచ్చితంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ హత్య వెనకాల రాజకీయ కుట్ర ఉందని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ తో, బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, గువ్వల బాలరాజ్, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్ రావు, ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పిటిసి వెంకట్రామమ్మ , పానగల్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల నాయకులు గోవిందు శ్రీధర్ రెడ్డి, చిన్నారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, తిరుపాలు, మద్దిలేటి, నారాయణ, ఉగ్ర నరసింహ, శరత్ రెడ్డి, వెంకటేష్ టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

- తల్లిదండ్రుల పట్ల భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలి
- క్రికెట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి

వనపర్తి బ్యూరో మే 23 (జనం సాక్షి)

పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పెద్దమందడి మండలం సమన్వయకర్త తూడి శ్రీనివాస్ రెడ్డి తల్లిదండ్రులు వెంకటమ్మ, సాయిరెడ్డిలా జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో క్షణక్షణం చాలా విలువైనదని యువకులు విలువైన సమయాన్ని బంగారు భవిష్యత్తు కోసం కేటాయించాలని, ఉన్నతమైన చదువులు, క్రీడల తోపాటు తల్లిదండ్రులను దైవంగా భావించి ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమేనని గెలిచినవారు ఓడినవారు ఎలాంటి బావోగ్వేదాలకు లోను కాకుండా క్రీడా స్ఫూర్తితో మెలగాలని ఆయన అన్నారు.ముఖ్యంగా యువకులు చెడు మార్గాలకు ఆకర్షితులవ్వకుండా ఉన్నతమైన మార్గాలను ఎంచుకొని భవిష్యత్తులో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రఘు ప్రసాద్, ఖిల్లాగణపురం మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే

అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో బంగారు పతకం సాధించిన విద్యార్థులను గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అభినందించారు.ఈనెల 18 19 20 తేదీలలో గోవా రాష్ట్రంలో నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీలలో 4 దేశాలకు సంబంధించి 28 రాష్ట్రాల నుంచి 1200 మంది విద్యార్థులు ఈ కరాటే పోటీలలో పాల్గొన్నట్లు మాస్టర్ మహేష్ తెలిపారు. 1200 మందిలో అండర్ 14,అబోవ్ 14, అండర్ 21, అబోవ్ 21, విభాగాలలో విద్యార్థులు వినయ్ కుమార్, శివప్రసాద్, తరుణ్, మహేష్ లు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారని మాస్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే విద్యార్థులను గోల్డ్ మెడల్, ప్రశంసపత్రాలతో సన్మానించి అభినందించారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- క్రీడాకారులకు 40 జతల దుస్తులను అందించిన ఆంధ్రిచెట్టు రాముడు
- ప్రశంసించిన జిల్లా క్రీడల శాఖ అధికారి

మానవపాడు, మే 23 (జనం సాక్షి)

క్రీడలతో దేశ ఖ్యాతి చాటడంతో పాటు ఏదైనా సాధించగలనే మనోధైర్యం ఉంటుందని జోగులాంబ గద్వాల జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి డాక్టర్ బిఎస్ ఆనంద్ అన్నారు. గురువారం మానవపాడు మండల కేంద్రంలోని.. వాలీబాల్ సమ్మర్ క్యాంపు శిబిరాన్ని జిల్లా అధికారులు, వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు విజిట్ చేశారు. సమ్మర్ క్యాంపు చాలా అద్భుతంగా ఉందని చాలామంది విద్యార్థులు వాలీబాల్ క్రీడాను నేర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మానవపాడు మండల కేంద్రానికి వాలీబాల్ క్రీడకు చాలా సంబంధం ఉందని, ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వాలీబాల్ ఆడుతూ రాష్ట్రస్థాయి వరకు ఎదిగిన క్రీడాకారులు ఉన్నారని గుర్తు చేశారు. చాలామంది క్రీడాకారులు పోలీసులుగా, ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించడం సంతోషదాయకరమన్నారు. పత్రిక విలేకరులు కూడా ఇక్కడ నిర్వహించే ప్రతి క్రీడాను ఆస్వాదిస్తూ సమాజానికి తెలియజేసే విధంగా ప్రచురణ చేస్తూ సహకరిస్తున్నారని తెలియజేశారు. సమ్మర్ క్యాంపు పూర్తయిన తర్వాత రాబోయే రోజుల్లో మానవపాడు వేదికగా అద్భుతమైన టోర్నమెంట్లు నిర్వహిస్తామని తెలిపారు. సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు ఈ కార్యక్రమంలో హాజరై జిల్లా అధికారులను ఘనంగా సన్మానించారు. సమ్మర్ క్యాంపు నిర్వహించి తమ గ్రామాల విద్యార్థులను ఆదరించిన జిల్లా కలెక్టర్, అదేవిధంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మర్ క్యాంపుకు వచ్చిన క్రీడాకారులకు మానవపాడు గ్రామానికి చెందిన నాయకుడు ఆంధ్రిచెట్టు రాముడు 40 జతల క్రీడా దుస్తులను తన తమ్ముడు జయరాముడు జ్ఞాపకార్థం సందర్భంగా అందించారు. మానవపాడు గ్రామ అభివృద్ధిలో తమ సహాయ సహకారాలు ఎల్లప్పటికీ అందిస్తుంటానని అంధ్రిచెట్టు రాముడు, జనం సాక్షి దినపత్రికకి తెలిపారు. అనంతరం వాలీబాల్ సీనియర్ క్రీడాకారులను కూడా ఘనంగా సన్మానించుకున్నారు. ఇట్టి కార్యక్రమంలో ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి జితేందర్. జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిసన్న, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి నరసింహరాజు, జిల్లా కబడి అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రజనీకాంత్, కోకో అసోసియేషన్ కార్యదర్శి ఆనందు, రఘు, సీనియర్ వాలీబాల్ క్రీడాకారులు రఘు రెడ్డి, తులసి రామ్, మల్లికార్జున్, ఈరన్న, కిషోర్, శ్రీరాములు, సాధిక్, నాగేంద్రం, పరమేష్, శ్రీను, చంద్రన్న, దామోదర్ రెడ్డి, సమ్మర్ క్యాంప్ పీటి రాముడు, రాంబాబు, క్రాంతి, కిషన్, పరమేష్, వెంకటేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్ రెడ్డిది రాజకీయ ప్రేరేపిత హత్య

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎస్పీకి విజ్ఞప్తి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

వనపర్తి బ్యూరో మే 23 (జనం సాక్షి)

బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి ది రాజకీయ ప్రేరేపిత హత్య అని నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మిపల్లిలో బిఆర్ఎస్ మండల నాయకులు శ్రీధర్ రెడ్డి దారుణ హత్యకు గురికావడం పట్ల మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశాలలో బంధువుల పెళ్లికి వెళ్ళిన మాజీ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. గత 5నెలల కాలంలో ఇద్దరు బి.ఆర్.ఎస్ నాయకులు హత్యకు గురికావడం దురదృష్టకరం అని గత పది సంవత్సరాలుగా రాజకీయాలలో చెదురు ముదురు సంఘటనలు తప్ప ఒక్క హింసాత్మక చర్యగానీ, హత్యలుకాని జరగలేదని అన్నారు. ఎన్నికల తర్వాత సోదరభావంతో అందరినీ కలుపుకొని ప్రజాస్వామ్యయుతంగా పాలన చేశామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ ద్వేషాలను వ్యక్తిగత ద్వేషాలుగా తీసుకొని గతములో గంట్రావ్ పల్లెలో మల్లేష్ యాదవ్ ని నిన్నా రాత్రి లక్ష్మిపల్లీలో శ్రీధర్ రెడ్డి ని దారుణంగా గొడ్డలతో నరికి చంపారు.దీనిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. ప్రజాస్వామ్యంలో హత్యలకు తావు లేదని నాయకులు కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి అని ఆత్మస్థైర్యం కొల్పోవొద్దన్ని అండగా ఉంటాం అని చెబుతూ శ్రీధర్ రెడ్డి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లా ఎస్పితో మాట్లాడిన నిరంజన్ రెడ్డి సమగ్ర విచారణ చేసి హత్య చేసిన వారిని ప్రోత్సహించిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

మూతపడిన పాఠశాలను తెరిపించాలి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్స్

సంగారెడ్డి ప్రతినిధి,మే 23 (జనం సాక్షి)

ప్రభుత్వ పాఠశాలలో గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని టిపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. గురువారం టిపిటిఎఫ్ నాయకులు కమ్రుద్దీన్, లక్ష్మణ్‌లు మాట్లాడుతూ గత ప్రభుతం మాదిరిగా ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేయకుండా,కొత్త ప్రభుత్వం పాఠశాలల ప్రారంభం నాటికి పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మూతబడిన పాఠశాలలను తెరిపించాలని, ఏఏపీసి పాఠశాలలతో పాటు,మన ఊరు-మన బడి పనులు వేగవంతం చేసి,పాఠశాలల ప్రారంభం నాటికి పూర్తి అయ్యేట్లు తగుచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు,ప్రతి తరగతికి ఒక గది ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీ పొంది-విడుదల కానీ ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేసి వారి స్థానంలో రెగ్యులర్ ఉపాధ్యాయులు వచ్చే వరకు విద్యా వాలంటీర్లను నియమించాలన్నారు. నిలిచిపోయిన బదిలీలు-పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు. ప్రతి పాఠశాలకు ఒక పారిశుద్ధ్య కార్మికుడు, ఒక నైట్ వాచ్మెన్ ను నియమించాలని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలు, అన్ని మండలాలకు రెగ్యులర్ ఎంఈఓలు ఉండే విధంగా-పిఓ 2018 ననుసరించి నూతన సర్వీస్ రూల్స్ రూపొందించాలని డిమాండ్ చేశారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

డిఎస్పీ ఎన్ లింగయ్య

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు డిఎస్పీ.ఎన్.లింగయ్య తెలిపారు. ఈనెల 24 నుండి జూన్ 3 వరకు అడ్వాన్స్ సప్లమెంటరీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నారాయణపేట జిల్లాలో నిర్వహించే 10 పరీక్షకేంద్రల వద్ద 144 సిఆర్పిసి సెక్షన్ విదించడం జరిగిందని డీఎస్పీ ఎన్ లింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు జరుగు సమయంలో సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయాలని, పరీక్ష సెంటర్స్ వద్ద నుండి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పోలీసు అధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులు పరిక్షసమయంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. పోలీస్ స్టేషన్ నుండి ప్రశ్న పత్రాలు పరిక్ష కేంద్రానికి వెళ్ళే సమయంలో తప్పనిసరిగా ఎస్కార్ట్ వుండాలని, పరిక్ష కేంద్రాల వద్ద పట్టిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికే గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఎస్పీ సూచించారు.

పోలీస్ కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అడిషనల్ డిజిపి అభిలాష బిస్ట్

నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి) :

జూలై నుంచి అమలు లోకి వస్తున్న క్రిమినల్ కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడిషనల్ డిజిపి అభిలాష్ బిస్ట్ అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ డీజీపీ ఆఫీసు నుండి అడిషనల్ డీజీపీ (ట్రైనింగ్స్) అభిలాష్ బిస్ట్ నూతన పోలీస్ చట్టాలు, కొత్త క్రిమినల్ చట్టాలు జులై నెల నుండి అమల్లోకి రానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా అన్ని జిల్లాల పోలీసు అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త క్రిమినల్ చట్టాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా నుండి పోలీసు అధికారులు డీఎస్పీలు ఎన్ లింగయ్య, మహేష్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమీన్పూర్ పెద్ద చెరువును పరిశీలించిన కలెక్టర్ క్రాంతి వల్లూరు

అమీన్పూర్ మే 23 (జనం సాక్షి)

అమీన్పూర్ పెద్ద చెరువు శిఖం భూముల ఎఫ్టిఎల్ బఫర్ జోన్‌లకు సంబంధించిన రిపోర్టులను వెంటనే సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు నీటిపారుదాల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం అమీనాపూర్ పెద్ద చెరువు ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, మునిసిపల్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారుల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పెద్ద చెరువు తూముల నుండి నీరు కిందికి వెళ్లే కాలువలను కలెక్టర్ పరిశీలించారు. చెరువు తుములకు సంబంధించి మ్యాపులను , నీరు కిందికి వెళ్లే మార్గాలను తూముల వివరాలను అధికారులు కలెక్టర్ కి మ్యాప్ ద్వారా వివరించారు. వెంటనే చెరువుకు సంబంధించిన ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ లకు సంబంధించిన రిపోర్టులను అందజేయాలని ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.ఇట్టి పర్యటనలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ తోపాటు అమీన్పూర్ తహసీల్దార్ రాధా మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'నిర్జన వారధి'

ఇంకిపోయాయి" అంది.

ఆమె ధైర్యం, స్వతంత్ర భావాలు మనల్ని ప్రభావితం చేస్తాయి. 1964లో తనకు విడాకులిమ్మని కోరిన సీతారామయ్యను తిరిగి భర్తలా అంగీకరించలేక పోయిన ఆమె ఆత్మాభిమానం మనల్ని ముగ్ధులను చేస్తుంది. కమ్యూనిస్టు పార్టీ స్త్రీలకిచ్చిన స్వేచ్ఛ వలన స్త్రీలు ఎన్నో పనులు చేయగలిగారు. అయితే పురుషుల కంటే స్త్రీలు ఎక్కడయినా ఒక అడుగు ముందుకు వేస్తే మాత్రం వారిలో పురుషాధిక్య భావం కనిపించేదని కోటేశ్వరమ్మ పేర్కొంది. దీనివలన ఆమె సునిశిత పరిశీలనా దృష్టి, పార్టీలోని స్త్రీల పరిస్థితి మనకు తెలుస్తుంది.

కులవ్యవస్థ వ్యతిరేకత: ఆమె కులవ్యవస్థని, అంటరానితనాన్ని వ్యతిరేకించింది. స్కూల్లో మాలలు మాత్రం మనుజులు కారా? అన్న పాటలు పాడేది. చిన్నప్పుడు బ్రాహ్మణ బాలిక కామేశ్వరి ఇంటికి ఆడుకోవడానికి వెళ్ళేది. వాళ్ళ బామ్మ, కోటేశ్వరమ్మ శూద్రుల పిల్ల, ఇంట్లోకి రానివ్వద్దు అనేది. అప్పుడు కోటేశ్వరమ్మకి అనిపించేది, "భూసురుల ఇళ్ళల్లోకి వాళ్ళ కులం వాళ్ళు కాకపోతే వెళ్ళగూడదా? కులం తెలియని కుక్కలు, పిల్లులు వెళ్ళొచ్చా? మనుషులెళితే అంటుకునే దోషం జంతువులెళితే%ా% అంటదా?" అని. అంత చిన్న వయసులో ఆమెకలాంటి ఆలోచనలు రావడం మనల్ని చకితులను చేస్తుంది.

అత్తగారింట్లో ధర్మడు అనే మాలవాడుండేవాడు. ఇంటి పనులు మాల వాళ్ళ చేత చేయించకూడదని, ఒకవేళ చేయిస్తే, పక్కవాళ్ళు చూసి, "ముందను ముత్తెదువును చేసింది చాలక, అంటరాని వాళ్ళతో ఇంటి పనులు చేయిస్తున్నారని ఎగతాళి చేస్తారు" అని అత్తగారు సణిగేది. ఒకరోజు పొయ్యి మీద గుగ్గిళ్ళ కుండను వారుస్తుంటే వేడినీళ్ళు కాళ్ళమీద పడ్డాయి. బాధతో కుండను వదిలేసి, ధర్మడుని పిలిచి, నీళ్ళు వంచేసి గుగ్గిళ్ళను బుట్టలో పెట్టమంది. నేను మాలవాడ్ని, కుండను ముట్టుకోరాదన్నాడు ధర్మడు. "నీవు మాలవాడివని కుండకు తెలియదంది" కోటేశ్వరమ్మ. చివరలో ధర్మడు నీళ్ళు ఒంపేసి మనసున్న మనిషిలా, మౌనంగా గుగ్గిళ్ళను బుట్టలో పెట్టుకుని ఎడ్ల దగ్గరకెళ్ళాడు అని వ్రాసింది.

1952లో ఎన్నికల ప్రచారం కోసం కోటేశ్వరమ్మ, రాజమ్మ కృష్ణాజిల్లా, వీరుళ్ళపాడు గ్రామానికి వెళ్ళారు. ప్రచారం తర్వాత ఓ ఇంట్లో భోజనం ఏర్పాటు చేశారు. కోటేశ్వరమ్మను బ్రాహ్మణ యువతి అనుకుని లోపల కంచం పెట్టి వడ్డించారు. రాజమ్మ నల్లగా ఉండటం వలన ఆమెని మాలదనుకొని ఆమెకి, డ్రైవర్‌కి బయట అరుగుమీద వడ్డించారు. కోటేశ్వరమ్మ కోపంతో "రాజమ్మే బాపనమ్మ, నేను కాదు. ఇలాంటి ఆచారాలున్నాయని తెలిస్తే ఆమె మీ ఇంటికి రాదు. మరో విస్తరి వేసి ముగ్గురికి బయట వడ్డించ"మంది.

ఆర్థిక పరిస్థితుల వలన విజయవాడలోని ఇంట్లో ఒక పోర్షన్‌ను విశాలాంధ్రలో పనిచేస్తున్న సత్యమూర్తి (శివసాగర్)కి అద్దెకిచ్చింది. ఇరుగుపొరుగు వారు "అంటరానివాడు నీ ఇంట్లో ఉంటే రేపటినుండి మేం రాము" అని తూటాల్లాంటి మాటలతో ఆమెని బాధపెట్టారు. ఆమె తట్టుకుని నిలబడిరది. సీతారామయ్య పార్టీవాడయినా సత్యమూర్తికి, ఆమెకి మధ్య స్నేహం చివరి వరకు సాగింది.

కమ్యూనిస్టు పార్టీ సి.పి.ఎం, సి.పి.ఐ.గా చీలిపోవడం ఆమె అంగీకరించలేకపోయింది. ఒక పార్టీ వారింటికి వెళ్తే, రెండో పార్టీ వారికి కోపం వచ్చిన సందర్భాలెన్నో చూసింది. ఆ ధోరణి ఆమెకి నచ్చేది కాదు. కమ్యూనిస్టులందరూ ఐకమత్యంతో తమ సిద్ధాంతాల కోసం పనిచేస్తే మంచి ఫలితాలుంటాయని ఆమె నమ్మింది. ఈ పుస్తకంలో పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, ముద్దుకూరి చంద్రశేఖరరావు, సుంకర సత్యనారాయణ, తల్లి అంజమ్మ, మోటూరి ఉదయం, తాపీ రాజమ్మ మీద ఆమె వ్రాసిన వ్యాసాలు ఆమెకు వారితో గల అవినాభావ సంబంధాన్ని, వారి సహచర్యం వలన కమ్యూనిస్టు కార్యకర్తగా ఆమె జీవితం మరింత పరిపూర్ణమైనదన్న విషయాన్ని తెలియపరుస్తాయి.

కళాసేవ: ఆమె సాహిత్య, నాటక రంగాల్లో రాణించింది. స్కూల్లోనూ, జాతీయోద్యమ సందర్భాల్లోనూ, కమ్యూనిస్టు కార్యకర్తగాను పాటలు పాడిరది, పాటలు వ్రాసింది కూడా. ఆమె రాసిన "మనది తెలుగు దేశమమ్మా/ మనది తెలుగు జాతి తల్లీ" అనే పాట ఆ రోజుల్లో ఎంతో ప్రాముఖ్యత సంపాదించుకుంది. మొట్టమొదట 'కన్యాశుల్కం' నాటకాన్ని స్త్రీలతో వేయించినపుడు ఆమె ఒక స్త్రీ పాత్ర వేసింది. రేడియోలో నాటికలు, నాటకాలు వేసింది. "ముందడుగు" నాటకంలో హీరోయిన్ పాత్ర వేసింది. "ఇదీ లోకం" నాటకంలో నటించి ఉత్తమ నటిగా ఎంపికయింది. కొత్త నటులతో 'భూమికోసం' నాటకంలో వేసింది. 'మొల్ల', 'రుద్రమదేవి', బుర్రకథల్లో పాల్గొంది. ఆంధ్రమహాసభలో ఉన్నప్పుడు కథలు రాసేది. కాకినాడ సాహిత్యలహరి సమావేశాలకు కవితలు రాసి గానం చేస్తుండేది. కొన్ని రచనలు విశాలాంధ్రలో వచ్చాయి. వృద్ధాశ్రమంలో కూడా రచనలు చేసింది. ఆమెవి రెండు కథల సంపుటాలు, ఒక కవితా సంపుటి వెలువడ్డాయి.

ముగింపు: జాతీయోద్యమం, విప్లవోద్యమం, సంఘ సంస్కరణోద్యమం, మహిళోద్యమాలతో ముడిబడిన ఆమె జీవితం మనల్ని ప్రభావితం చేస్తుంది. ఒక స్త్రీ ఇన్ని ఉద్యమాలలో పనిచేయడం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఆనాటి రాజకీయాల గురించి, ముఖ్యంగా కమ్యూనిస్టు రాజకీయాల గురించి మనకు అవగాహన కలిగిస్తుంది ఆమె పుస్తకం. కమ్యూనిస్టు సిద్ధాంతాలతో మనం ఏకీభవించినా, ఏకీభవించకపోయినా, సిద్ధాంతాల ఆచరణ కోసం కమ్యూనిస్టులు పడిన బాధల్ని, త్యాగనిరతిని మనం మెచ్చుకోకుండా ఉండలేం. సమానత్వం అన్న భావం కమ్యూనిస్టు పార్టీయే కలిగించింది. స్త్రీలు, పురుషులు, దళితులు అందరూ ఒకటేనని చెప్పింది. స్త్రీలను ఇళ్ళలోనుంచి బయటకు తీసుకొచ్చి ఎన్నో పనులు చేయించింది. పార్టీలో పురుషాధిక్యం ఉన్నప్పటికీ మమూలు పురుషుల కంటే వారే మేలని అంటుంది కోటేశ్వరమ్మ.

సమాజంలో కులవ్యవస్థ, అంటరానితనం ఎంతలా పాతుకుపోయాయో తెలియజేస్తుందీ పుస్తకం. అప్పటి పరిస్థితులపై అధ్యయనం, పరిశోధన చేసేవారికి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పుస్తకాన్ని ఈనాటి తరం, ముఖ్యంగా స్త్రీలు చదవడం ఎంతో అవసరం. ముందు ముందు ఇటువంటి మహిళల స్వీయచరిత్రలు ఎక్కువ వస్తే బావుండునన్న భావన కూడా మనలో కలిగిస్తుంది 'నిర్జనవారధి'. ఎందుకంటే ఉద్యమాల పట్ల, సంఘటనల పట్ల, రాజకీయాల పట్ల మహిళల దృక్పథం ఎలా ఉంటుందో మనకు తెలుస్తుంది కాబట్టి!

దేశాల కీర్తికేతనం 'కామన్‌వెల్త్'

ప్రతి ఏడాది మే 24న కామన్వెల్త్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు. ఈ కామన్వెల్త్ దినోత్సవాన్ని ఇంతకు ముందు 'ఎంపైర్ డే ' అని పిలిచేవారు.

ఇప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటి అయిన నాటి రాయల్ కలోనియల్ నిన్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాధనను 1898 లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశములో ప్రవేశపెట్టగా ఏకగ్రీవం గా అమోదించారు. ఇలా 'ఎంపైర్ డే' ఓ జాతీయ కార్యక్రమమైన ది. ఈ రోజున ఆ దేశంలోని రాజ్యాధినేతల కీర్తిని, ఘనతను, త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఉత్తేజపూరితమైన ఉపన్యాసాలు ఇస్తారు. జాతీయ పతాకం ఎగురవేస్తారు. అన్నిస్కూళ్ళు, ప్రభుత్వ ,ప్రైవేట్ కార్యాలయాలు, గతించిన రాజ్య, దేశాధినేతల గుర్తుచేసుకోవడమే కాక, జాతీయ గీతాలను ఆలపిస్తారు. ఇది ఒకరకమైన దేశభక్తి కార్యక్రమము. కెనడియన్ స్కూలు పిల్లలు నిర్వహించే 'ఎంపైర్ డే' కార్యక్రమాలు మిగతావారిని ప్రభావితం చేశాయి. ఏటా ఈ ఎంపైర్ డేను ఒక్క స్కూలు పిల్లలే కాక అందరూ జరుపుకోవాలని ప్రతిపాదించారు.



యునైటెడ్ కింగ్ డమ్ లో 'లార్డ్ మీథ్' ఎంపైర్ డే ప్రచారం కోసం స్వంతంగా డబ్బులు ఖర్చు పెట్టేవాడు. ఆయన కృషి ఫలించింది. తొలి ప్రపంచయుద్ధం కాలములో బ్రిటన్ లో 'ఎంపైర్ డే' కు అధికారిక గుర్తింపు లభించింది. 1916 మే 24 వ తేదీన తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తం గా జరుపుకున్నారు . 70 వేల స్కూళ్ళు , స్టాక్ ఎక్షేంజ్ వంటి సంస్థలు జెండా వందనము చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే 'ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకువెళ్ళాలని భావించిన మీథ్ రాయల్ కలోనియల్ ఇన్టిట్యూట్‌ను లాంచనంగా అహ్వానించారు. ఇన్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటుచేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి సంథ భవనాన్ని ఉద్యమ కేంద్రముగా చే శారు . 1927 నుంచి 1929 వరకు ఉద్యమ తొలి అధ్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901 లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24 వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' ని నిర్వహించాలని నిర్ణయించారు.

ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఈ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య.. ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగ బద్ధమైన నిర్వచనం అవసరమైంది. అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది. 1949లో ఈ పేరు నుంచి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తి అయిన దేశాల కూటమిగా అది మారింది. అయితే.. బ్రిటన్ రాచరిక కుటుంబం ఈ కామన్వెల్త్ అధినేతగా కొనసాగుతోంది. ఈ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. ఇప్పటివరకూ 53 దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలస రాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు.

1949 లో ఆధునిక కామన్వెల్త్ ఆవిర్భవించాక ఆస్ట్రేలియా, బ్రిటన్, సిలోన్, భారత్, న్యూజిలాండ్, పాకిస్తాన్, దక్షిణాఫ్రికా, కెనడా దేశాధిపతులు లండన్‌లో సమావేశమై ఎంపైర్ డే గురించి చర్చించారు. ఫలితంగా అప్పటిదాకా కొనసాగిన ఎంపైర్ డే 1958 నుండి బ్రిటిష్ కామన్వెల్త్ డే గా మారినది. తరువాత 1966లో కామన్వెల్త్ డేగా రూపాంతరం చెందినది. పాత పోకడలు, చరిత్రతో నిమిత్తము లేకుండా సరికొత్త కామన్వెల్త్ డే నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుతము కామన్వెల్త్ దేశాల న్నింటిలోనూ విభిన్న మార్గాలలో కామన్వెల్త్ డే ను నిర్వహిస్తున్నారు.

ఇక పోతే కామన్వెల్త్ విషయంలో మహిళా పాత్రకి వస్తే, ఆమె ఖ్యాతిగాంచని రంగం లేదు. సాధించని ప్రగతి లేదు. ఆత్మ విశ్వాసాన్ని ఆభరణంగా మలచుకుని విభిన్న వేదికలపై మహిళాలోకం వెలుగులీనుతోంది. స్వతంత్ర భారతంలో అతివల ప్రస్థానం ఆకాశమే హద్దుగా సాగుతోంది. వలసపాలన నుంచి విముక్తి పొందిన భారతావనిలో వనితాలోకం వడివడిగా పురోగమిస్తోంది. ఇందుగలరు అందులేరని సందేహం లేకుండా అతివలు అన్ని రంగాల్లో విజయకేతనం ఎగురవేస్తున్నారు. ఆమె ఆకాశంలో సగం కాదు.. ఇప్పుడు ఆమే ఆకాశం. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. ఏ పక్షి అయినా ఒక రెక్కతో ఎగరలేదు' అని స్వామి వివేకానంద ఏనాడో అన్నారు. ఆయన మాటలు అక్షర సత్యం. వనిత లేనిదే ఏ రంగమూ లేదు. ఆమె ఉంటేనే అభివృద్ధి సంపూర్ణమవుతుంది. స్వతంత్ర భారతావనిలో రాజకీయ, ఆర్థిక, వ్యాపార, క్రీడా, సినీరంగాల్లో మహిళలు చిరస్థాయిగా నిలిచిపోయే విజయాలు సాధించారు.. సాధిస్తున్నారు.

ఉపాధ్యాయ ఉద్యోగాల నుంచి.. దేశాన్ని రక్షించే త్రివిధ దళాల వరకు.. సర్పంచి నుంచి రాష్ట్రపతి పీఠం వరకు ప్రతి చోటా పురుషులకు దీటుగా వనితలు సత్తా చాటుతున్నారు. రాజకీయ, వ్యాపార, క్రీడా రంగాల్లో దేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తున్నారు. బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలతో పాటు బహుళజాతి కంపెనీల అధిపతులుగానూ రాణిస్తున్నారు. ఈ విజయాలన్నీ అంత సులభంగా సాకారం కాలేదు. దశాబ్దాల కట్టుబాట్లపై పోరాడి.. వాటిని ఛేదించి సాధించారు మన మహిళామణులు. ఇది చాలదు.

వారి కోసం దేశం ఇంకా ఎంతో చేయాల్సి ఉంది. ఇప్పటికీ చాలా విషయాల్లో వివక్ష, అభద్రత స్త్రీల పురోగతికి అడ్డుగోడలుగా ఉన్నాయి. వీటిని తొలగించడంతో పాటు చట్టసభల్లో రిజర్వేషన్ల వంటి సానుకూల నిర్ణయాలతో చేయూతనిస్తే.. మహిళలు మరింతగా ముందడుగు వేయగలరు. అలాగే ఒలింపిక్స్, కామన్‌వెల్త్ పోటీల్లో మన దేశానికి ఇప్పటివరకు అతివలే అధిక పతకాలు తెచ్చిపెట్టారు. పీవీ సింధు,బ్యాడ్మింటన్‌లో రెండుసార్లు ఒలింపిక్ పతకాలను ముద్దాడి శిఖరస్థాయి కీర్తిని ఆర్జించారు. తాజా కామన్వెల్త్ క్రీడల్లోనూ స్వర్ణభేరి మోగించారు. బ్యాడ్మింటన్‌లో మరచిపోలేని మరో పేరు సైనా నెహ్వాల్. ఒలింపిక్స్‌లో కాంస్యం, 2010, 2018 కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణాలు సహా ఇప్పటివరకు 24 టైటిళ్లను సాధించారు. టెన్నిస్‌లో సానియా మీర్జా చరిత్ర లిఖించారు. డబుల్స్‌లో వరల్డ్ నంబర్ వన్‌గా నిలిచారు. భారత బాక్సింగ్ చరిత్రలో మేరీకోమ్ ఓ సంచలనం. మన తెలుగమ్మాయి నిఖత్ జరీన్... బాక్సింగ్‌లో తాజా సంచలనంగా దూసుకుపోతున్నారు. ఆడవారైనా ఏటువంటి సంకోచం లేకుండా అన్నీ విధాల దేశాని ముందుకు నడిపిస్తున్నారు.

అలాగే కామన్‌వెల్త్ సభ్య దేశాల్లో భారతీయ మహిళలు వివిధ క్షేత్రాలలో ప్రముఖ భూమి పొందియున్నారు. ప్రధానంగా, భారతీయ మహిళలు రాజనీతి, సామాజిక సంఘటనల లో ప్రముఖ పాత్రలు ప్రదర్శిస్తున్నారు. పోలిటికల్‌లో, సమాజంలో మరియు సాంస్కృతిక క్షేత్రాల్లో అధికారాన్ని పొందడంలో ముఖ్యంగా పనిచేస్తున్నారు. కామన్‌వెల్థ్ సభ్య మహిళల మెంబర్లలో చాలామంది ఉన్నారు. కొన్ని ప్రముఖ వ్యక్తులు:

సుష్మా స్వరాజ్: భారతీయ రాజనీతిలో ప్రముఖ నేత.

మీరా కుమారీ: భారతీయ సంగీత ప్రతిభ, ప్రముఖ కళాకారి.

శాంతి గోవిందన్ నైర్: మలేషియా రాజనీతిలో ప్రముఖ నేతా

ఇలా ఎందరో మహిళలు అన్నీ విధాల తమ ప్రత్యేకతను కలిగి ఉన్నారు. అలాంటి మహిళలు అందరికి ప్రత్యేక అభినందనలు.

ఇట్లు :
దుర్గ సోము

నిమ్స్‌లో విజయవంతంగా గుండె మార్పిడి

ఖైరతాబాద్, మే 23 (జనం సాక్షి) : నిమ్స్ వైద్యులు బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి విజయవంతంగా గుండె మార్పిడి చేశారు. ములుగు జిల్లా ఏటురు నాగారం ప్రాంతానికి చెందిన షేక్ షనాజ్(29) గుండె ఎడమ జఠరిక వద్ద ఏర్పడిన సమస్య (డైలేటెడ్ కార్డియోమయోపతి)తో గత రెండేళ్లుగా బాధపడుతున్నారు. ఈ సమస్య కారణంగా శరీరానికి కావా ల్సిన రక్తాన్ని పంపింగ్ చేయడంతో గుండె పనితీరు మందగించింది. దీంతో ఆస్పత్రి కార్డియోథొరాసిక్ వైద్యులు అమరేశ్వరరావు, గోపాల్‌ను సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు గుండె మార్పిడి చేయా ల్సి ఉంటుందని సూచించారు. అప్పటి నుంచి ఆమెకి మందుల ద్వారా ఉపశమనం పొందుతు న్నారు. గుండె మార్పిడి కోసం వైద్యులు సూచన మేరకు జీవన్‌దాన్‌లో పేరును నమోదు చేయిం చుకున్నారు. అప్పటి నుంచి ఆమె అవయవదాత కోసం ఎదురుచూస్తున్నారు. రెండ్రోజుల క్రితం సికిం ద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో ఓ వ్యక్తి బ్రెయిన్‌డెడ్ అయినట్లు జీవన్‌దాన్ వైద్యబృందం గుర్తించింది. షనాజ్ రక్తనమూనాలు సరిపోవడంతో ఆమెకి గుండె మార్పిడి చేసేందుకు వైద్యులు ఏర్పాట్లు చేశారు. బుధవారం కార్డియోథొరాసిక్ విభాగా ధిపతి అమరేశ్వరరావు సారథ్యంలో వైద్య బృందం మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. పైసా ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి చేశారు. ఇదే తరహా చికిత్స కార్పొరేట్ ఆస్పత్రుల్లో అయితే రూ.20 నుంచి రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు.

వైద్య బృందానికి డైరెక్టర్ అభినందనలు

అత్యంతక సంక్లిష్టమైన గుండె మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన కార్డియోథొరాసిక్ వైద్యులు అమరేశ్వర రావు, గోపాల్, నర్మదా, అర్చన తదితరుల బృందాన్ని ఆస్పత్రి డైరెక్టర్ నగరి బీరప్ప అభినందించారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఆస్పత్రి వైద్యులు వేగంగా నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఇక్కడ పేదలకు ఉచితంగా, అతితక్కువ ఖర్చుతోనే కార్పొరేట్ వైద్యం అందుతోందని చెప్పారు.

శ్రీధర్ రెడ్డి ముమ్మాటికీ రాజకీయ హత్యే

మండిపడ్డ మాజీ ఐపిఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వనపర్తి, మే 23 (జనం సాక్షి):

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు అండతో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని..బిఆర్ఎస్ నేత, నాగర్‌కర్నూలు ఎంపి అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హేచ్చరించారు. దాడులకు బెదిరేది లేదని.. మాఫియాలను రాజ్యాంగబద్ధంగా కుప్పకూల్చే దాకా నిద్రపోనివ్వం ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. వనపర్తి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి గురువారం హత్యకు గురయ్యారు. హత్యాకాండపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. సీఎం, మంత్రి అండతో బీఆర్ఎస్ నాయకులపై పట్టపగలే దాడులు జరుగుతున్నాయని.. ప్రాణాలకు పెను ప్రమాదం పొంచి ఉందని డీజీపీకి ఫిర్యాదు చేసిన పది రోజుల్లోనే శ్రీధర్ రెడ్డి హత్యకు గురయ్యారని ఆయన అన్నారు. ఇది ముమ్మాటికి రాజకీయ హత్యేనని.. తెలంగాణలో ప్రతిపక్షమే ఉండకూడదని పక్కా ప్లాన్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం హత్యల సంస్కృతికి తెరలేపిందని మండిపడ్డారు. ఇది ప్రజా పాలన కాదని.. ప్రతీకార పాలన అంటూ మండిపడ్డారు. మంత్రి అండదండలతో యథేచ్ఛగా జరుగుతున్న దాడుల్లో అధికార పార్టీ నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిని పీడీ యాక్ట్ లాంటి చట్టాలను ప్రయోగించి జైల్లో పెట్టకపోవడంతోనే ఇలాంటి వరుస హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిందితులతో కుమ్మక్కైతున్న కొందరు స్థానిక పోలీసు అధికారులను, ఎంతటి వారైనా సరే, వారిపై డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ చేసి తప్పకుండా శిక్షించడంతో పాటు బదిలీ చేయాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని.. కొల్లాపూర్, నాగర్ కర్నూల్ , అచ్చంపేట నియోజవర్గాల్లోని సమస్యాత్మక గ్రామాల్లో వెంటనే కేంద్ర బలగాలు, స్పెషల్ పోలీసు బలగాలతో పికెట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలకు ముప్పున్న బీఆర్ఎస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులకు వెంటనే రక్షణ కల్పించాలన్నారు. రాష్ట్రంలో అదుగంటిన శాంతిభద్రతలకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- **మరిపెడ సన్నాహక సభలో మంత్రి తుమ్మల పిలుపు**

మహబూబాబాద్,మే 23 (జనం సాక్షి):

ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మేధావులు, గ్రాడ్యుయేట్లు మల్లన్నకు అత్యధిక మెజార్టీ ఇవ్వాలని అన్నారు. మల్లన్నను సోని యా, ఖర్గే ఎంపిక చేశారని.. తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. పోరాటం చేసే సత్తా కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉందని నిరూపిద్దాం. అభ్యర్థి ఎవరైనా సరే పార్టీ ఆదేశాలను అమలు చేసే కార్యకర్తలు, నాయకులు ఉండటం కాంగ్రెస్ పార్టీ అదృష్టం. అధికార పార్టీ బెదిరింపులకు, కేసులకు భయపడకుండా ఒంటరి పోరాటం చేసిన వ్యక్తి మల్లన్న. మూడు జిల్లాల్లో ఉన్న ఎంఎల్‌ఏ లు మెజారిటీ ఇస్తాం అంటున్నారు.. మన దోర్నకల్ నియోజకవర్గం ఎక్కువ ఇవ్వాలన్నారు. మీరిచ్చిన మనో ధైర్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం మా వంతు కృషి చేస్తాం అని మంత్రి వ్యాఖ్యా నించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మా రైతుల మనో ధైర్యం దెబ్బతీసే విధంగా మాట్ల తున్నారని మంత్రి నాగేశ్వరరావు అన్నారు. అయినా సరే మొలకలు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశిం చాం. గతంలో 45 రోజుల్లో రైతులకు డబ్బులేశారు. మేము 4 రోజుల్లో వేస్తున్నాం. సన్న వడ్లకు బోనస్ ఇచ్చాం. దొడ్డు వడ్లు కు కూడా బోనస్ ఇస్తామని తెలియచేస్తున్న మల్లన్నకు మద్దతు ఇవ్వాలని పేర్కొన్నారు. మీరు ఎప్పటి లాగే గత ప్రభుత్వంను నిలదీసిట్లే తప్పు చేసిన ప్రభుత్వాన్ని నిలదీయాలని మల్లన్నను మంత్రి తుమ్మల కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రామచందర్ నాయక్, ఎమ్మెల్సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న పాల్గొన్నారు.

జిల్లాలో బోల్తాపడ్డ బస్సు: ఇద్దరు చిన్నారుల మృతి

కర్నూలు, మే 23: కర్నూలు జిల్లా కోడుమూరు సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి 40 మందికి పైగా ప్రయాణికులతో ఆదోనికి వెళ్తున్న బస్సు గత అర్ధరాత్రి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 40 మందికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన లక్ష్మి (13), గోవర్ధని (8) అనే ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు కోడుమూరు, కర్నూలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బస్సు డ్రైవర్ ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో వేగంగా నడపడంతో కోడుమూరు-ప్యాలకుర్తి మధ్య ప్రమాదం జరిగింది.

ఆర్టీసీ కొత్త లోగోను విడుదల చేయలేదు

- **సోషల్ మీడియాలో వస్తున్న ప్రచారం అబద్ధం: సజ్జనార్**

హైదరాబాద్,మే 23 (జనం సాక్షి):

తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు టీఎసీఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చింది. అయితే, టీసీఎస్ఆర్టీసీ లోగో ఇదేనంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. కొత్త లోగో విషయంలో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టం చేశారు. అధికారికంగా ఇప్పటివరకు కొత్త లోగోను సంస్థ విడుదల చేయలేదన్నారు. టీజీఎస్ఆర్టీసీ కొత్త లోగో అంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న లోగో ఫేక్ అంటూ క్లారిటీ ఇచ్చారు. ఆ లోగోతో సంస్థకు ఎలాంటి సంబంధం లేదని.. కొత్త లోగోను సంస్థ రూపొందిస్తుందని ఆయన తెలిపారు. కొత్త లోగోను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ఇంకా ఫైనల్ చేయలేదన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు టీఎస్ ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మారుస్తూ మంగళవారం ఆర్టీసీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు టీఎస్ఆర్టీసీ పేరును టీజీఎస్ఆర్టీసీగా మార్చామని సజ్జనార్ పేర్కొన్నారు. సలహాలు, సూచనలతో పాటు ఫిర్యాదులను కొత్త సోషల్ మీడియా ఖాతాలో ఇవ్వాలని సూచించారు.

నేడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విత్తన మేళా

హైదరాబాద్,మే 23 (జనం సాక్షి):



డబుల్ డిజిట్ సీట్లలో బీజేపీ విజయం

పట్టభద్రుల ఎన్నికలలో ప్రేమేందర్ రెడ్డి ని గెలిపించాలి : కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

ఖమ్మం బ్యూరో,మె 23 (జనంసాక్షి):
వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖమ్మం నగరంలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మీడియా సమావేశం లో మాట్లాడిన ముఖ్యాంశాలు లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లలో బీజేపీ విజయం సాధిస్తుంది.కేంద్రంలో మరో నరేంద్రమోదీ ప్రధాని కావాలని తెలంగాణ ప్రజలు కోరుకున్నారు..పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘణనీయంగా బలపడింది.ఈ సారి బీజేపికి ఓటింగ్ శాతం పెరిగింది.వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఉప ఎన్నికలు ఈ నెల 27 ఉన్నాయి.ప్రజాక్షేత్రంలో.. ప్రజా ఉద్యమంలో.. విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ముందున్న గుజ్జుల ప్రేమేందర్ మళ్లీ ఉప ఎన్నికల్లో బరిలో ఉన్నారు పార్లమెంట్ ఎన్నికల్లో సానుకులంగా ఉన్నట్లే.. పట్టభద్రుల ఎన్నికల్లో కూడా విద్యావంతులు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.పార్టీ పరంగా, అభ్యర్థి పరంగా చూసిన గుజ్జులకు ప్రజల అండదండలు ఉన్నాయిగతంలో బీఆర్ఎస్ శాసన మండలిని నిర్వీర్యంచేసింది. దానికి ప్రధాన్యత లేకుండా చేసింది.కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలందరిని బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంది. ప్రతిపక్షమే లేకుండా చేసింది.ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. ఎమ్మెల్సీ.. వరుసగా కాంగ్రెస్?లో చేరుతున్నారు.. బీఆర్ఎస్ నుంచి గెలిచినా.. కాంగ్రెస్? నుంచి గెలిచినా రెండు పార్టీలు ఒక్కటే.. బీఆర్ఎస్?నుంచి గెలిచిన వ్యక్తి ఆ పార్టీకి.. ఆ పదవికి రాజీనామా చేయకుండా కాంగ్రెస్? పార్టీ గుర్తుపై సికింద్రాబాద్?లో పోటీ చేశారు. దేశంలో ఇలాంటి ఘటన ఎక్కడ లేదు.. వరంగల్ లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత, బీ ఫాం తీసుకున్నాక కూడా ఆమె కాంగ్రెస్? పార్టీ గుర్తుపై పోటీచేశారు. ఈ రెండు పార్టీలకు నైతిక విలువులు లేవు. రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు.ఈ రోజు మనకు మళ్లీ అవకాశం వచ్చింది.. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరగబోతున్నాయి.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచిన ఆయన పాలక పక్షమే.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచినా ఆయన కాంగ్రెస్?లో చేరడమే సంప్రదాయంగా వస్తుంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్?లో

చేరుతారని మంత్రులు చెబుతున్నారు. విద్యావంతులు, మేధావులు ఆలోచించింది. ప్రజల పక్షాన పోరాడేందుకు అవకాశం ఉన్న బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి. శాసన మండలిలో ప్రజా సమస్యలు.. ఉద్యోగుల సమస్యలు.. నిరుద్యోగులకు సమస్యలు గురించి గొంతు వినిపించాలంటేబీజేపీ అభ్యర్థిని గెలిపించాలి. పదేళ్లుగా తెలంగాణ లో కుటుంబ పాలన నడిచింది. కుటుంబ పాలన పోవాలి. నియంత పాలన పోవాలనే ఆలోచనతో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దుతు ఇచ్చారు. ఇప్పుడు వారి పరిస్థితి పెంకనుంచి పోయిలో పడ్డ చందగా మారింది. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచేందుకు అనేక రకాల హామీలు ఇచ్చారు. ఆరు గ్యారంటీ హామీలు ఇచ్చింది.డిసెంబర్ 9న సోనియగాంధీ జన్మదినం సందర్భంగా సీఎం రేవంత్ ఋణమాఫీ చేస్తామన్నారు. ఇప్పుడు ఆగస్టు 15 వరకు చేస్తామంటున్నారు. మాట ఎందుకు మార్చారు.ఇప్పుడు వర్షాకాలం మొదలుకానుంది.. రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతులు పాత ఋణాలు కట్టొద్దన్నారు. ఇప్పుడు ఋణమాఫీ చేయాలేదు.. వారికి ఇప్పుడు పంట పెట్టుబడి తీసుకునే అవకాశం లేదు.ధాన్యానికి క్వింటల్?కు రూ.500బోనస్ ఇస్తామన్నారు. వ్యవసాయ రంగాన్నికి ప్రభుత్వం ఏమీ లేయలేదు. 45రోజులుగా కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు.వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం మొలకెత్తుతుంది.అయినా ప్రభుత్వం స్పందించడం లేదు.దొడ్డు బియ్యాన్ని ఎఫ్ సీఐ నుంచి కొనుగోలు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.పత్రి గింజకు కేంద్ర ప్రభుత్వ డబ్బులు చెల్లిస్తుంది. కొనుగోళ్లకు సంబంధించిన ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది.వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలుచేస్తామన్నారు.. సోనియాగాంధే స్వయంగా సంతకం పెట్టిన పత్రాలను ఇంటింటి పంపారు.ఇప్పటి వరకు ఎందుకు హామీలను అమలు చేయలేదు. నిరుధ్యోగులకు భృతి చెల్లిస్తామన్నారు.. ఏమైంది మహిళలకు రూ.2500 ఎప్పటి నుంచి వేస్తారు.విద్యార్థులకు రూ.5లక్షల కార్డు ఇస్తామన్నారు. ఏమైందిబీఆర్ఎస్ పార్టీకి ఓటు అడిగే హక్కు లేదు..బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రేపోమాపో చేరబోతున్నట్లు మంత్రులు మాట్లాడుతున్న కేసీఆర్, కేటీఆర్స్పందించడం లేదు.విద్యవంతులు, మేధావులు ఆలోచించి ఈ ఎన్నికల్లో ఓటు వేయాలి.ప్రత్యమ్నాయ శక్తిగా, ప్రశ్నించే గొంతుకగా బీజేపీ ఉంటుంది.ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రధాన్యత ఓటు వేసి గెలిపించాలి.

పట్టభద్రుల ఉప ఎన్నికల్లో గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించండి

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత నరేంద్ర మోదికి చెందుతుంది

బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్

బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి

దేవరకొండ మే 23 జనంసాక్షి :
ఈనెల 27వ తేదీ జరిగే పట్టభద్రుల ఉప ఎన్నికల్లో విద్యావంతుడు, నిరుద్యోగుల సమస్యలపై ప్రశ్నించే గొంతుకై బిజెపి పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీ కార్యకర్తలు పనిచేయాలని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం దేవరకొండ పట్టణంలోని పి పి ఆర్ ఫంక్షన్ హాల్ లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం అసెంబ్లీ కన్వీనర్ ఎటి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజల అభివృద్ధి కొరకు నిజాయితీ గల పరిపాలనకుడిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పని చేస్తున్నారని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన ఘనత నరేంద్ర మోడీకి చెందుతుంది అని అన్నారు.నీతి నిజాయితీకి ధర్మరక్ష పరిరక్షణకు అనుగుణంగా పనిచేస్తున్న గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.నరేంద్ర మోడీ ఎలాంటి అవినీతి లేకుండా నిరుద్యోగులకు, ఉద్యోగులకు బాసటగా నిలుస్తూ ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ప్రశ్నించే గొంతుకను శాసనమండలిలో నిలపడం కోసం దేవరకొండ నియోజకవర్గం పట్టబద్రులంతా ఒకటో నెంబర్ పై ఉండే గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నరేంద్ర మోడీకి మద్దతు పలకాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నల్లగొండ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి పెద్దపల్లి ఎంపీ నేతకాని వెంకటేష్,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ జి మనోహర్ రెడ్డి,పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన నల్లగొండ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి,సుభాష్ చంద్ర జీ,కొప్పు భాష,కేతావత్ లాలు నాయక్,కర్నాటి సురేష్,అంకురి నరసింహ, మల్లేష్ నాయక్,చేనమోని రాములు,వానం నరేందర్ రెడ్డి, వసుకుల సుధాకర్,నక్క వెంకటేష్, నేతల వెంకటేష్, రవి నాయక్ అన్ని మండలాల అధ్యక్షులు దేవరకొండ నియోజకవర్గం లో ఉన్న ప్రజాప్రతినిధులు నియోజకవర్గంలో గల పట్టబద్రులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది తదనంతరం మున్సిఫ్ కోర్టు దేవరకొండలో మరియు కన్యకా పరమేశ్వరి దేవాలయం వద్ద గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు.

అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

జిల్లా ఎస్పి చందనా దీప్తి

నల్గొండటౌన్, మే 23 (జనంసాక్షి): అనుమతులు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పి ఒక ప్రకటనలో తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొ న్నారు. ఇసుక రీచ్ల నుంచి ఇసుక తెచ్చే వారు అనుమతి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని సూచించారు. కొంత మంది దళారులు,మధ్యవర్తులు ఎక్కువ సిమ్ కార్డులు కొని ఇసుకను ఆన్లైన్లో బుక్ చేసుకుని అత్యవసరమైన వారికి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇసుకను ఆన్ లైన్ లో ఎవరి పేరు మీద బుక్ చేసుకుంటే అక్కడే సరఫరా చేయాలి అన్నారు. ఇసుక ట్రాక్టర్లను అనవసరంగా రోడ్ల పైన ఆపడం వల్ల అనేక ప్రమాదాల జరుగుతున్నాయని అలాంటి వారిపై ట్రాఫిక్ నిబంధనలు ప్రకారం కేసులు నమోదు చేయబడుతాయని అన్నారు.

విద్యతో పాటు విజ్ఞానవంతుల్ని గెలిపించాలి

మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి - బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

దేవరకొండ మే 23 జనంసాక్షి :
ఈనెల 27న జరుగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఉప ఎన్నికలో వరంగల్ – నల్లగొండ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి తొలి ప్రాధాన్యం ఓటు వేసి గెలిపించాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ లు కోరారు.గురువారం దేవరకొండ పట్టణములో బిఆర్ఎస్ పార్టీ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లన్నను చిత్తుగా ఓడించాలని వారు పిలుపునిచ్చారు. చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకగా నిలిచేందుకు ఉన్నత విద్యావంతుడు, సమస్యలపై పోరాడేతత్వం ఉన్న బి అర్ ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. ఇన్నేళ్ళుగా ప్రశ్నించే గొంతుక అన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న మోసగించే గొంతుకగా మారాడని ఎద్దేవా చేశారు. ఓ యూట్యూబ్ ఛానల్ ముసుగులో బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడ్డ మల్లయ్య బాగోతం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. ఇంకా ఆయన మీద ఉన్న కేసుల్లో

అత్యధికంగా మహిళలు పెట్టినవే అన్నారు. వాటిని ఏదో ఉద్యమాల కేసులైనట్టు గొప్పగా చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనకు డిపాజిట్ దక్కడం కష్టమే అన్నారు. ఇక బీజేపీ అభ్యర్థి పోటీలో ఉన్నప్పటికి ప్రజల్లో మాత్రం లేనట్టే అన్నారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే కనపడి తరువాత అడ్రస్ కూడా లేకుండా పోయి మళ్ళీ ఇప్పుడు వచ్చి ఆయనేదో చేస్తానంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. మాయమాటలు, నెరవేర్చలేని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్, బీజేపీ రెండు యువతను మోసగించిన పార్టీలే అన్నారు. ప్రస్తుతం యువతలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత మొదలయిందని ఈ ఎన్నికల్లో ఏనుగుల రాకేష్ రెడ్డికి అత్యధిక మెజార్టీ ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాధవరం సునీత జనార్దన్ రావు, రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పల్లా ప్రవీణ్ రెడ్డి,మండలాల అధ్యక్షులు టీవీఎన్ రెడ్డి, రమావత్ దస్రు నాయక్, దొంతము చంద్రశేఖర్ రెడ్డి, వేలుగురి వల్లపు రెడ్డి, లోకసని తిరుపతయ్య, రాజినేని వెంకటేశ్వర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ రైస్ దిగుమతి లక్ష్యం

త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

ఖమ్మం బ్యూరో, మే 23 (జనంసాక్షి):
సిఎంఆర్ రైస్ దిగుమతి లక్ష్యం త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టర్ నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురం లోని అరుణాచల శివ రైస్ అండ్ ఫుడ్ ఇండస్ట్రీస్ ని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. మిల్లు సామర్థ్యం, రోజుకు ఎంత మేర ధాన్యం పట్టేది, ఎంత ధాన్యం నిల్వలు ఉన్నవి, హమాలీలు ఎంత మంది వుంది అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ లో సిఎంఆర్ క్రింద 112 ఏసికే ల రైస్ ఇవ్వాలివుండగా, ఇప్పటికి 22 ఏసికే లు అందించారని అధికారులు కలెక్టర్ కి వివరించారు. జూన్ మాసాంతానికి లక్ష్యం మేర పూర్తిగా సిఎంఆర్ రైస్ అందించాలని, రోజుకు 6 ఎసికే లు అందించాలని కలెక్టర్ మిల్లు యాజమాన్యాన్ని ఆదేశించారు. సిఎంఆర్ రైస్ లక్ష్యం పూర్తయ్యే వరకు ప్రైవేటు మార్కెట్ కి ఒక్క క్వింటా ఇవ్వకూడదని ఆయన అన్నారు. సామర్థ్యం మేర పూర్తిగా మిల్లు నడిపంచాలని, సరిపోను హమాలీలు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన అన్నారు. లక్ష్యం మేరకు సిఎంఆర్ రైస్ అందించకుంటే నిబంధనల మేరకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, నేలకొండపల్లి తహసీల్దార్ గౌరీశంకర్, రైస్ మిల్ మేనేజింగ్ పాట్నర్ సంతోష్, అధికారులు తదితరులు ఉన్నారు.

పార్టీ ప్రచార రథాలను ప్రారంభించిన ఎంపీ రవిచంద్ర

ఖమ్మంటౌన్, మే 23 (జనంసాక్షి):
%రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి పార్టీ ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభించారు. శాసనమండలికి నల్లగొండ –ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.ఆయనకు ఘన విజయం చేకూర్చేందుకు గాను బీఆర్ఎస్ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసింది.ఇందులో భాగంగా గురువారం ఉదయం ఖమ్మం తెలంగాణ భవన్ ప్రాంగణంలో పార్టీ ప్రచార రథాలను (ఆటోలు) ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, పగడాల నాగరాజు తదితర ప్రముఖులు గులాబీ జెండాలు ఊపి ప్రారంభించారు.

ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ సందర్శన

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):
వరంగల్ ఖమ్మం నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ రోజు విధులు నిర్వ హించే గ్రాడ్యుయేట్ ఉద్యోగులు కోసం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఎస్.వెంకట్రావు అదనపు కలేక్టర్ సిహెచ్.ప్రియాంకతో కలిసి గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఈ నెల 22, 23వ తేదీలలో 182 మంది పోలింగ్ రోజు విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి నేడు చివరి రోజు కాబట్టి ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు కలెక్టరేట్ లోని ఓటర్ ఫేసిలిటేషన్ సెంటర్ లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ పట్టభద్రుల ఓటు హక్కుని వినియోగించు కోవచ్చని తెలిపారు.

పోలింగ్ ముగిసే సమయానికి 48 ముందు సభలు సమావేశాలు నిషేధం

నల్లగొండ బ్యూరో, మే23,(జనంసాక్షి) :
వరంగల్–ఖమ్మం–నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలో భాగంగా పోలింగ్ ముగిసే సమయానికి ఈనెల 27 సాయంత్రం4 గంటల వరకు,48 గంటల ముందు నుండి ఎలాంటి బహిరంగ సభలు,సమావేశాలు,ప్రచారాలు నిర్వహించడం నిషేదమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి,వరంగల్–ఖమ్మం–నల్గొండ శాసనమండలి పట్టభద్రులు ఉప ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ శాసనమండలి పట్టబద్రుల ఉప ఎన్నికలకు ఈనెల 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శాసనమండలి ఉపఎన్నిక సందర్భంగా పోలింగ్ ముగిసే సమయమైన 27వ తేదీ సాయంత్రం 4 గంటల ఆధారంగా చేసుకుని 48 గంటల ముందు నుండి ఎలాంటి ప్రచారం చేయవద్దని ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు.అందువల్ల ఉప ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, పార్టీలు ఈనెల 25 వ తేదీ సాయంత్రం 4 గంటల నుండి వారి ప్రచారాన్ని ముగించాలని ఆమె కోరారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంఎల్ సి ఎన్నికలకు సంబంధించి ఎలాంటి బహిరంగ సభలు,సమావేశాలు,ర్యాలీలు నిర్వహించకూడదని,ఎన్నికలకు సంబంధించిన విషయాలను టీవీలు ఇతర మాధ్యమాలలో ప్రదర్శించకూడదని, అలాగే ప్రజలకు ఎన్నికలకు సంబంధించిన విషయాలు తెలియజేయడం,ఓటర్లను ఆకర్షించడం వంటివి చేయరాదని తెలిపారు. ఒకవేళ ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ప్రచారం చేసినట్లయితే ఎన్నికల నిబంధనల ప్రకారం చట్టరీత్యా శిక్షార్హులవుతారని వెల్లడించారు.

సెన్సెక్స్, నిఫ్టీ ఆల్‌టైమ్ రికార్డ్..

సూచీల లాభాల పరుగుకు కారణాలు ఇవే..!

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు.. ఆర్‌బీఐ డివిడెండ్, ఐటీ, బ్యాంకింగ్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో ఒక్కసారిగా భారీ లాభాల్లోకి దూసుకెళ్లాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త జీవనకాల గరిష్ఠాలను నమోదుచేశాయి. సెన్సెక్స్ దాదాపు 1200 పాయింట్లు లాభపడగా.. నిఫ్టీ 22,900 ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 74,253.53 పాయింట్ల (క్రితం ముగింపు 74,221.06) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. తర్వాత లాభాల జోరు మొదలైంది. ఆద్యంతం అదే ఒరవడి కొనసాగింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 75,499.91 పాయింట్ల వద్ద సరికొత్త గరిష్ఠాలను అందుకుంది. చివరికి 1196.98 పాయింట్ల లాభంతో 75,418.04 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 369.85 పాయింట్ల లాభంతో 22,967.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో నిఫ్టీ 22,993.60 వద్ద కొత్త రికార్డును నెలకొల్పింది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఎన్‌టీపీసీ షేర్లు మినహా అన్ని షేర్లూ లాభపడ్డాయి.

కారణాలు ఇవే..

ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ అంచనాలను మించి ఆర్‌బీఐ తాజాగా కేంద్రానికి డివిడెండ్ ప్రకటించడం సూచీల పరుగుకు కారణమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రూ.2.11 లక్షల కోట్లను ఆర్‌బీఐ ప్రభుత్వానికి అందించనుంది. ఈ మొత్తం కేంద్రం తన ద్రవ్యలోటు పూడ్చుకోవడానికి ఉపయోగపడనుంది. ఆర్‌బీఐ నుంచి రూ.లక్ష కోట్లు వస్తాయని మార్కెట్ ముందుగా అంచనా వేసింది. అంతకు డబుల్ డివిడెండ్ ఆర్‌బీఐ ప్రకటించడం గమనార్హం. మౌలిక సదుపాయాల కల్పనకు ఈ మొత్తాన్ని కేంద్రం వినియోగించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమరం తుది దశకు చేరుకుంది. తొలినాళ్లలో పోలింగ్ తగ్గడం మదుపర్లలో ఆందోళన వ్యక్తమైంది. ఐదు దశల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో మరోసారి స్థిరమైన ప్రభుత్వమే ఏర్పడొచ్చన్న అంచనాలు బలపడడం మదుపరుల్లో ఉత్సాహం నింపింది. ఇదే ఆందోళనలతో విదేశీ సంస్థాగత మదుపర్లు సైతం అమ్మకాలకు దిగారు. తాజాగా దేశీయ మార్కెట్లలో కొనుగోళ్లకు దిగడం సూచీల పరుగుకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

తాజాగా హెచ్ఎస్‌బీసీ వెలువరించిన డేటా కూడా సూచీలు రాణించడానికి మరో కారణం. దేశంలో ఎగుమతులు పెరిగాయని, మే నెలలో ఉద్యోగ కల్పన 18 ఏళ్ల గరిష్ఠానికి చేరడమూ మరో పాజిటివ్ అంశమని నిపుణులు భావిస్తున్నారు.

ఎయిరిండియా ఉద్యోగులకు వేతన పెంపు..

దిల్లీ: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా తమ ఉద్యోగులకు వేతన పెంపు ప్రకటించింది. పైలట్ల పనితీరు ఆధారంగా బోనస్ కూడా చెల్లించనుంది. ప్రభుత్వం నుంచి టాటాల చేతికొచ్చాక టాటా గ్రూప్ చేపట్టిన తొలి వేతన పెంపు ఇదే. ఈమేరకు వేతన పెంపు వివరాలను ఎయిరిండియా సీహెచ్ఆర్ఓ రవీంద్రకుమార్ జీపీ వెల్లడించారు. 2024 ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు అమల్లోకి వస్తాయని తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ, వ్యక్తుల పనితీరు ఆధారంగా ఈ బోనస్ చెల్లిస్తున్నట్లు చెప్పారు. 2023 డిసెంబర్ 31 కంటే ముందు సంస్థలో చేరినవారికి ఈ పెంపు వర్తిస్తుంది. దీని ప్రకారం.. ఫస్ట్ ఆఫీసర్, కెప్టెన్ల వేతనం నెలకు రూ.5 వేలు మేర పెరగనుంది. కమాండర్ల వేతనం రూ.11 వేలు, సీనియర్ కమాండర్ వేతనం రూ.15 వేలు చొప్పున పెరగనుంది. జూనియర్ ఫస్ట్ ఆఫీసర్‌కు ఎలాంటి పెంపూ చేపట్టలేదు. అలాగే పనితీరు ఆధారంగా ఏడాదికి గరిష్ఠంగా బోనస్ కింద రూ.1.8 లక్షల వరకు చెల్లించనుంది. జూనియర్ ఫస్ట్ ఆఫీసర్‌కు రూ.42 వేలు, ఫస్ట్ ఆఫీసర్‌కు రూ.50వేలు, కెప్టెన్లకు రూ.60 వేలు, కమాండర్లకు రూ.1.32 లక్షలు, సీనియర్ కమాండర్లు రూ.1.80 లక్షల వరకు గరిష్ఠంగా బోనస్ అందుకుంటారు. ఎయిరిండియాలో ప్రస్తుతం 18 వేల మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఎయిరిండియా గ్రూప్‌లో ప్రస్తుతం నాలుగు విమానయాన సంస్థలు ఉన్నాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ (ఎయిర్ఏషియా ఇండియా)బీ ఎయిరిండియాలో విస్తారా విలీనం కానున్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను దక్కించుకున్న టాటా గ్రూప్.. కాంట్రాక్ట్‌ల పునరుద్ధరణ, పరిహారం చెల్లింపు వంటివి మాత్రమే చేపట్టింది. దాదాపు రెండేళ్ల తర్వాత వేతన పెంపు చేపట్టింది.

స్విగ్గీ- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డ్

క్యాష్‌బ్యాక్‌లో మార్పులు

క్రెడిట్ కార్డులపై ప్రయోజనాల్లో మార్పులు తీసుకురానున్నట్లు ఇప్పటికే అనేక బ్యాంకులు, కార్డు జారీ సంస్థలు ప్రకటించాయి. తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా అదే జాబితాలో చేరింది. స్విగ్గీతో కలసి అందిస్తున్న కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ప్రయోజనాల్లో మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు అందిస్తున్న క్యాష్‌బ్యాక్ ఆఫర్లను అప్‌డేట్ చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త మార్పులు జూన్ 21 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇప్పటివరకు స్విగ్గీలో చేసే కొనుగోళ్లపై వచ్చే క్యాష్‌బ్యాక్ స్విగ్గీ మనీ వాలెట్‌లో జమయ్యేది. ఇకపై ఆ సదుపాయం ఉండదు. ఆ క్యాష్‌బ్యాక్ క్రెడిట్ కార్డ్ అకౌంట్లో కనిపించనుంది. జూన్ 20 వరకు మాత్రం స్విగ్గీ మనీలోనే క్యాష్‌బ్యాక్ డిపాజిట్ అవుతాయి. కార్డ్ స్టేట్‌మెంట్ జనరేట్ అయిన 10 రోజుల తర్వాత క్యాష్‌బ్యాక్ క్రెడిట్ అయ్యేది. జూన్ 20 తర్వాత ఈ పద్ధతి మారనుంది. కార్డ్ స్టేట్‌మెంట్ ప్రతినెలా 15వ తేదీ జనరేట్ అవుతుంటే తరువాతి నెలలో ఆ క్యాష్‌బ్యాక్ కనిపిస్తుంది. ఉదాహరణకు.. జులై 15 నుంచి ఆగస్టు 14 మధ్య సంపాదించిన క్యాష్‌బ్యాక్ ఆగస్టు స్టేట్‌మెంట్‌లో కనిపిస్తుంది. అంటే ఆ మేర తగ్గించి మిగిలిన మొత్తం చెల్లించుకోవచ్చు.

ఇక ఈ కార్డు విషయానికొస్తే.. స్విగ్గీ- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ద్వారా చేసే ఆన్‌లైన్ కొనుగోళ్లపై 5 శాతం క్యాష్‌బ్యాక్, స్విగ్గీలో కొనుగోళ్లపై 10 శాతం క్యాష్‌బ్యాక్ లభిస్తుంది. ఆ కార్డుతో చేసే ఆఫ్‌లైన్ చెల్లింపులపై కూడా క్యాష్‌బ్యాక్ పొందొచ్చు. కార్డ్ యాక్టివేట్ అయిన తర్వాత 3 నెలల పాటు వెల్‌కమ్ ఆఫర్ కింద స్విగ్గీ వన్ సభ్యత్వం ఇస్తోంది. కార్డు జాయినింగ్ ఫీ, పునరుద్ధరణ రుసుము రూ.500. ఏడాదిలో రూ.2 లక్షలకు పైగా ఖర్చు చేస్తే రెన్యువల్ ఫీ ఉండదు.

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 5.55	₹ 5.52

బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్	
₹67,300 (22 క్యారెట్లు)	₹73,420 (24 క్యారెట్లు)
చెన్నై	
₹67,500 (22 క్యారెట్లు)	₹73,640 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)
హైదరాబాద్
₹ 97,000

మూడు అవయవాలు 90శాతం కోల్పోయి.. ఎవరెస్టును అధిరోహించిన తొలి వ్యక్తిగా కౌశిక్ రికార్డు సృష్టించారని గోవా వికలాంగ సంఘం పేర్కొంది. దివ్యాంగులకు ఆదర్శంగా నిలవడంతోపాటు గోవాకు ఇదెంతో గర్వకారణమని ఆ సంస్థ చీఫ్ అవెలినో డిసౌజా అభిప్రాయపడ్డారు. కౌశిక్ ఈ ఘనత సాధించడంపై గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్పందిస్తూ.. రాష్ట్రం గర్వించదగ్గ విషయమన్నారు. ఈ విజయం యువతకెంతో స్ఫూర్తిదాయకమని, ఆయనకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నానని ట్వీట్ చేశారు.

క్రెడిట్ కార్డును ఉపయోగించుకోవడానికి చిట్కాలు

క్రెడిట్ కార్డు ఒక విస్తృతంగా ఉపయోగించే ఆర్థిక సాధనంగా పనిచేస్తుంది. కార్డుదారుడికి తాత్కాలిక క్రెడిట్ లైన్ (రుణం) అందించడం వల్ల కొనుగోలు సామర్థ్యం పెరుగుతుంది.

మీకు అత్యవసర పరిస్థితిలో తక్షణం డబ్బు అవసరమైతే నగదు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. కొవిడ్ తర్వాత కాంటాక్ట్‌లెస్ చెల్లింపులకు ప్రాధాన్యతమిస్తూ.. ఆర్‌బీఐ కాంటాక్ట్‌లెస్ కార్డులపై లావాదేవీల గరిష్ఠ పరిమితిని మునుపటి రూ.2 వేల నుంచి రూ.5 వేలకు పెంచింది. ఏది ఏమైనప్పటికీ క్రెడిట్ కార్డులను సరిగ్గా ఉపయోగించుకుంటేనే ప్రయోజనముంటుంది. క్రెడిట్ కార్డు కొనుగోళ్లు, చెల్లింపుల్లో నిర్లక్ష్యం వహిస్తే కోలుకోలేని ఆర్థిక వైఫల్యాలకు దారి తీయొచ్చు. జాగ్రత్త వహించకపోతే కార్డు వినియోగం ఎక్కువై గణనీయమైన ఆర్థిక ఇబ్బందులకు దారితీయవచ్చు. మీ క్రెడిట్ కార్డును పొందడం నుంచి ఉపయోగించడం వరకు కొన్ని చిట్కాలు, జాగ్రత్తలు ఇక్కడ ఉన్నాయి.

క్రెడిట్ కార్డు ఎంపిక

కేవలం ఏజెంట్ సిఫార్సులు, స్నేహితుల నుంచి సలహాలు, ప్రీ అప్రూవ్డ్ ఆఫర్లపై ఆధారపడి క్రెడిట్ కార్డులను ఎంపిక చేసుకోకూడదు. కార్డులను ప్రమోట్ చేసేవారు అసంపూర్ణ సమాచారం అందించి అంతగా ఉపయోగం లేని క్రెడిట్ కార్డును అందిస్తారు. ఈ ఆఫర్లు వార్షిక రుసుమును మాఫీ చేయడానికి ఇతర షరతులతో రావచ్చు. కాబట్టి కార్డును తీసుకునేటప్పుడు ఫైన్ ప్రింట్‌ను పూర్తిగా చదవండి. కార్డు ఉచితం అంటే పూర్తిగా ఉచితమని ఎప్పుడూ అనుకోకండి. కార్డుపై ఏడాదికి కనీస మొత్తం ఉపయోగిస్తేనే రుసుం లేకుండా ఉంటుంది.

బడ్జెట్

ఆర్థిక నిర్వహణకు బడ్జెట్ అనేది ఒక ముఖ్యమైన సాధనం. వివిధ క్రెడిట్ కార్డు ఎంపికలు అందుబాటులో ఉన్నందున, క్రెడిట్ కార్డు పరిమితి వారి నెలవారీ ఆదాయం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. క్రెడిట్ కార్డును ఉపయోగించేటప్పుడు డబ్బు ఖర్చవుతున్నట్లు అనిపించదు. ప్రత్యేకించి రివార్డు పాయింట్స్ లేదా క్యాష్‌బ్యాక్ ప్రయోజనాలపై దృష్టి కేంద్రీకరించినప్పుడు అనుకోకుండా మీ బడ్జెట్‌ను అధిగమిస్తుంది. నగదు/డెబిట్ కార్డుల్లా కాకుండా, క్రెడిట్ కార్డులతో చేసే ఖర్చు తక్షణ ఆర్థిక ప్రభావం చూపించదు. బిల్లు తర్వాత వస్తుంది. మీ క్రెడిట్ కార్డు వినియోగాన్ని గమనించడానికి డైరీని లేదా ఖర్చుల జాబితాను నిర్వహించండి. ఏ కేటగిరీలోనైనా అధిక వ్యయం చేయకుండా, ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించండి. క్రెడిట్ కార్డు ఖర్చు మీ బడ్జెట్‌ను దాటనీయొద్దు.

బిల్లు చెల్లింపులు

క్రెడిట్ కార్డు బిల్లును గడువు తేదీకి ముందే చెల్లించాలి. అలాగే బకాయి ఉన్న దాంట్లో కనీస మొత్తాన్ని కాకుండా మొత్తం బకాయిని చెల్లించడం అలవాటు చేసుకోండి. దీనివల్ల క్రెడిట్ స్కోరు పెరగడమే కాకుండా జరిమానా రుసుముల నుంచి తప్పించుకోవచ్చు. క్రెడిట్ కార్డు బిల్లులపై చెల్లింపులను ఆలస్యం చేయడం వల్ల అనేక పరిణామాలకు దారితీయొచ్చు. క్రెడిట్ కార్డులపై వడ్డీ ఛార్జీలు బిల్లింగ్ సైకిల్ ముగిసే సమయానికి కాకుండా గడువు తేదీ తర్వాత రోజునుంచే మొదలవుతాయి. గడువు దాటితే వడ్డీ (జరిమానా) తప్పదు. క్రెడిట్ కార్డు వడ్డీ రేట్లు విపరీతంగా ఉంటాయి.. 15-36% వరకు ఉండొచ్చు. చెల్లించని బ్యాలెన్స్ కాలక్రమేణా గణనీయంగా పెద్ద రుణంగా పెరిగే అవకాశం ఉంది. ఆలస్యమయ్యేకొద్దీ వడ్డీపై వడ్డీ కూడా వసూలు చేస్తారు. ఇది మీ రుణాన్ని మరింత పేరుకుపోయేలా చేస్తుంది. బిల్లు చెల్లించేటప్పుడు కనీస చెల్లింపుల మొత్తాన్ని చెల్లించినా.. వారు పూర్తిగా బకాయి చెల్లించే వరకు ఆ మొత్తంపై వడ్డీని చెల్లించవలసి ఉంటుంది. ఇలాంటి వాటి వల్ల క్రెడిట్ స్కోరు కూడా దెబ్బ తింటుంది.

గరిష్ఠ పరిమితి వద్దు

మీరు క్రెడిట్ కార్డును ఉపయోగిస్తున్నప్పుడు మీ వద్ద డబ్బు లేకుండానే ఖర్చు చేస్తుంటారు. ఇది వినియోగదారులను అధిక వ్యయం చేసేలాగా ప్రోత్సహిస్తుంది. అందుచేత, పరిస్థితులు ఎలా ఉన్నా మీ క్రెడిట్ కార్డు వినియోగాన్ని పరిమితిలో 2/3వ వంతుకు పరిమితం చేయాలి. ఉదాహరణకు మీ క్రెడిట్ కార్డు పరిమితి నెలకు రూ.3 లక్షలు అయితే, మీరు రూ.2లక్షల కంటే ఎక్కువ ఖర్చు చేయని విధంగా దాని వినియోగాన్ని ప్లాన్ చేయండి. ఇది మెరుగైన క్రెడిట్ స్కోరును నిర్వహించడానికి మీకు సహాయం చేస్తుంది. కొన్ని బ్యాంకులు క్రెడిట్ కార్డుపై వ్యక్తిగత వ్యయ పరిమితిని సెట్ చేసుకునే సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఖర్చుపై అదుపు లేనివారికి ఇది మంచి ఎంపిక.

స్టేట్‌మెంట్ తనిఖీ

మీ క్రెడిట్ కార్డు బిల్లు వచ్చిన తర్వాత స్టేట్‌మెంట్‌ను నిశితంగా పరిశీలించండి. ఈ స్టేట్‌మెంట్‌ను సరిపోల్చడానికి, మీరు ఎప్పుడు క్రెడిట్ కార్డు ఉపయోగించినా ఆ ఖర్చు వివరాలను ప్రతినెలా ఒక బుక్‌లో రాయండి. వీటిని ఆ నెల కార్డు స్టేట్‌మెంట్‌లో వివరాలతో సరిచూసుకోండి. వస్తువులు కొనుగోలు చేసినప్పుడు చెక్-అవుట్/%ూూ% వద్ద మీరు అందుకున్న చెల్లింపు రసీదులతో బిల్ చేసిన స్టేట్‌మెంట్‌ను లెక్కించడం మంచి అలవాటు. ఏవైనా అదనపు ఛార్జీలను గుర్తించి నివారించడంలో ఇది సహాయపడుతుంది.

ఆఫర్లు, రివార్డ్స్

క్రెడిట్ కార్డు సంస్థలు ఎప్పటికప్పుడు రివార్డులు, ప్రోత్సాహకాలను అందిస్తాయి. ఇది క్యాష్‌బ్యాక్ లేదా ఉచిత వోచర్స్ రూపంలో ఉండొచ్చు. తాజా ఆఫర్ల కోసం మీ బ్యాంకును సంప్రదించండి. చాలామందికి తెలియని కొన్ని ప్రామాణిక క్రెడిట్ కార్డు ప్రయోజనాలు ఉన్నాయి. ఉదాహరణకు కార్డుదారుడు ప్రమాదంలో మరణించినా లేక అంగవైకల్యానికి గురయినా..చాలా భారతీయ క్రెడిట్ కార్డులపై కాంప్లిమెంటరీ బీమా సౌకర్యం ఉంటుంది. అంతేకాకుండా, మీకు అవసరమైన వస్తువులను కొనుగోలు చేయడానికి మీ రివార్డ్ పాయింట్లు కూడా ఉపయోగించవచ్చు.

చివరిగా: క్రెడిట్ కార్డును బాధ్యతాయుతంగా ఉపయోగించినప్పుడే ప్రయోజనకరమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ఇది రోజువారీ ఖర్చులకు ఉపయోగపడడమే కాకుండా, రివార్డు పాయింట్లు, క్యాష్‌బ్యాక్ సౌకర్యాలు, ఆఫర్లతో ఇది మీ సాధారణ డెబిట్ కార్డు కంటే మెరుగైన ప్రయోజనాలను అందిస్తుంది.

హద్దులు దాటి వధువుకు 'కిస్సు'..

కర్రలతో కొట్టుకున్న ఇరు కుటుంబాలు

లఖ్‌నవూ: వరుడి విపరీత చర్యతో కల్యాణ వేదిక రణరంగంగా మారింది. వరమాల క్రతువు పూర్తయిన తర్వాత వధువును అతడు బహిరంగంగా ముద్దు పెట్టుకోవడం వివాదానికి కారణమైంది. చివరకు ఇరువర్గాల వారు కర్రలతో దాడి చేసుకునేవరకు వెళ్లింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని హాపూర్‌లో సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ వ్యక్తి తన ఇద్దరు కుమార్తెల వివాహాలను హాపూర్‌లోని అశోక్‌నగర్‌లో ఏర్పాటుచేశాడు. ఒక కుమార్తె వివాహం ఎలాంటి ఇబ్బందీ లేకుండా పూర్తయింది. అది పూర్తయిన కొద్దిసేపటి తర్వాత మరో కుమార్తె లగ్నం జరుగుతోంది. వరమాల వేయడం పూర్తయిన తర్వాత వరుడు, వధువుకు బహిరంగంగా ముద్దు పెట్టాడు. ఇది ఆమె బంధువులకు నచ్చలేదు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

అంతలోనే వధువు బంధువులు కొందరు స్టేజీ పైకి చేరుకొని వరుడు, అతడి కుటుంబసభ్యులపైన దాడికి దిగారు. ఇరువర్గాల వారు పరస్పరం కర్రలతో దాడి చేసుకున్నారు. దీంతో కల్యాణవేదిక కాస్తా, రణరంగంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులైన ఏడుగురిని ఆస్పత్రికి తరలించారు. తమ కుమార్తె నిరాకరిస్తున్నా అందరిముందు ముద్దు పెట్టుకున్నాడని వధువు కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆమె అంగీకారంతోనే ముద్దు పెట్టానని వరుడు చెబుతున్నాడు. ఈ ఘటనపై రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, బాధితులెవరైనా ముందుకొస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని స్థానిక పోలీసు అధికారి తెలిపారు. అయితే, ప్రజాశాంతికి భంగం కలిగించినందుకుగాను ఆరుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు.

జనంసాక్షి
జాతీయం అంతర్జాతీయం

ఐఐటీల్లోనూ ఉద్యోగ సంక్షోభం..

38%మందికి దక్కని కొలువులు!

ఖరగ్‌పూర్: మన దేశంలో ఐఐటీలకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో చదివితే చాలు.. మంచి కంపెనీల్లో ఉద్యోగాలు, రూ.లక్షల్లో వేతన ప్యాకేజీల్లాంటి మాటల్నే తరచూ వింటూ ఉంటాం. కానీ, ప్రస్తుతం నిరుద్యోగం పెరగడంతో అందుకు భిన్నమైన పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. మన దేశంలోని ఐఐటీల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38శాతం మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ దక్కకపోవడం గమనార్హం. ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్‌సింగ్ సమాచార హక్కు చట్టం (%=×%) ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి.

ఈ ఏడాది మొత్తం 23 ఐఐటీ క్యాంపస్‌ల్లో దాదాపు 8వేల మంది (38శాతం) ఐఐటీయన్లకు ప్లేస్‌మెంట్స్ దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్స్ కోసం నమోదు చేసుకోగా.. కేవలం 13,400 మంది మాత్రమే ప్లేస్‌మెంట్స్ సాధించారని.. మిగతా వారు (38శాతం) ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్లు వెల్లడైంది. రెండేళ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్లు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటీల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్ కోసం నమోదు చేసుకోగా.. వారిలో 6,050 (37%) మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్త 14 ఐఐటీల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ప్లేస్‌మెంట్స్ కోసం నమోదు చేసుకోగా.. ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది కాన్పూర్ ఐఐటీ, ఖరగ్‌పుర్ ఐఐటీల్లో 33శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ దక్కలేదని ధీరజ్‌సింగ్ తన లింక్డిన్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు.

ఐటీ దిల్లీలో గత ఐదేళ్లలో 22శాతం మంది విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు దక్కకపోగా.. 2024కు వచ్చేసరికి 40శాతం మందికి అదే పరిస్థితి ఎదురైంది. 2022 నుంచి 2024 వరకు పాత తొమ్మిది ఐఐటీల్లో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 1.2 రెట్లు పెరగ్గా.. ఉద్యోగాలు సాధించనివారి సంఖ్య 2.1 రెట్లు పెరిగింది. అలాగే, నూతన ఐఐటీల్లో నమోదిత విద్యార్థుల సంఖ్య 1.3 రెట్లు పెరిగింది. కానీ ప్లేస్‌మెంట్స్ దక్కని విద్యార్థుల సంఖ్య కూడా 3.8 రెట్లు పెరిగింది. ఈ సంక్షోభం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది ఆరుగురు ఐఐటీ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా.. అనేకమంది తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
24 మే 2024
తెలంగాణ

ఎన్నికలలో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికులకు ఆన్ డ్యూటీగా పరిగణించాలి

-టీఎ, డీఎ అవకాశం కల్పించాలని డైరెక్టర్ వినతి

-బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

డైరెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న బీఎంఎస్ నాయకులు

యైటింక్లయిన్ కాలనీ మే 23 (జనంసాక్షి) :
పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించిన సింగరేణి కార్మికులకు ఆన్ డ్యూటీగా పరిగణించాలి, టీఎ, డీఎ అవకాశం కల్పించాలని యాదగిరి సత్తయ్య అధ్యక్షులు డిమాండ్ చేశారు. గురువారం రామ గుండం ఏరియాలో డైరెక్టర్ (పా) ఆపరేషన్ ఎన్‌వీకే. శ్రీనివాస్‌ని కలిసి సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ బిఎంఎస్ తరపున మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో విధులు నిర్వహించిన క్లరికల్, ఎస్అండ్ పిసి సిబ్బంది విధులను ఆన్ డ్యూటీగా పరిగణించాలని టి.ఎ, డి.ఏ అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉన్నప్పటికీ పారిశ్రామిక వివాదాల చట్టం అమలులో ఉండగా బొగ్గు పరిశ్రమలో చేస్తున్న కార్మికులకు కొన్ని రాష్ట్రాలలో పరిగణించిన తెలంగాణ రాష్ట్రం సింగరేణి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు ఆన్ డ్యూటీగా ప్రకటించక పోవడం మూలముగా సంవత్సర హాజరులలో నష్టం, దీపావళి బోనస్ లాభాల వాటా అంశా లలో కూడా ఆర్థికంగా నష్టం జరుగుతుందని దీనిని పరిగణలోకి తీసుకొని తక్షణమే ఎన్నికలలో విధులు నిర్వహిం చిన కార్మికులకు ఆన్ డ్యూటీ గా ప్రకటించి టిఏడిఏ అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకొని సర్కులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ-2 ఏరియా ఉపాధ్యక్షులు వడ్డేపల్లి కుమారస్వామి, ఎస్అండ్‌పీసీ పిట్ కార్యదర్శి పుప్పాల నాగేంద్రప్రసాద్, బండి మహిపాల్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జేసీబీతో చెట్లపొదలను శుభ్రం చేస్తున్న దృశ్యం

మిషన్ లైఫ్‌స్టైల్ ఎన్విరాన్మెంట్‌లో చెరువుల పరిశుభ్రత

యైటింక్లయిన్ కాలనీ మే 23 (జనంసాక్షి):
పర్యావరణం, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖా జాతీయ స్థాయి సమన్వయం, మిషన్ లైఫ్ అమలు కోసం నోడల్ మంత్రిత్వ శాఖ, తెలంగాణా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అనుసంధానంతో మిషన్ లైఫ్ ఎన్విరాన్మెంట్ కార్యక్రమాలలో భాగంగా గురువారం ఆర్జీ-2 ఏరియా అల్లూరు చెరువు కట్ట పైన పెరిగిన పిచ్చి మొక్కలు జెసిబి సహాయంతో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఓటుజిఎం ఎన్.వెంకటేశ్వర్ రావు మాట్లాడుతూ వచ్చే నెల నిర్వహించు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించు కొని నిర్వహించు కార్యక్రమాలలో భాగంగా నీటి కాలుష్యం కాకుండా నివారించడానికి చెరువులలో ఉన్న చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫిషియెటింగ్ డిజిఎం (పర్సనెల్) ఎస్.అనిల్ కుమార్, ఏరియా సర్వే అధికారి బుక్య దేశాయి, పర్యావరణ అధికారి కొత్తుర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లి,మే 23(జనంసాక్షి) :
పెద్దపల్లి జిల్లాలో శుక్రవారం అనగా 24వ తేదీ నుండి జరగబోయే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలో మొత్తం 16 సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు, రామగుండం పరిధిలో 4, పెద్దపల్లి పరిధిలో 4, మంథని పరిధిలో 2, సుల్తానాబాద్ పరిధిలో 2, శ్రీరాంపూర్, ధర్మారం, జూలపల్లి, ముత్తారం పరిధిలో ఒక్కొక్క పరీక్షా కేంద్రం చొప్పున ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం విద్యార్థులు సుమారు 3196, ద్వితీయ సంవత్సర విద్యార్థులు 2314 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు, రెండవ సంవత్సర విద్యార్థులకు సాయంత్రం 2-30 నుండి 5-30 వరకు పరీక్షలు ఉంటాయని, ప్రతి పరీక్షా కేంద్రానికి నియమించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరా, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ సౌకర్యం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయండి..

ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు డబ్బుల చెల్లింపు..

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి..

గంగాధరలో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన..

కరీంనగర్ బ్యూరో, మే 23 (జనంసాక్షి) :
వరి ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మిగిలిపోయిన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని సూచించారు. గురువారం కరీంనగర్ జిల్లా గంగాధర, లక్ష్మీదేవిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా ఏమైనా వచ్చే ఛాన్స్ ఉందా? డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారా? అని జిల్లా కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకుని అధికారులతోనూ మాట్లాడారు. తేమశాతాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు చేసి త్వరగా మిల్లులకు పంపించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 31వ తేదీలోగా అన్ని కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు అధికారులు నడుచుకోవాలని తెలిపారు. ఐకెపి కేంద్రాల్లో కొను గోళ్లను మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఎక్కడైనా మందకొడిగా కొనుగోళ్లు సాగుతుంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ధాన్యం అమ్మిన రైతులకు ఎప్పటికప్పుడు ఇబ్బందులు లేకుండా డబ్బులు చెల్లిస్తున్నామని జిల్లాలో రైతులు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూస్తున్నామని తెలిపారు. అధికారులు పకడ్బందీగా వ్యవహరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రజనీకాంత్, ఇన్చార్జి డీసీఎస్ఓ సురేష్ రెడ్డి, తహసిల్దార్ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా గ్రూప్ I ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు

- **జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
- **పెద్దపల్లి జిల్లాలో 6098 మంది అభ్యర్థులకు 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు**
- **బయోమెట్రిక్ హాజరు దృష్ట్యా ఉదయం 9-00 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి**
- **ఉదయం 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలో అనుమతి ఉండదు**
- **గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి, మే 23 (జనంసాక్షి) :
జూన్ 9న నిర్వహించు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి జూన్ 9న ఉదయం 10-30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించు గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాట్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పరీక్ష నిర్వహణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను ముందుగానే అంచనా వేసి వాటిని పరిష్కరించాలని, జిల్లాలో జూన్ 9న జరుగనున్న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష పకడ్బందీ నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు.పెద్దపల్లి జిల్లాలో గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న 6098 మంది అభ్యర్థుల కోసం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని,పరీక్షా కేంద్రాలలో సంబంధిత అభ్యర్థులకు సరిపడ అవసరమైన మేర వసతులు కల్పించాలని, ఫర్నిచర్, టాయిలెట్స్, త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చూడాలని తెలిపారు.పరీక్షా కేంద్రం ప్రాంగణంలోకి సెల్ ఫోన్ అనుమతి ఉండదని, అభ్యర్థులు ఎవరు సెల్ ఫోన్ తీసుకుని రావడానికి వీలులేదని, ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందికి సైతం సెల్ ఫోన్ అనుమతి ఉండదని, ప్రతి పరీక్షా కేంద్రం ప్రాంగణంలో సెల్ ఫోన్ డిపాజిట్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసి, పరీక్ష నిర్వహణ సిబ్బంది, అభ్యర్థుల ఫోన్ లు భద్రపరచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు ఒక రోజు ముందుగా వెళ్లి పరీక్షా కేంద్రాన్ని ధృవీకరించు కోవాలని, బయోమెట్రిక్ హాజరు నమోదు దృష్ట్యా 9 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, ఎట్టి పరిస్థతుల్లో 10 గంటల తర్వాత పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని, అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డు తో పాటు గుర్తింపు కార్డు, బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్ తీసుకొని రావాలని తెలిపారు.ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పరీక్ష నిర్వహణకు సంబంధించి ప్రశ్నపత్రాల తరలింపు పోలీసుల పర్యవేక్షణలో జరగాలని, ప్రతి అంశం సీసీ కెమెరాలో రికార్డు అయ్యే విధంగా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ లు హనుమా నాయక్, బి.గంగయ్య, ఏ.సి.పి. క్రిష్ణ, డి.ఈ.ఓ. డి.మాధవి, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, సి సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, చీఫ్ సూపరింటెండెంట్ లు, మునిసిపల్ కమిషనర్ లు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి

- **అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్**
- **కాట్నపల్లి ధనలక్ష్మి రైస్ మిల్లులో ధాన్యం దిగుమతి, గోదాం లను పరిశీలించిన అదనపు కలెక్టర్**

సుల్తానాబాద్,మే 23(జనంసాక్షి) :
జిల్లాలో ధాన్యం కొనుగోలు, తరలింపు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలోని ధనలక్ష్మి రైస్ మిల్లులో ధాన్యం దిగుమతి, గోదాం లను అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూరైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు.కాట్నపల్లి గ్రామంలోని ధనలక్ష్మి రైస్ మిల్లులో ధాన్యం దిగుమతి ప్రక్రియ, గోదాములను పరిశీలించి, ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి వెంట వెంటనే పూర్తి చేసుకోవాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోత విధించడానికి వీల్లేదని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలోపౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, రైస్ మిల్లర్లు,రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం మే 23(జనంసాక్షి):
గురువారం రోజు సుజాతనగర్ లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రియాంక అల తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో గల ధాన్యాన్ని పరిశీలించి తేమ శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించి, తదుపరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చినటువంటి ధాన్యం యొక్క నిర్ణీత తేమశాతం (17%) వచ్చేవరకు ఆరబెట్టుకోవాలని రైతులకు సూచనలను ఇచ్చారు. కొనుగోలు కేంద్రంలో గల ధాన్యాన్ని అకాల వర్షాలకి తడవకుండా టార్పాలులతో కప్పి ఉంచాలని మరియు కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో సంబంధిత మిల్లులకు తరలించాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు పడే అవకాశం అధికంగా ఉన్నందువలన ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లుకు సరఫరా చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డి ఆర్ డి ఓ విద్యాచందన, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల కార్పొరేషన్ త్రినాథ్ బాబు , జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి , జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మరియు జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జీఎంకు వినతి

జీఎంకు వినతి పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

యైటింక్లయిన్ కాలనీ మే 23 (జనంసాక్షి) :
సింగరేణి ఆర్జీ-2 డివిజన్‌లో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్ ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం జీఎం చాంబర్‌లో ఆయన కలిసి కార్మిక సమస్యలను విన్నవించి వినతి పత్రాన్ని అందజేసి మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. సంస్థ పని చేస్తున్న ప్రతి కార్మికునికి కనీసం వేతనం 21 వేయి నుండి 46వేల వరకు ఉండాలని కోరారు. కానీ వీరికి వివిధ కంపెనీలలో 12వేల నుండి 21 వేల లోపు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. సింగరేణి బొగ్గు గనుల్లో కాంట్రాక్టు కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకుండా గుత్తేదారులు శ్రమ దోపిడికి గురి చేస్తున్నారని అన్నారు. యాజమాన్యం గుత్తేదారులకు కాంట్రాక్టు పనులను అప్పగించేటప్పుడు జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలని లేనిచో చర్యలు తప్పవని ఒప్పందం చేసుకోవాలన్నారు. దీనిపై సంస్థ సీఅండ్ఎండీతో మాట్లాడి కార్మికుల జీతభత్యాలపై దృష్టి సారించాలన్నారు. సింగరేణి ఓబీ కంపెనీ కాంట్రాక్టర్లపై సింగరేణి యాజమాన్యం పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ కాంట్రాక్టు కార్మికులపై యాజమాన్యం వెంటనే స్పందించి కార్మిక సమస్యలను పరిష్కరించాలని సూచించడం జరిగిందన్నారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో కార్మికులు కమటం సందీప్, బూడిద మహేందర్, భూర్ల శ్రీనివాస్, సారయ్య, నారాయణ, తోట భూమయ్య, బీ. శ్రీకాంత్, బండి శంకర్, ఎండి పాషా తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

కార్పోరేట్ జీఎం రవికుమార్

అధికారులతో మాట్లాడుతున్న కార్పోరేట్ జీఎం

యైటింక్లయిన్ కాలనీ మే 23 (జనంసాక్షి) :
రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించేలా కృషి చేయాలని కార్పోరేట్ జీఎం (సీపీపీ) రవికుమార్ ఓసీపీ-3 ఉద్యోగులకు, అధికారులను కోరారు. గురువారం ఆయన ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శించి డిపార్టుమెంటు, ఆఫ్ లోడింగ్ చేసే విధానాన్ని, ఉత్పత్తి వివరాలను ప్రాజెక్టు కార్యాలయంలో అధికారులతో కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టుకు సంబంధించిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదకతను, ఓబీ తొలగింపుపై పలు సూచనలు చేశారు. ప్రాజెక్టులో పని చేస్తున్న ప్రతి కార్మికుడు రక్షణ సూత్రాలను తూచ తప్పకుండా పాటించేలా చూడాలన్నారు. ఆయన వెంట ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ఓసీసీ-3 పీఓ సుంకరి మధుసూధన్, సీనియర్ సర్వే అధికారి దీటీ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే విజయ్ రమణ రావు

సుల్తానాబాద్,మే 23(జనంసాక్షి) :
రాష్ట్ర రోడ్డు భవనాలు సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మినిస్టర్ క్వార్టర్స్ లో మర్యాదపూర్వకంగాకలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్తారని విజయ రమణారావు ఆశా భావాన్ని వ్యక్తం చేశారు.

బీసీ రిజర్వేషన్లు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

బీసీల సమగ్రాభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం..

గీకురు రవీందర్, జెడ్పి ఫ్లోర్ లీడర్ , బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు..

కరీంనగర్ బ్యూరో, మే 23 (జనంసాక్షి) :
జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యములో కరీంనగర్ ప్రెస్ క్లబ్ లో గురువారం రోజు పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ పాత్రికేయ సమావేశములో కుల గణన చేపట్టిన అనంతరమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు ముక్త కంఠముతో ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జిల్లా జెడ్పి ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో బీసీ కుల గణన చేపడతామని మేనిఫెస్టోలో పొందుపరచడం ఆహ్వానించదగినదన్నారు. దానికి అనుగుణంగానే బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల యావత్తు బీసీ కులాలు హర్షం వెలిబుచ్చా యన్నారు. కాంగ్రెస్ పార్టీ పాంచ్ న్యాయ్ హామీలలో ఒకటి సామాజిక న్యాయమని ప్రతి వ్యక్తి, ప్రతి వర్గం యొక్క సామాజిక, ఆర్థిక సమానత్వం కుల గణన తో సాధ్యం అనే అంశాన్ని కూడా ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. రాజ్యాంగ సవరణ ద్వారా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు 50% పరిమితిని తొలగించి పూర్తి హక్కుల కల్పనను అమలు చేస్తామని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మొన్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి బీసీ కులాలు ఘననీయంగా కృషి చేశాయని అభిప్రాయ పడ్డారు. గతములో బిఆర్ఎస్ ప్రభుత్వం 33 శాతమున్న బీసి రిజర్వేషన్లు 23 శాతానికి తగ్గించి బీసీలకు తీరని ద్రోహం చేసిందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కుల గణన చేపట్టిన అనంతరం దామాషా పద్ధతిలో బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అలా కానీ పక్షములో బీసీల జనాభా దామాషా పద్ధతిలో కనీసం 42% రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాష్ట్రములో బీసీలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థిక ఎదుగుదల స్థానిక సంస్థల రిజర్వేషన్లతోనే సాధ్యమనే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగిణలోకి తీసుకోవాలన్న ఆశా భావం వ్యక్తం చేశారు.

ఈ నెల 30న, బీసీల రిజర్వేషన్ల పై సెమినార్ నిర్వహణ

స్థానిక సంస్థలల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు పై కరీంనగర్ జిల్లా కేంద్రములో ఈ నెల 30న, పెద్ద ఎత్తున సెమినార్ నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరావుతారన్నారు. ఈ పత్రికా సమావేశంలో రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి కోడూరి పర్శరాం గౌడ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్ ,జిల్లా అధ్యక్షులు , జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర కార్యదర్శి, విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు , తదితరులు పాల్గొన్నారు.

పడి లేచిన కెరటం.. దినేశ్ కార్తీక్

బెస్ట్ ఫ్రెండ్ దారుణ మోసం!

భరించలేక ఆత్మహత్యాయత్నం

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) వెటరన్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఐపీఎల్‌కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో బుధవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌తో రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. ఈ సీజన్ ముందే తన నిర్ణయాన్ని వెల్లడించిన దినేశ్ కార్తీక్.. ఐపీఎల్‌లో ఆర్‌సీబీతో పాటు కేకేఆర్, ముంబై ఇండియన్స్, గుజరాత్ లయన్స్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

మొత్తం 257 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన దినేశ్ కార్తీక్ 26.32 సగటు, 135 స్ట్రైక్‌రేటుతో 4,842 పరుగులు చేశాడు. ఇందులో 22 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆర్‌సీబీ తరపున 162 స్ట్రైక్‌రేటుతో 937 పరుగులు చేశాడు. ఫినిషర్‌గా సత్తా చాటిన డీకే 82 ఫోర్లు, 53 సిక్సర్లు సాధించాడు.

డీకే జీవితం స్ఫూర్తి దాయకం..

ఇక దినేశ్ కార్తీక్ జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తి దాయకం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దినేశ్ కార్తీక్ రీఎంట్రీ ఇచ్చినట్లు ప్రపంచంలో మరే క్రికెటర్ కూడా కమ్ బ్యాక్ ఇవ్వలేదు. ధోనీ రాకతో టీమిండియా అవకాశాలు సన్నగిల్లగా.. వ్యక్తిగత జీవితంలో కట్టుకున్న భార్య, ప్రాణ స్నేహితుడు దారుణంగా మోసం చేశారు. దాంతో అతను పిచ్చోడిలా మారిపోయాడు. అయితే దీపిక్ పల్లికల్ అందించిన ప్రేమ అతన్న బౌన్స్ బ్యాక్ అయ్యేలా చేసింది. దినేశ్ కార్తీక్ టీమిండియా సెకండ్ వికెట్ కీపర్‌గా తమిళనాడు కెప్టెన్‌గా అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న టైమ్‌లో అతని టీమ్‌మేట్ మురళీ విజయ్.. కార్తీక్ మొదటి భార్యతో ఎఫైర్ పెట్టుకున్నాడు.

ప్రాణ స్నేహితుడి మోసం..

ఈ విషయం కార్తీక్‌కు తప్పా తమిళనాడు టీమ్ మొత్తానికి తెలుసు. ఒకరోజు అతని మొదటి భార్య ఈ విషయాన్ని కార్తీక్‌కు తెలియజేసింది. మురళీ విజయ్ కారణంగా గర్భం దాల్చినట్లు చెప్పి విడాకులు ఇవ్వాలని కోరింది. విడాకులు తీసుకున్న ఆమె మురళీ విజయ్‌తో సహజీవనం మొదలుపెట్టింది. ఆ టైమ్‌లో విజయ్.. సీఎస్‌కే, టీమిండియా ఓపెనర్‌గా రాణిస్తున్నాడు. ఈ ఊహించని పరిణామంతో దినేశ్ కార్తీక్ డిప్రెషన్‌కు లోనయ్యాడు. అతని ప్రదర్శన కూడా దెబ్బతిన్నది. టీమిండియాలో చోటుతో పాటు తమిళనాడు కెప్టెన్సీ బాధ్యతలను కోల్పోయాడు. ఐపీఎల్‌లోనూ దారుణంగా విఫలమయ్యాడు. ఈ బాధలను భరించలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. జిమ్‌కు వెళ్లడం మానేసాడు.

పల్లికల్ పరిచయంతో..

ఈ విషయం తెలుసుకున్న దినేశ్ కార్తీక్ ట్రైనర్.. అతని ఇంటికెళ్లి వ్యక్తిగతంగా కలిసాడు. జీవితం పై ఆశలు పెంచి మళ్లీ ట్రైనింగ్ మొదలుపెట్టేలా చేసాడు. ట్రైనర్ సూచనలతో మళ్లీ జిమ్ చేయడం మొదలుపెట్టిన దినేశ్ కార్తీక్‌కు అక్కడే ట్రైనింగ్ తీసుకుంటున్న భారత స్క్వాష్ ప్లేయర్ దీపికా పల్లికల్ పరిచయమైంది. దినేశ్ కార్తీక్ కథను తెలుసుకొని పల్లికల్ చలించిపోయింది. ట్రైనర్‌తో కలిసి అతనికి కౌన్సిలింగ్ ఇవ్వడం మొదలు పెట్టింది. పల్లికల్ పరిచయం కార్తీక్ జీవితానికి ఊపిరి అయింది. దినేశ్ కార్తీక్‌ను దీపికా ఎంకరేజ్ చేయడంతో నెట్స్‌లో తీవ్రంగా శ్రమించిన అతను.. డొమెస్టిక్ మ్యాచ్‌ల్లో సత్తా చాటాడు. భారత జట్టుకు ఎంపికవ్వడంతో పాటు కేకేఆర్ కెప్టెన్సీ అందుకున్నాడు.

దీపికా పల్లికల్‌ను పెళ్లి చేసుకున్న కొన్నాళ్లకు టీమిండియాలో అతని స్థానాన్ని రిషభ్ పంత్ భర్తీ చేసాడు. మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. 34 ఏళ్ల వయసులో అతని కెరీర్ చివరి దశకు చేరిందని భావించిన కార్తీక్.. కేకేఆర్ కెప్టెన్సీ వదిలేసాడు. రిటైర్మెంట్ ప్రకటించి కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడాలనుకున్నాడు. కానీ పల్లికల్ అప్పటికే గర్భవతి. మధ్యలో కామెంటేటర్‌గా అవతారమెత్తాడు. ఈ జంటకు కవల పిల్లలు జన్మించారు.

దినేశ్ కార్తీక్‌కు సీఎస్‌కే సీఈవో కాశీ విశ్వనాథ్ నుంచి కాల్ వచ్చింది. ధోనీ వారసుడిగా తీసుకోవాలను కుంటున్నామని ఆయన కార్తీక్‌కు తెలిపాడు. అయితే వేలంలో అనూహ్యంగా చెన్నైతో పోటీపడ్డ ఆర్‌సీబీ కార్తీక్‌ను సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2022 సీజన్‌లో కార్తీక్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఫినిషర్‌గా కార్తీక్ 2.0ను తలపించాడు. ఈ ప్రదర్శనతో టీమిండియాలోకి రీఎంట్రీ ఇచ్చిన టీ20 ప్రపంచకప్ 2022 ఆడాడు. గత సీజన్‌లో కార్తీక్ విఫలమైనా ఈ సీజన్‌లో సత్తా చాటాడు.

కవల పిల్లలతో..

ఐపీఎల్ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన దినేశ్ కార్తీక్

అహ్మదాబాద్: రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు బ్యాటర్ దినేశ్ కార్తీక్.. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు గుడ్‌బై చెప్పేశాడు. బుధవారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్ అతనికి చివరిది. ఇదే తన చివరి ఐపీఎల్ అని చెప్పిన కార్తీక్‌కు .. నిన్న మ్యాచ్ ముగిసిన తర్వాత తోటి ఆటగాళ్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. నిజానికి రిటైర్మెంట్ అంశాన్ని దినేశ్ కార్తీక్ సూటిగా చెప్పకపోయినా.. లీగ్‌ను ప్రసారం చేస్తున్న సంస్థ మాత్రం అతని రిటైర్మెంట్‌పై సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. దినేశ్ 16 ఏళ్ళ క్రితం టీ20 లీగ్‌లో ఎంట్రీ ఇచ్చారు. ఈ ఫార్మాట్‌లో అత్యుద్భుత ఫినిషర్‌గా దినేశ్ కార్తీక్‌కు గుర్తింపు ఉన్నది.

ఐపీఎల్ డిజిటల్ బ్రాడ్‌కాస్టర్.. జియో సినిమా తన సోషల్ మీడియా పోస్టులో ఆర్సీబీ వికెట్ కీపర్‌కు నివాళి అర్పించింది. చేతి గ్లౌజ్‌లను తీసి .. ఆర్సీబీ క్రికెటర్లు, అభిమానుల వైపు కార్తీక్ చూపించాడు. స్టేడియం చుట్టూ తిరుగుతూ ప్రేక్షకులకు అభివాదం చేశాడు. భావోద్వేగానికి లోనవుతున్న కార్తీక్‌ను.. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ హత్తుకున్నాడు. డ్రెస్సింగ్ రూమ్ వద్ద .. కార్తీక్‌కు ఆర్సీబీ క్రికెటర్లు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. కార్తీక్ తన ఐపీఎల్ కెరీర్‌లో 257 మ్యాచ్‌లు ఆడి 4842 రన్స్ చేశాడు. దీంట్లో 22 ఫిఫ్టీలు ఉన్నాయి. 17 ఏళ్ల ఐపీఎల్ కెరీర్‌లో అతను ఆరు ఫ్రాంచైజీల తరపున ప్రాతినిధ్యం వహించాడు. 2008 తొలి ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరపున అతను అరంగేట్రం చేశాడు. 2011లో పంజాబ్‌కు వెళ్లాడు. ఆ తర్వాత ముంబై ఇండియన్స్, గుజరాత్ లయన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఆర్సీబీ తరపున ఆడాడు. ఈ ఏడాది సీజన్‌లో 15 మ్యాచుల్లో అతను 326 రన్స్ చేశాడు. 36.22 సగటుతో అతను బ్యాటింగ్ చేశాడు. స్ట్రయిక్ రేటు 187.36గా ఉన్నది.

ఒక టికెట్... 20 వేల డాలర్లు

- ఇండోపాక్ క్రికెట్ మ్యాచ్‌కు భారీగా వసూళ్ళు
- అమెరికా క్రికెట్ నిర్వాహకులపై మడ్డిపడ్డ లలిత్‌మోడీ

న్యూఢిల్లీ: ఇండియా, పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అంటేనే హైవోల్టేజ్ గేమ్. ఇక ఆ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు క్రికెట్ అభిమానులు ఎగబడుతుంటారు. నిజానికి ఈ రెండు దేశాల మధ్య ప్రస్తుతం ద్వైపాక్షిక సిరీస్‌లు లేవు. కానీ అప్పుడ ప్పుడు ఈ రెండు జట్లూ..ఐసీసీ టోర్నీల్లో తలపడుతుంటారు. అయితే వచ్చే నెలలో అమెరికాలో జరగనున్న టీ 20 వరల్డ్‌కప్‌లో దాయది సమరం జరగనున్నది. జూన్ 9వ తేదీన జరగనున్న ఈ మ్యాచ్‌కు ఫుల్ క్రేజీ ఉంది. ఇక ఆ మ్యాచ్ టికెట్లను భారీ ధరకు అమ్మేస్తున్నారు. ఒక్కొక్క టికెట్‌ను 20 వేల డాలర్లు అంటే సుమారు 17 లక్షలకు ఒక టికెట్‌ను అమ్ముతున్నట్లు తెలుస్తోంది. అధిక ధరలకు టికెట్లను అమ్మడాన్ని ఖండిస్తూ ఐపీఎల్ మాజీ చైర్మెన్ లలిత్ మోదీ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ పోస్టు చేశారు. న్యూయార్క్‌లోని నాసౌ కౌంటీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో జరగనున్న మ్యాచ్‌కు భారీ ధరకు టికెట్లు అమ్ముతున్నారని, క్రికెట్ ఆటను ప్రోత్సహిస్తున్నారా లేక ఆ క్రీడను అడ్డుకుంటున్నారా అని లలిత్ మోదీ ప్రశ్నించారు. డైమండ్ క్లబ్‌కు చెందిన టికెట్లను 20 వేల డాలర్లకు అమ్మడం షాక్‌కు గురిచేస్తోందన్నారు. క్రికెట్‌ను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో అమెరికాలో వరల్డ్‌కప్‌ను నిర్వహిస్తున్నారని, కానీ లాభాలు ఆర్జించేందుకు కాదు అని లలిత్ మోదీ తెలిపారు. అనేక వెబ్‌సైట్లు క్రికెట్ మ్యాచ్‌లకు చెందిన టికెట్లను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై ఇప్పటి వరకు ఐసీసీ అధికారికంగా స్పందించలేదు.

హార్దిక్, నటాషాల మధ్య విభేదాలు!

హార్దిక్ పాండ్యా సారథ్యంలో ముంబై ఇండియన్స్ దారుణ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. ఇక హార్దిక్ పాండ్యా క్రికెట్ కెరీర్‌లో ఇది చెత్త కాలమని కూడా చెప్పవచ్చు. ముంబై ఇండియన్స్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి హార్దిక్ పాండ్యా ఏదో ఒక కారణంతో వార్తల్లో నిలుస్తున్నాడు. ఐపీఎల్‌లో అతను మంచి ప్రదర్శన చేస్తాడని అంతా అనుకున్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదు. ఐదుసార్లు టైటిల్ నెగ్గిన ముంబై ఇండియన్స్ జట్టు లీగ్ రౌండ్ లోనే ముగించాల్సి వచ్చింది. ఇప్పుడు టీ20 ప్రపంచకప్‌లో హార్దిక్ పాండ్యాకు వైస్ కెప్టెన్సీ దక్కింది. అతని నుంచి మంచి ఇన్నింగ్స్‌ను ఆశిస్తున్నాను. ఇవన్నీ ఇలా ఉండగా ఇప్పుడు హార్దిక్ పాండ్యా వ్యక్తిగత జీవితంలోను సమస్యలు తలెత్తినట్లు తెలుస్తోంది. భార్య నటాషా స్టాంకోవిచ్‌తో హార్దిక్ కు విభేదాలు తలెత్తాయని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. వీరిద్దరూ విడిపోయారని నెట్టింట ఊహాగానాలు వినిపిస్తున్నాయి. క్రికెట్‌లో ఎక్కువగా మాట్లాడుకునే జంట హార్దిక్-నటాషా. ఈ జంట ప్రతి క్షణాన్ని సోషల్ మీడియాలో అప్‌డేట్ చేసుకోవడం అభిమానులు చూశారు. ఇద్దరూ 2020లో పెళ్లి చేసుకున్నారు. పిల్లలు కూడా ఉన్నారు. అయితే ఉన్నట్లుండి వీరి రిలేషన్ షిప్ పై ఒక్కసారిగా రూమర్స్ వస్తున్నాయి. ఐపీఎల్ 2024 సీజన్ మొత్తంలో నటాషా మైదానంలో కనిపించలేదు. హార్దిక్ పాండ్యాకు ముంబై ఇండియన్స్ కెప్టెన్సీ ఉన్నప్పటికీ, నటాషా మైదానంలో కనిపించలేదు. హార్దిక్ పాండ్యా బ్యాడ్ టైమ్‌లో ఉన్నప్పుడు, అతనికి సపోర్టు ఇవ్వడానికి నటాషా ఎందుకు మైదానంలోకి రావడం లేదనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి. ఇక మార్చి 4 నటాషా పుట్టినరోజు. అప్పుడు హార్దిక్ పాండ్యా సోషల్ మీడియాలోనూ తన భార్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పలేదు. దీంతో ఈ బ్రేకప్ రూమర్స్ కు మరింత బలం చేకూరింది. మరోవైపు, నటాషా తన ఇన్‌స్టాగ్రామ్ బయో నుండి పాండ్యా అనే ఇంటిపేరును తొలగించింది. అలాగే గత కొన్ని రోజులుగా హార్దిక్‌తో ఉన్న ఫోటోలను అసలు షేర్ చేసుకోవడం లేదు. . దీంతో బ్రేకప్ రూమర్లు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. అయితే దీనిపై ఇద్దరూ అధికారికంగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సత్తా చాటడం కీలకం

ఐపీఎల్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగే క్వాలిఫయర్-2లో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టే ఆదివారం కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్)తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. దాంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఓవైపు కేకేఆర్‌తో క్వాలిఫయర్-1లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలవ్వగా.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఆర్‌సీబీని ఓడించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. అంతేకాకుండా స్పిన్‌కు అనుకూలంగా ఉండే చెపాక్ మైదానానికి తగ్గట్లుగా రాజస్థాన్ రాయల్స్‌లో అద్భుత స్పిన్నర్లు ఉన్నారు. లోకల్ భాయ్ అశ్విన్‌తో పాటు యుజ్వేంద్ర చాహల్‌ను ఎదుర్కోవడం సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు బిగ్ ఛాలెంజ్. ఈ మ్యాచ్‌లో విజయం సాధించాలంటే సన్‌రైజర్స్ హైదరాబాద్ స్థాయికి మించిన ప్రదర్శన చేయాలి. ముఖ్యంగా ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సత్తా చాటడం కీలకం. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ఈ ఇద్దరే కీలక పాత్ర పోషించారు. విధ్వంసకర బ్యాటింగ్‌తో రికార్డ్ విజయాలు అందించారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ట్రావిస్ హెడ్(533, అభిషేక్ శర్మలే(470) టాప్ స్కోరర్లుగా కొనసాగుతున్నారు. చాహల్, బౌల్ట్, అశ్విన్ వంటి ప్రమాదకర బౌలర్లను ఎదుర్కొని భారీ స్కోర్ చేయాలంటే ఈ ఓపెనింగ్ జోడీ రాణించాల్సిందే. ఈ ఇద్దరితో పాటు హెన్రీచ్ క్లాసెన్(413) సత్తా చాటితే సన్‌రైజర్స్‌కు తిరుగు ఉండదు. రాహుల్ త్రిపాఠి, నితీష్ కుమార్ రెడ్డిలు తమ జోరును కొనసాగించాల్సి ఉంది.

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా గురువారం హైదరాబాదులోని మంత్రి నివాసంలో మేడ్చల్ జిల్లాలోని శ్రీ చీర్యాల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం నుండి ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి మంత్రికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్రపటంతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు.

– కీసర, (జనంసాక్షి)

మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారం

- వీడియో తీసి పైశాచికానందం
- సోషల్ మీడియాలో ప్రత్యక్షం
- కామాంధుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హైదరాబాద్,మే23(ఆర్ఎన్ఎ):

కామంతో కళ్ళు మూసుకుపోయిన ఓ అధికారి బరితెగించాడు.. ఒళ్ళు మరిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పైగా వీడియో రికార్డు చేసి, వేధింపులకు పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన బల్దియా పరిధిలోని గాజులరామారంలో వెలుగు చూసింది. సర్కిల్‌లో మున్సిపల్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిషన్.. తన కింద పని చేసే ఓ పారిశుద్ధ్య కార్మికురాలి పై కన్నేశాడు. తాను చెప్పినట్లు వినాలని ఆమెను బెదిరించాడు. అంతేకాదు విధి నిర్వహణలో ఇబ్బందులు పెట్టాడు. అధికారి వేధింపులు భరించలేక నరకయాతన అనుభవిస్తున్న కార్మికురాలు అతని చెరలో పడక తప్పలేదు. రోజు పనికి వచ్చిన ఆమెను ఓ గదిలోకి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. అంతటితో ఆగకుండా ఈ తతంగమంతా తన ఫోన్‌లో రికార్డు చేసి.. అవి మళ్లీ మళ్లీ చూస్తూ నేత్రానందం పొందాడు. ఈ క్రమంలో కిషన్ లైంగిక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తోటి కార్మికుల ఫోన్‌లో కూడా వీడియోలు ప్రత్యక్షమయ్యాయి.

అవన్నీ చూసిన కార్మికులు ఏంటని ప్రశ్నించారు. దీంతో ఎవరికీ చెప్పొద్దంటూ ఒక్కొక్క కార్మికుడికి 10వేల చొప్పున దాదాపు 14 మందికి డబ్బులు ఇచ్చి కామాంధుడు కిషన్ వారి నోరు మూయించాడు. కూకట్‌పల్లి మహిళ ఐఏఎస్ అధికారిణి జోనల్ కమిష నర్ ఉన్న చోట ఈ దారుణం వెలుగు చూసింది. ఆమె పరిధిలో పని చేస్తున్న ఓ మహిళా పారిశుద్ధ్య కార్మికురాలిపై ఇంత దారుణం జరుగుతున్న ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం విడ్డురంగా ఉందని మహిళా కార్మికులు అంటున్నారు.

పర్యావరణ హితులను అభినందించిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

ఎల్బీనగర్, మే 23 (జనం సాక్షి) :

ఈపిటిఆర్ఐ(ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్) సీనియర్ అసోసియేట్ ఎం ప్రవీణ్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఎ వాణీ ప్రసాద్, ఐ.ఏ.ఎస్, ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్, సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈ.ఎఫ్.ఎస్.టి), తెలంగాణ ప్రభుత్వం, డైరెక్టర్ జనరల్, ఈ.పి.టి.ఆర్.ఐ. అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈపిటిఆర్ఐ అండ్ జలమండలి స్టాల్‌ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనుగడ కోసం సహజ వనరులను సంరక్షించుటకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈపిటిఆర్ఐ తరపున డాక్టర్ రాజేశ్వర్ క్లైమేట్ చేంజ్ కోఆర్డినేటర్, సీనియర్ అసోసియేట్ ఎం ప్రవీణ్ జలమండలి తరపున విశ్రాంత సహాయ సంచాలకులు ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, పర్యావరణ మిత్ర, వనమాలి, సేవారత్న, డాక్టర్ టి సురేందర్ స్టాల్‌లో పర్యావరణ పరిరక్షణ, జల సంరక్షణ కోసం తాము అవగాహన కల్పిస్తున్న పద్ధతులను గురించి వారు వివరించారు. ప్రవీణ్ సురేందర్‌కు అభినందనలు తెలియజేశారు. సహజ వనరులు, పర్యావరణ పరిరక్షణ కోసం, జల సంరక్షణ కోసం మరింత అంకితభావంతో నూతన ఉత్సాహంతో కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు.

గాయిత్రి లోఖాతాదారులకు లక్ష బీమా సౌకర్యం

కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా

ఎల్బీనగర్, మే 23,(జనం సాక్షి):

గాయత్రి బ్యాంకు దిల్సుఖ్నగర్ శాఖ యొక్క ఖాతాదారులైన కోరుకొండ రామకృష్ణ ప్రమాదవశాత్తు మరణించగా మృతుడికి ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు యందు గల గాయత్రి నిర్భయ సేవింగ్ శాఖపై ఖాతాపై గల ప్రమాద బీమా సౌకర్యం ద్వారా అతని భార్య అయినా కోరుకొండ స్వాతికి ఒక లక్ష రూపాయలు చెక్కును రంగ నరసింహ గుప్త జిహెచ్ఎంసి కార్పొరేటర్ చైతన్యపురి డివిజన్, బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ లక్ష్మి చేతుల మీదుగా అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రంగా నరసింహ గుప్తా జిహెచ్ఎంసి కార్పొరేటర్ చైతన్యపురి డివిజన్ మాట్లాడుతూ మధ్యతరగతి వ్యాపార ఉద్యోగ వర్గ ప్రజలకు రుణాలను ఇస్తున్నారని నామమాత్రపు చార్జీలతో లక్ష రూపాయల ప్రమాద బీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు మా వంతు బాధ్యతని నిర్వహించ గలుగుతున్నారని అన్నారు. అనంతరం బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ జి లక్ష్మి మాట్లాడుతూ వినియోగదారులకు మైక్రో ఏటీఎం ఎ సి పి ఎస్ సేవల ద్వారా వినియోగదారులకు చెల్లింపులు చేయడం జరుగుతుంది ఏసీపీఎస్ ద్వారానే ఖాతా ఓపెన్ చేయడం జరుగుతుంది అని తెలిపారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో మరియు జిరాక్స్ లను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామని వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై రుణాలను అందజేస్తున్నామని దిల్సుఖ్నగర్ పరిసర నగరంలో 5 బ్యాంకింగ్ కరస్పాండెంట్లను నియమించామని తద్వారా పెన్షనర్లు మరియు ఇతర ఖాతాదారులు ఇట్టి బ్యాంకింగ్ కరస్పాండెంట్ ల వద్ద బ్యాంకు లావాదేవీలను నిర్వహించుకోవచ్చని తెలియజేశారు

నేడు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం ఎన్నిక

రాజేంద్రనగర్, మే23 (జనం సాక్షి) : బండ్లగూడ జాకీర్ మున్సిపల్ కార్పొరేషన్ లో తేదీ 24 శుక్రవారం నూతన పాలకవర్గం ఎన్నికకు అన్ని ఏర్పాట్లు చేశామని బిజేఎంసీ కమిషనర్ బి. శరత్ చంద్ర పేర్కొన్నారు.అయితే అప్పటి మేయర్ మహేందర్ గౌడ్ పై అవిశ్వాస తీర్మానం పెట్టిన డిప్యూటీ మేయర్,15 మంది కార్పొరేటర్లు కలిసి పెట్టిన విషయం తెలిసిందే. ఇక ఆ తర్వాత మార్చి 21న కార్పొరేషన్ కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నెగ్గారు.తదనంతరం ఏప్రిల్ 22 న భారాస నువీడి 9 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్లో చేరి నూతన జోష్ తో ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో నూతన పాలకవర్గం ఎన్నిక జరగాల్సి ఉండగా, ఎంపీ ఎన్నికల కోడ్‌తో పాటు బిజీ షెడ్యూల్ ఉండడంతో వాయిదా పడి మే 24న నూతన పాలకవర్గం ఎన్నికకు తేదీ ఖరారు కావడంతో శుక్రవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో నూతన మహిళా మేయర్ గా 17వార్డు కార్పొరేటర్ లతా ప్రేమ్ గౌడ్ ని ఎన్నుకునేందుకు పాలకవర్గం సమిష్టిగా మద్దతు తెలిపారు. దీంతో బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తో నూతన పాలకవర్గం ఉన్నతాధికారుల సమక్షంలో ఏర్పడనుంది.

విద్యుత్ తీగ తేగి ఆవు మృతి

బషీరాబాద్, మే 23 (జనం సాక్షి) : బషీరాబాద్ మండల పరిధిలోని అల్లాపూర్ (బి) గ్రామ శివారులో విద్యుత్తు తీగ తేగి ఆవు మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం చోటు చేసుకుంది. బాధితులు రైతు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల క్రితం ఈదురుగాలుల వర్షానికి విద్యుత్తు సరఫరా లేదని విద్యుత్ అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోలేదని,గురువారం ఉదయం సమయం సుమారు 10 గంటలకు ఆవును మేతకు తీసుకెళ్లడంతో అక్కడ తెగిపడ్డ విద్యుత్ తీగ ఆవు కు తగిలి అక్కడకక్కడే ఆవు మృతి చెందిందని,నెలరోజుల క్రితం ఆవు లేగా దూడకు జన్మనిచ్చింది ఇప్పుడు లేగా దూడ పరిస్థితి ఏంటి.ఈ ఆవు మృతి చెందడం వలన రైతు కు తీవ్ర నష్టం కల్గిందని వెంటనే ఉన్నత అధికారులు స్పందించి రైతును ఆదుకోవాలని కోరుతున్నారు.

లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి శిక్షణ

మేడ్చెల్ జిల్లా శిక్షణ నోడల్ అధికారి బి.కేశురాం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 23 (జనంసాక్షి) : మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్‌లో ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి, కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్లకు, శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్టిక్ లెవెల్ ట్రైనర్స్ కౌంటింగ్ సిబ్బందికి, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ శిక్షణ, ఈవీఎం కౌంటింగ్ శిక్షణ పై సవివరంగా శిక్షణ నిర్వహించామని జిల్లా శిక్షణ నోడల్ అధికారి బి.కేశురాం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ పి.తిరుమలేష్, వి.గోపాల్, రంగాచారి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పదవులపై ఆశ లేదు... అభివృద్ధిపై ధ్యాస

పెద్దేముల్ ఎఫ్ ఎస్ సి ఎస్ డైరెక్టర్ ఎస్.నారాయన్ రెడ్డి

తాండూరు మే 23(జనంసాక్షి) :

పదవులపై ఆశ లేదని అభివృద్ధి పైనే ధ్యాస ఉందని పెద్దేముల్ ఎఫ్ ఎస్ సి ఎస్ డైరెక్టర్ మంబాపూర్

వడ్లల్లో రాళ్లను ఏరినట్లు
రైతులను ఏరుతున్నారు

- బోనస్ ఇచ్చి వడ్లు కొంటామన్నారు.. మాట మార్చారు
- వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు దిక్కు లేకుండా పోయాయి
- మంత్రులు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారు
- రైతులను కుక్కలతో పోల్చుతున్నారు
- మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, మే 23 (జనంసాక్షి) : 'ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను పక్కదారి పట్టిస్తుంది.. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు దిక్కు లేకుండా పోయాయి.. వడ్లల్లో రాళ్లను ఏరినట్లు రైతులను ఏరుతున్నారు. ఎన్నికల ముందు రూ.500ల బోనస్ ఇచ్చి వడ్లు కొంటామని హామి ఇచ్చి, ఇప్పుడు మాట మార్చుతుంది.. రాష్ట్రంలో మంత్రులు అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని, బోనస్ అడిగితే రైతులను కుక్కలతో పోల్చుతున్నారు' అని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కమలాపూర్ ఐకెపి కేంద్రాన్ని గురువారం సందర్శించిన హరీష్ రావు పలువురు రైతులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులపై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ ఘాటు విమర్శలు చేశారు. ఎన్నికల ముందు 500 రూపాయల బోనస్ ఇచ్చి వడ్లు కొనుగోలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు ఎందుకు మాట మార్చిందని విమర్శించారు. బాండ్ పేపర్ మీద రాసిచ్చి బోగస్ చేశారని హరీష్ రావు ఆరోపించారు. వంద రోజుల్లో చేస్తానన్న హామీలు ద్దిక్కు లేకుండా పోయాయని, ఎన్నికల ముందు సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తాం అని ఉంటే, ప్రజలు తగిన బుద్ధి చెప్పేవారని చెప్పారు. వడ్లల్లో రాళ్లను ఏరినట్లు రైతులను ఏరి పారేస్తున్నారని, రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతా అని ఒకరు, బోనస్ గురించి అడిగితే రైతులను కుక్కలతో మరొకరు పోల్చుతున్నారని, రైతులను అవమానపరచడం సరికాదని ఆయన హితవు పలికారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం మీద ఒత్తిడి తెస్తామని, అసెంబ్లీని స్తంభింప చేస్తామని, రైతుల కోసం ఎంత దూరమైన వెళ్లి కొట్లాడుతామని, అన్ని రకాల వడ్లకు రూ.500ల బోనస్ ఇచ్చేదాకా పోరాటం చేస్తామని తేల్చి చెప్పారు. కెసిఆర్ ఇచ్చినట్లుగానే ఈ జూన్ నెలలోనే ఎకరాకు రూ.7500ల రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనం అందించలేని పరిస్థితి దాపురించిందని, హైదరాబాదులోనే కూర్చోవడం కాదు, రైతుల కళ్ళలో కన్నీళ్లు కూడా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు. కమలాపూర్ లోని కొనుగోలు కేంద్రంలో మల్లికాంబ అనే మహిళారైతు కళ్ళల్లో నీళ్లు చూస్తే హృదయం ద్రవింపజేసిందని, హార్ట్ పేషెంట్ అయ్యుండి 15 రోజుల నుండి ఎండలో ఉంటూ వడ్లను ఆరబెట్టింది. రాత్రి వర్షం పడడంతో పంట మొత్తం తడిసింది నా పరిస్థితి ఏమిటని దిక్కుతోచని స్థితిలో రోదిస్తున్నదని చెప్పారు. క్వింటాల్ కు మూడు కిలోలు తరుగు పెడుతున్నారని, రాష్ట్రంలో రైతులందరూ ఆందోళనలో ఉన్నారని తెలియజేశారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, యుద్ధ ప్రాతిపదికన తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని, లేనట్లయితే రైతుల కన్నీరు ఈ ప్రభుత్వానికి శాపంగా మారుతుందని హరీష్ రావు ఈ సందర్భంగా జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ వికలాంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ వాసుదేవరెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, సమ్మారావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 'స్మార్ట్ కార్డుల'
భద్రతపై ఆందోళన

- నాసిరకం చైనీస్ చిప్‌లతో జాతీయ భద్రతకు ముప్పు
- రాహత్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి
- తెలంగాణ రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : తెలంగాణాలో సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డుల భద్రత ప్రమాదంలో ఉందని రాహత్ చైర్మన్ డాక్టర్ కమల్ సోయి ఆందోళన వ్యక్తం చేశారు. కలర్‌ప్లాస్ట్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సరఫరా చేస్తున్న స్మార్ట్ కార్డులపై ఆందోళన వ్యక్తం చేస్తూ రాహత్ కు పేరు లేని విజిల్ బ్లోయర్స్ లేఖ, మే 8వ తేదీ నాటి ఈమెయిల్ కాపీ ఆధారంగా తెలంగాణ రవాణా శాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమాజిగూడలోని హోటల్ మెర్క్యురీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్ (ఎస్సీఓఎస్టీఏ) ప్రమాణాలకు అనుగుణంగా ఉందని ధృవీకరించడానికి, స్మార్ట్ కార్డ్ బ్యాచ్‌లపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్డులు సరఫరా చేస్తున్న విక్రేతపై జరిమానా విధించాలన్నారు. బ్లాక్ లిస్ట్లో పెట్టడంతో పాటు కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఉల్లంఘనలను నివారించడానికి వ్యవస్థాగత మార్పులు చేయాలన్నారు. పౌరుల డేటాను సురక్షితంగా భద్రపరచాలన్నారు. జాతీయ భద్రతకు భరోసా ఇస్తూ కఠినమైన నియంత్రణ, పర్యవేక్షణ తప్పనిసరన్నారు. ప్రభుత్వ ఒప్పందాలు, సరఫరా గొలుసులో విధాన రూపకల్పన చేయాలన్నారు. ఈ స్మార్ట్ కార్డుల విషయంలో నిబంధనలను నిర్ణయించడంలో పరిశోధనలు, తదుపరి చర్యలకు ఉపక్రమించాలన్నారు. రవాణా శాఖ ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు వేగవంతమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నానని తెలిపారు. పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే, ప్రజా సంక్షేమం దృష్ట్యా న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు చెప్పారు. డేటా భద్రత, గోప్యత.. ప్రత్యేకించి ప్రభుత్వ ప్రాజెక్టులలో రాజీపడే కార్యకలాపాలలో నిమగ్నమై ఉండవచ్చని తన దృష్టికి వచ్చిందని, టెండర్ స్పెసిఫికేషన్లను ఉల్లంఘిస్తూ నాసిరకం చైనీస్ పరికరాలు ఉపయోగించడంపై ఆరోపణలున్నాయని, ఇది చేపట్టిన ప్రాజెక్టుల సమగ్రతకు గణనీయమైన ప్రమాదాన్ని కలిగిస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఐడీ డేటాను చైనాకు అనధికారికంగా బదిలీ చేయడం ఆందోళన కలిగిస్తోందని, ఇది నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా జాతీయ భద్రతకు ముప్పు కలిగిస్తుంది. దేశం, పౌరుల ప్రయోజనాలను కాపాడటానికి ఇటువంటి ఆరోపణలను క్షుణ్ణంగా విచారించడం అత్యవసరమని, ప్రమాణాలకు అనుగుణంగా ఉండే మెటీరియల్‌లను డెలివరీ చేయడంలో వైఫల్యం చెందడం వల్ల ప్రభుత్వ ప్రాజెక్టుల నాణ్యతపై ప్రభావం పడుతుందని తెలిపారు. గత ఏడాది ఫిబ్రవరి 2023లో తన మాజీ ఉద్యోగి తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ద్వారా కలర్‌ప్లాస్ట్‌కు ఒక సంవత్సరానికి రేట్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రీ-ప్రింటెడ్ పీవీసీ 64కే స్మోస్టా స్మార్ట్ కార్డ్‌లను సరఫరా చేయడానికి టెండర్‌ను అందజేసింది. కలర్ ప్లాస్ట్ నిర్దిష్టంగా అవసరమైన, టెండర్‌లో తప్పనిసరి చేసిన విధంగా నాన్-కాంప్లైంట్ స్మార్ట్ కార్డ్ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అప్లికేషన్స్ నిబంధనలకు అనుగుణంగా స్మార్ట్ కార్డ్‌లను సరఫరా చేయాలన్నారు.

బీఆర్ఎస్ పార్టీవి శవ రాజకీయాలు

- బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యకు దురాలవాట్లు, భూతగదాలు, ఆర్థిక లావాదేవీలే కారణం
- శ్రీధర్ రెడ్డి హత్యను అడ్డం పెట్టుకుని తనపై బురదజల్లుతున్నారు
- ఇక కేటీఆర్ ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరు
- ఇకనైనా శవ రాజకీయాలు మానండి: మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, మే 23 (జనంసాక్షి) : కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నేత శ్రీధర్ రెడ్డి హత్యకు దురాలవాట్లు, భూతగదాలు, ఆర్థిక లావాదేవీలే కారణమని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల జరిగిన హత్యను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ నాయకులు రాజకీయ హత్యగా చిత్రీకరించడం దుర్మార్గపు చర్య అని మంత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో హత్య జరిగిన రాజకీయ రంగు పులిమి లేనిపోని రాద్దాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యకు దారితీసిన పరిస్థితులు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని కేటీఆరే చెప్పుతున్నారని, అట్లాంటప్పుడు రాజకీయ హత్య అని ద్వంద వైఖరి ప్రదర్శించడం ఆయనకే చెల్లిందని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తప్పుపట్టారు. హత్య జరిగిన క్షణాల్లోపే కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు రంగంలోకి దిగి ప్రభుత్వంపై, వ్యక్తిగతంగా తనపై దుష్ప్రచారం చేయడాన్ని మంత్రి తీవ్రంగా ఖండించారు. ఏం జరిగింది, ఎలా జరిగిందని తెలుసుకోకుండానే కావాలనే తనపై బురదజల్లే ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. శవ రాజకీయాలు చేయడం బీఆర్ఎస్‌కు కొత్త కాదని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎక్కడ శవముంటే అక్కడ గద్దలా వాలి, నేరారోపణలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. నేనెంటో ప్రజలకు తెలుసని, ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేదని, అందుకే కోల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా తనను ఆదరిస్తున్నారని, ఇలా తమ ఎదుగుదలను చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. గంట్రావ్ పల్లి గ్రామంలో జరిగిన మల్లేష్ హత్యకు కూడా రాజకీయ రంగు పులిమారని, ఇప్పుడు శ్రీధర్ రెడ్డి హత్యను కూడా రాజకీయం చేస్తున్నారని దుయ్యబట్టారు. శ్రీధర్ రెడ్డి హత్యపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారని, విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని, అప్పటి వరకు బీఆర్ఎస్ నాయకులు వేచి ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ నీచ రాజకీయాలు పరాకాష్టకు చేరాయని, ఇకనైనా శవ రాజకీయాలను చేయడం మానుకోవాలని కేటీఆర్ కు హితవు పలికారు.

గాజులరామారంలో జరిగిన ఘటనపై
జీహెచ్ఎంసి కమిషనర్ సీరియస్

- ఇద్దరు ఎస్ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించిన జోనల్ కమిషనర్

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : కూకట్‌పల్లి జోన్ గాజులరామారం సర్కిల్‌లో మహిళ శానిటేషన్ వర్కర్ పై లైంగిక వేధింపుల వార్తలపై జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి వివరాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూకట్ పల్లి జోనల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, మెడికల్ ఆఫీసర్‌లతో విచారణ జరిపించారు వారు నివేదిక అందించడంతో కఠినమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో శానిటేషన్ సూపర్వైజర్‌లు పి.కిషన్, సిహెచ్. ప్రణయ్ లను విధుల నుండి జోనల్ కమిషనర్ తొలగించారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిహెచ్ఎంసి కమిషనర్ హెచ్చరించారు.

సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌తో ఆస్ట్రేలియా ట్రేడ్, ఇన్వెస్ట్మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్ భేటీ!

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)

సింగరేణి సంస్థ రానున్న ఐదేళ్లలో నిర్దేశించుకున్న 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర సాంకేతిక విషయాల్లో సహకారం అందించే విషయంలో ఆస్ట్రేలియా దేశ ట్రేడ్, ఇన్వెస్ట్మెంట్ కమిషనర్ డెనిస్ ఈటెన్ సంస్థ సీఎండీ ఎన్.బలరాం తో గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం సింగరేణిలో ఉపయోగిస్తున్న సాంకేతికత, ఈ ఏడాది సాధించిన రికార్డు ఉత్పత్తి, రవాణా, టర్నోవర్, సంస్థ వృద్ధి రేటును వివరించారు. అలాగే బొగ్గు ఉత్పత్తితో పాటు వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా థర్మల్, సోలార్ రంగాల్లోకి విజయవంతంగా అడుగుపెట్టిందని వివరించారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రంగాల్లోని అవకాశాలను పూర్తిగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.. గతంలో ఆస్ట్రేలియా దేశానికి చెందిన సింటార్స్ తదితర సంస్థలతో మైనింగ్, రక్షణ, సాంకేతిక విషయాల్లో సేవలు స్వీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. సింగరేణిలో అమలవుతున్న సాంకేతికతను, సంస్థ చేపడుతున్న నూతన వ్యాపార విస్తరణ చర్యలను స్వయంగా చూసేందుకు నవంబరులో ఆస్ట్రేలియా బృందం సింగరేణి ప్రాంతంలో పర్యటించనుందని ఆస్ట్రేలియా కమిషనర్ డెనిస్ ఈటెన్ వివరించారు. అలాగే మైనింగ్ రంగంలో నూతన సాంకేతికతలపై తమ దేశంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంస్థ ప్రగతికి దోహదపడే అంశాలపై తగిన సహకారాన్ని అవసరమైనప్పుడు స్వీకరిస్తామని సీఎండీ ఎన్.బలరామ్ పేర్కొన్నారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన ఈ భేటీలో ఆస్ట్రేలియా కమిషనర్తో పాటు బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ రామకృష్ణ దస్త్రాల ఉన్నారు.

మంత్రి వెంకట్‌రెడ్డికి ఉప్పల జన్మదిన శుభాకాంక్షలు

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వాటర్స్‌లో మర్యాద పూర్వకంగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త కలిసారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ముజీబ్‌కు సన్మానం

హైదరాబాద్, మే 23 (జనంసాక్షి) : పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ అధ్యక్షులు మొహమ్మద్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో టీఎన్జీవో యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం హుస్సేని(ముజీబ్)ని కేంద్ర సంఘ ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న సందర్భంలో సన్మానించారు. కార్యక్రమంలో పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి ఆర్.సుదర్శన్, అసోసియేట్ అధ్యక్షులు జి.ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.నరసింహ, ఉపాధ్యక్షులు మధుసూదన్, కార్యవర్గ సభ్యులు టి.రాజ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు షర్ఫుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర సంఘ నాయకులు శ్రీ. మారం జగదీశ్వర్‌పై పూర్తి నమ్మకం ఉందని, డాక్టర్ ముజీబ్ చేస్తున్న సేవలను గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించాలని శిరస్సు వంచి కోరారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370